లక్ష్మీపతి, ఆచంట

చంటిబిడ్డ

చెన్నపట్టణము, 1918

Record no. 260

Lakṣmīpati, Ācanṭa

Canṭibiḍḍa

Cennapaṭṭaṇamu, 1918

Record no. 260

Bibliographic Record Target

లక్ష్మీపతి, ఆచంట.

చంటిబిడ్డ / ఇది ఆచంట-లక్ష్మీపతి గారిచే రచియింపఁబడినది.- 1. కూర్పు.- చెన్నపట్టణము : ఇండియా ప్రింటింగ్ ముద్రాక్షరశాల, 1918.

xii, 168 p. ;18 cm.

Record no. 260

Lakṣmīpati, Ācanṭa.

Canṭibiḍḍa / idi Ācanṭa-Lakṣmīpati gāricē raciyimpam̐baḍinadi.- 1. kūrpu.- Cennapaṭṭaṇamu : Iṃḍiyā priṇṭiṅg Mudrākṣaraśāla, 1918.

xii, 168 p. ;18 cm.

Record no. 260

చంటిబిడ్డ

ఇది

'జీవశాస్త్రము' 'కలరా' 'చలిజ్వరము' 'అంటువ్యాధులు' మున్నగు
గ్రంథముల కర్తలును, ఆంధ్రవిజ్ఞానసర్వస్వమందలి ప్రకృతిశాస్త్ర
భాగమునకు సంపాదకులును, చెన్నపురి ఆయుర్వేద
కళాశాలలో శల్యతంత్రోపాధ్యాయులును,
అఖిలభారత ఆయుర్వేదమహామండలి
సభ్యులును, అగు

డాక్టరు: ఆచంట లక్ష్మీపతి, బి.ఏ., ఎం.బి., సి.ఎం., గారిచే
రచియింపఁబడినది.

మొదటికూర్పు 2000.

చెన్నపట్టణము:
ఇండియా ప్రింటింగ్ ముద్రాక్షరశాలయందు
ముద్రింపఁబడియె.
1918

 [వెల రూ. 1-0-0

విషయసూచిక.

పీఠిక.

మనదేశమున జననమరణముల లెక్క శ్రద్ధతో వ్రాయు చుండుట లేనిమాట సత్యము. అయినను నాకుదొరికిన సంఖ్యలనుబట్టిచూడగా ఈదేశములో పుట్టిన బిడ్డలలో అయిదింట నొకరు మొదటిసంవత్సరముననే మృత్యువుపాలబడుచున్నారని తెలియుచున్నది. ఈస్థితి చూచినయెడల చంటిబిడ్డల ఆరోగ్యము యొక్క అవశ్యకత మీకు తేటబడును.

1915-వ సంవత్సరము లెక్కల ప్రకారము చెన్నపట్టణములో సంవత్సరము ఒక్కింటికి జననముల సంఖ్యకంటె మరణముల సంఖ్య 257 హెచ్చుగనున్నది. కలకత్తాలో పుట్టకలకంటె చావులు 9,000 లకు పైగానున్నది. ఏటేట జనసంఖ్య హెచ్చుటకు బదులు తగ్గిపోవుచున్నది. ఇది మిక్కిలి శోచనీయము. ప్రతి సంవత్సరమును ఇట్లే పుట్టకలకంటె చావులు హెచ్చుచున్న యెడల దేశమున కెంతటి హాని చేకూఱునో గమనింపుడు. సర్వవిధముల ప్రయత్నించి మనదేశమున మరణముల సంఖ్య తగ్గించుట మహాజనులకర్తవ్యము.

పుట్టినయేడాది ముగియకమునుపే వేయింట రెండువందల యేబది బిడ్డలీదేశమున మృతినొందుటకు కారణము లైదువిధములైనవి కానవచ్చుచున్నవి.

(1) తల్లులయజ్ఞానము (2) తల్లితండ్రుల పసితనము, నిస్సత్తువ (3) మంత్రసానుల చేతకానితనము (4) ఇండ్ల యొక్కయు గ్రామములయొక్కయు అపరిశుభ్రత, అనారోగ్యత (5) మశూచకము, చలిజ్వరము మొదలగు సాంక్రామిక వ్యాధులు.

తక్కినవటుండ నిచ్చి తల్లుల యజ్ఞానమును కొంతవర కైనను తొలగించుటకీ చిన్న పుస్తకము సహాయపడునని తలచుచున్నాను. తనబిడ్డ ఆరోగ్యమును కాపాడుకొనుటకు ఇది సహాయపడినదని ఒక్క తల్లియైనను తనమనస్సున సంతృప్తి జెందినయెడల నేను ధన్యుడను.

19 హారిసు రోడ్డు,
చెన్నపట్టణము.
30-9-18.

ఆ. లక్ష్మీపతి.

ఉపోద్ఘాతము.

బిడ్డలను పరీక్షించుట స్వభావ తెలియని దూరదేశములలో ప్రయాణము చేయుటవంటిది. ప్రయాణీకులయినను సంజ్ఞలచే తమపనియొకానొకప్పుడు చక్కపెట్టుకొనవచ్చును. కాని బిడ్డలయెడల నిట్టియాధారముకూడ కానరాదు. వారిభాష తల్లులకు కొంతవరకు తెలిసినను ఇతరులకు అర్థముకాదు.

కాబట్టి బిడ్డలకు జబ్బుచేసినప్పుడు వారల పూర్వచరిత్ర వైద్యునికి మిక్కిలి ఉపయోగకరము. కొందరుతల్లులు బిడ్డకేమి జబ్బని వైద్యులడిగినతోడనే గోరంతలు కొండంతలుచేసి చెప్పుదురు. ఇట్టి అసందర్భపు మాటలతో ప్రయోజనము లేదని విసుకుజెందక, బిడ్డ యారోగ్యము గోరు మంచివైద్యులు దాదిగాని తల్లిగాని చెప్పెడు విషయముల నన్నిటిని చక్కగ వినెదరు. ఏలయన మిక్కిలి స్వల్ప విషయములను గూడ చక్కగ పరిశీలించుశక్తి బిడ్డతో నెల్లప్పుడు నుండువారలకేగాని అప్పుడప్పుడుజూచు నితరులకుండుట కష్టము. ఒకానొకప్పుడు వైద్యులకు తెలియని విషయములుకూడ జ్ఞానవంతులగు తల్లులు గ్రహింపగలరు. ఒకనూతన వైద్యుడు మూడునెలల బిడ్డనుజూచి పండ్లు ఎన్నివచ్చినవని అడుగగ తల్లి నవ్వినందున తప్పేమున్నది?

బిడ్డల పెంపులో గమనింపదగిన నిచ్చెనమెట్లు కొన్ని గలవు.

మొదటి మెట్టు:—తలనిలుపుట. బిడ్డసామాన్యముగ 3 లేక 4 నెలలుముగియులోపల తలనిలుపగలిగియుండును. ఇంత వరకు మెడమీదత్రాసువలె తల ఇటునటు నూగుచుండును. 4 నెలలు ముగియువరకు బిడ్డ తలనిలువనియెడల అనారోగ్యమని గ్రహింపవలయు.

2-వ మెట్టు—పండ్లు వచ్చుట. పాలపండ్లు బిడ్డలకు సామాన్యముగా ఆరవనెలలో ప్రారంభించును. మూడుసంవత్సరములు పూర్తియగునప్పటికి పాలపండ్లు 20 యును పూర్ణముగ బయిటపడును. ఈపండ్లు సామాన్యముగ ఆరవయేట నూడిపోవుటకు ప్రారంభించి ఖాయమయినపండ్లు మొలచుటకు ప్రారంభించును. ఖాయపుపండ్ల సంఖ్య 32.

3-వ మెట్టు—బిడ్డ కూర్చొనుట. సామాన్యముగా బిడ్డలు 9 మొదలు 12 నెలలలోపల కూర్చుందురు. 12 మొదలు 18 నెలలలోపల నడిచెదరు. 2 సంవత్సరములలోపల చక్కగ మాట్లాడెదరు.

4-వ మెట్టు:—మాడపట్టు మూసుకొనిపోవుట. ఇది సాధారణముగ 18 మొదలు 24 నెలలలో మూసికొని పోవును. ఈ మాడపట్టు బిడ్డలకు నాడివంటిది. దీనియొక్క హెచ్చు తగ్గులనుబట్టి బిడ్డ ఆరోగ్యముగ నున్నదనియు బలహీనముగా

నున్నదనియు చెప్పవచ్చును. మాడపట్టు ఎంత దించుకొని పోయియున్నదో బిడ్డ అంతబలహీనముగ నున్నదని గ్రహించవలెను. మిక్కిలి ఉబ్బుకొనికంతివలె తెలియుచున్నను వ్యాధియని యెరుగవలెను. మాడపట్టు చుట్టుప్రక్కలనున్న యెముక మిక్కిలి మెత్తపడియున్నట్లుగాని, బొద్దుగచేరుకొని యున్నట్లు గాని కనపడినయెడల అనారోగ్యము.

బిడ్డ సామాన్యముగ ఆరోగ్యమరిదున్నదా లేదాయన్న తెలిసికొనుటకు ఇంకను కొన్నిముఖ్యమైన అంశములు గలవు.

1. తూనిక:—బిడ్డ ఆరోగ్యస్థితి తెలుపుటకు తూనికకంటె నిశ్చయమైన నిదర్శనమేదియును లేదు. ఎప్పుడు బిడ్డ తూనిక తగ్గుచున్నదో అప్పుడు రోగము నిశ్చయముగా నున్నదని తలపవలెను. సామాన్యముగా అప్పుడుపుట్టిన బిడ్డ 7 పవును లుండును (పవును అనగా రమారమి 40 తులములు). నాలుగు నెలలు నిండువరకు 14 పౌనులు, పన్నెండునెలలు నిండువరకు 21 పవునులును ఆరోగ్యవంతమైన బిడ్డ తూనిక యుండ వలెను.

(2) విరేచనము:—అను దినమును క్రమముగ విరేచనమగుచున్నయెడల సాధారణముగా బిడ్డకేవ్యాధియునురాదు. బిడ్డకు మొదటి రెండునెలలు నిండువరకు దినమునకు మూడు నాలుగు విరేచనములు కావలెను. కొంచెము పులుపు వాసన ఉన్నను దుర్వాసన ఉండకూడదు. సామాన్యముగ

కొంచెము పలుచగ నుండునుగాని అందు పెరుగు తునకలవలె తెల్లనినలుసులున్న యెడల బిడ్డకు పాలు హెచ్చుగా నున్నవని తెలిసికొనవలెను. రెండు నెలలు దాటినతరువాత ఏడాదివరకు బిడ్డకు ప్రతిదినము రెండుసార్లు విరేచనమగుచుండుట మంచిది. విరేచనము గుజ్జుగా నుండవలెనుగాని గట్టిగ నుండరాదు. పసుపు పచ్చగనుండవలెనుగాని తెల్లగనుండరాదు.

(3) ముఖవర్చస్సు:—బిడ్డకు శరీరములో నేదైనను వ్యాధియున్నయెడల ముఖములో వెంటనే తెలియును. పెద్దవారలు తమవ్యాధుల నొకానొకప్పుడు దాచుకొన చూచెదరు. వారలకట్లు సాధ్యపడినను పడనచ్చునుగాని బిడ్డల అనారోగ్యము వారల ముఖముపై వ్రాసినట్లు తెలియుచుండును. తెలివిగలవారలు బిడ్డముఖముచూచియే వారలకు కడుపునొప్పి యున్నదని గాని ఊపిరి సరిగా ఆడడములేదనిగాని, జ్వరమున్నదనిగాని చెప్పగలరు. కాని బిడ్డముఖములో నెన్నడును కొత్తవారలు దృష్టినిలిపిచూడరాదు. అట్లుచూచినయెడల బిడ్డతప్పక యేడ్చును. బిడ్డముఖము చిరునవ్వుతోనుండి యున్నదా? బిడ్డ బొమ్మలతో ఆడుకొనుచున్నదా? మూలుగుకొనుచు, తెంపులేక యున్నదా? మొదలగు విషయములను గుర్తించుట కష్టము కాదు.

(4) పొట్ట:—బిడ్డలకు కాలేయము (Liver) సహజము కొంచెము పెద్దదిగ నుండును. అందుచేత పొట్టకూడ కొద్దిగా

పెద్దదిగనున్నట్లు కనుపడును. ఇదియొక వ్యాధికాదు, కాని తనబిడ్డపొట్ట సాధారణముగా నున్నదానికంటె పెద్దగనున్నదనియు, గట్టిగనున్నదనియు ఉబ్బుకొని యున్నదనియు తల్లులు అభ్యాసముచేత చెప్పగలరు.

పైనవివరించినవిగాక బిడ్డకు ఊపిరి మిక్కిలి వేగముగ నున్నను, బిడ్డ ఆయాసపడుచున్నట్లున్నను గమనింపవలెను. ఎదురురొమ్ములో గైయుమనిగాని, గురగురమనిగాని శబ్దములున్నయెడల గమనింపవలెను. కాళ్లు, చేతులు, మెడ, మొదలగు అంగములు సామాన్యముగ నుండునట్లు సులభముగ ఆడుచున్నవా లేక కొద్దిగ బిగుసుకొనియున్నట్లున్నవా అనునది తప్పకగమనింపవలెను. శరీరముమీద దద్దుర్లుగాని మచ్చలుగాని యున్నయెడల గుర్తించవలెను. వెచ్చవెచ్చనిచేతులతో బిడ్డనునఖశిఖ పర్యంతము నెమ్మదిగ తడవిచూచుచు ఎక్కడనైనను నొప్పియున్నయెడల గ్రహించవలెను. చలిచేయితగిలినబిడ్డ యేడ్చును. శరీరము చల్లగానున్నదా, వేడిగానున్నదా, చెమటగానున్నదా పొడిపొడిగా నున్నదా? కాలేయము ప్లీహము పెరిగియున్నవా, గట్టిగారాయివలె నున్నవా లేక సహజముగ మెత్తగనున్నవా? ఎముకల సంధులలో బుడుపులుగా పెరిగియున్నవా? నొప్పులున్నవా? మొదలగు విషయమును ర్చి బిడ్డను చక్కగ మచ్చికచేసి శరీరమంతటను శోధింపవలెను. మెల్లమెల్లగ పొట్టపైనను, ఎదురురొమ్ముపైనను

తట్టిచూచి శబ్దమువలన వ్యాధిగ్రహింపవచ్చునుగాని బిడ్డను భయపెట్టి ఏడిపించిన బొత్తిగ పరీక్షించుటకు వీలు లేకపోవును.

బిడ్డయొక్క నాలుకను, గొంతుకను పరీక్షించుట యొకానొకప్పుడు మిక్కిలి యవసరము. నోరు తెరపించుట కష్టముగనున్న యెడల నొకయుక్తిగలదు. క్రింది పెదవి క్రిందివరుస పండ్లమీద అనునట్లు నొక్కినయెడల ఆ పెదవిని విడిపించుకొనుటకై బిడ్డ సాధారణముగా నోరు తెరచును. లేదా ముక్కు రంధ్రములు రెండును బిడ్డ నోటితో ఊపిరిపీల్చుకొనువరకును మూసినయెడల నొకానొకప్పుడు నోరుపరీక్షించుటకు వీలగును. చక్కని వెలుతురులో నాలుకను గొంతుక వెనుకభాగమును పరీక్షింపనగును.

చంటిబిడ్డ

మొదటి ప్రకరణము

చనుపాలు

పాలుత్రాగు కాలములో చంటిబిడ్డలను పెంచుట తల్లులకందరకును మిక్కిలి కఠినమైనపని. మన దేశములో బాలికలే తల్లులగుటచేతను, విద్యాగంధ మెరుగని ముసలమ్మలే బోధకులగుట చేతను అనేకానర్థములకు వీలు కలుగుచున్నది. బిడ్డను పెంచుట కూడ ఒక విద్యయని తెలిసికొని తల్లులందరును దానిని చక్కగ నభ్యసించి పిల్లలను పెంచుకొనవలెను. స్త్రీలు వివాహమాడుటకు పూర్వమే ఈ శాస్త్రమును చక్కగా నభ్యసింపవలెను. మన దేశమునందు పుట్టిన బిడ్డలలో రమారమి నాలుగవవంతు పుట్టిన ఏడాదిలోపలనే మృత్యువు వాతబడుచున్నారని జనాభాలెక్కలనుబట్టి తెలియుచున్నది. ఇట్టి యకారణ మృత్యువునకు మనతల్లులే కారకులు.

మన దేశములోని ఆడువారల స్వకార్య ధురంధరత్వము అంతవరకు రాలేదు కాని నాగరికత ముదిరిన ఐరోపి

యనులలో కొందరు తల్లులు తమ ఆటపాటలకును, తమ వృత్తులకును, అభ్యంతరము కలుగునను ఉద్దేశముతో తమ బిడ్డలకు స్వంతముగా పాలియ్యక పోతపాలు పోయించి దాదులచే పెంపించుదురు. ఎంత శ్రద్ధగ మన మావును మేపినను, ఎంత మంచి యావుల పాలు మనము సంపాదించినను, ప్రస్తుతము వెలసియున్న పాలబుడ్లతో దేనితో తయారు చేసినను పోతపాలు తల్లిపాలతో సమానము కానేరవు. తనవద్ద పాలుండియు బిడ్డకియ్యక యేతల్లి దాచుకొనునో ఆ తల్లికి తనబిడ్డయం దెంత మాత్రము ప్రేమ యుండజాలదు. అట్టి మాతాశిశువులకు ఒండొరులయందు నిజమైన ప్రేమ జనించుట కవకాశముండదు. బిడ్డకు పాలిచ్చుట వలన తనకుగల ఆనందమును ఒక్కసారి తెలిసికొనిన తల్లి ఆ యానందమును తాను పోగొట్టుకొని దాదినెన్నడు అనుభవింప నీయదని చెప్పవచ్చును. అనివార్యమైన ఏకారణముచేత నైనను తల్లి తన బిడ్డకు పాలిచ్చుకొన వీలులేక పోయినపుడు ఆ తల్లియొక్క దుర్దశమిక్కిలి శోచనీయము. ఇదిగాక ఎపుడుబిడ్డకు పాలిచ్చుట విడిచి పెట్టునో అపుడు తల్లి తిరిగి వెంటనే గర్భవతియగుట తటస్థింప వచ్చును. ఈ భయముచేతనైనను బిడ్డలయందిష్టములేని తల్లులు తమబిడ్డలకు పాలిచ్చెదరు గాక!

బిడ్డకు పాలిచ్చుటకంటె తన ఆటపాటలే హెచ్చని[illegible] తల్లినడత ఎంతయు గర్హ్యము నీచమునని మేము నొక్కివ్రాయ

నక్కరలేదు. ఎలయనగా చంటిబిడ్డల నిమిత్తమై ప్రత్యేకముగా నుంచబడిన ఆసుపత్రులలోని లెక్కలనుబట్టి చూడగా అతిసార విరేచనములచే మృతినొందు చిన్నపిల్లలలో నూటికి 90 మంది పోతపాలు త్రాగువారుగ కనబడుచున్నారు. చిన్న పిల్లలకు అజీర్ణము, మలబద్ధకము, శీతభేది, అతిసార విరేచనములు,ఇవియన్నియు పోతపాలమూలముననే కలుగును. పిల్లలు చక్కగా పెరుగకపోవుట, పండ్లు త్వరగా రాకపోవుట, నడుము నిలవక పోవుట, ఎముకలు వంగిపోవుట, మొదలగు ఈవ్యాధులకన్నిటికిని పోతపాలేముఖ్య కారణము. తల్లివద్దపాలు తగ్గిపోవుటచేగాని మరి యేకారణముచేగాని తనపిల్లకు కడుపునిండుటకు తగినన్నిపాలు ఇయ్యలేకపోయినప్పటికిని ఎంతవరకు తనవల్లనగునో అంతవరకు తనపాలిచ్చి బిడ్డకు కావలసిన మట్టుకు పోతపాలు పోయవచ్చును. అట్లుచేయుట వలన అనేక వ్యాధులు ఆపిల్లల దరిచేరవు.

బిడ్డయొక్క ఆహారములలో చనుపాలకు మించినది ప్రపంచమునం దేదియునులేదు. ఇందు బిడ్డలకు గావలసిన పదార్థములన్నియుకలవు. బిడ్డ కక్కరలేనిపదార్థ మొకటియు లేదు. ఇందుచేతనే చనుపాలు దొరకని సమయములలో ఇతరాహారములను మనము బిడ్డలకొరకై తయారు చేయునప్పుడు మనముపయోగించు పదార్థములన్నిటిని చేర్చి చనుపాలతో సమానమయిన పదార్థమును ఎంతవరకు చేయగల

మో అంతవరకు జేయ ప్రయత్నించుచున్నాము. ఒక్కొక పదార్థ మెక్కువయినను కష్టమే. తక్కువయినను కష్టమే.

చనుపాలు సరికిసరి నీటికంటె కొంచెము బరువుగా నుండును. ఒక అర సోలెడునీళ్లు పదితులములుతూగినయెడల అరసోలెడు చనుపాలు పదితులముల పావు తూగును. కాని కొందరి పాలు కొంచెము చిక్కగనుండి కొంచెమెక్కువ తూగుటయు, మరి కొందరిపాలు మిక్కిలి పలుచగనుండి తక్కువ తూగుటయు గలదు. సామాన్యముగా చనుపాలలో నూటికి మాంస కృత్తులు 1½ పాళ్లును క్రొవ్వు 3½ పాళ్లును పాలచక్కెర 7 పాళ్లును ఉప్పుపదార్థములు ¼ పాలును నీరు 87¾ పాళ్లు చొప్పున నున్నట్లు కానవచ్చు చున్నది. ఈ క్రిందిపట్టీని చూచినయెడల చనుపాలకును ఇతరములగు పాలకునుగల భేదము తెలియగలదు.

	నీరు	విరిగెడు మాంస కృత్తు	విరగని మాంస కృత్తు	క్రొవ్వు	చక్కెర	ఉప్పు
ఆవు	87.0	3.3	0.4	3.8	4.8	0.7
మేక	86.0	3.5	0.9	4.6	4.3	0.7
మనిషి	88.0	1.0	0.7	3.3	6.8	0.2
గాడిద	90.0	0.9	0.6	1.2	6.8	0.5
గుఱ్ఱము	90.7	1.25	0.75	1.17	5.7	0.35

చనుపాలలోని పదార్థముల యొక్క సరియైన [illegible]ణములను తెలిసికొనుటలో ననేక కష్టములు కలవు. ఒక

చంటిలోని పాలనన్నిటిని పిండి ఆపాలను పరీక్షించిన గాని, ఆమనిషియొక్క పాలసత్తువ నిజముగా తెలియదు. చంటిలోని పాలనన్నిటిని పిండుట సులభ సాధ్యము కాదు. కాబట్టియే అనేకమంది శోధకులు చనుపాలను పరీక్షించి నప్పుడు వారి శోధనలలో కొద్దిపాటి భేదములు కలుగుచుండును. మొట్ట మొదట వచ్చు పాలను శోధించిన వారు పాలు పలుచగనున్న వనియు, చివరవచ్చుపాలను శోధించినవారు చిక్కగ నున్నవనియు చెప్పవచ్చును. ఒక చంటిపాలను మూడు భాగములుగా విభజించి మొదటి మూడవభాగ మొకగిన్నెయందును మధ్య మూడవ భాగమొక గిన్నెయందును కడపట బొట్లుబొట్లుగా వచ్చు మూడవ భాగమొక గిన్నెయందును పిండి వానిని పరీక్షించిన యెడల ఈ క్రింది రీతిని భేదము తెలియగలదు. మొదటి పాలలో వేయింటికి 14 పాళ్ళ చొప్పునను మధ్య పాలలో 32 పాళ్ళ చొప్పునను కడపటి పాలలో నూరుపాళ్ళ చొప్పునను క్రొవ్వుపదార్థ ముండును. ఇదేప్రకారము మాంస కృత్తు పదార్థముకూడ మొదటి పాలలో కొద్దిగనుండి క్రమముగ కడపటి పాలలో హెచ్చుగ నుండును. కాబట్టి చనుపాలలోని పదార్థములు సగటున తెలిసికొనవలెననిన ఒకచంటియందలి పాల నంతయును పిండవలెను. ఇట్లు చేయుట సులభము కాదు. కావున ఒకబిడ్డ పాలుత్రాగుటకు ఎంతకాలము పట్టునో మొదట తెలిసికొని అందులో మూడవవంతు కాలము

బిడ్డను పాలుత్రాగ నీయవలెను. సామాన్యముగా అయిదు నిమిషములు త్రాగనిచ్చిన పిమ్మట అరగిద్దెడు పాలకు తక్కువ గాకుండ పిండి ఆపాలను పరీక్షింపవలెను.

సూక్ష్మదర్శినిలో చూడగా చనుపాలలో రెండు పదార్థములు కనుపడును.

(i) పలుచని నీటివంటి పదార్థము.

(ii) ఆనీటివంటి పదార్థములో గుండ్రని పూసలవలె తేలుచుండు క్రొవ్వుపదార్థపు నలుసులు.

(I) నీటివంటి పదార్థములో రెండుజాతుల మాంసకృత్తులును, ఒకజాతిచక్కెరయు గలవు.

మన జీర్ణకోశములో నుండు రసముతో కలిసినప్పుడు విరిగిపోవు స్వభావముగల మాంసకృత్తు ఒకటిగలదు. ఈ విరుగుడులోని తునకలు మిక్కిలి చిన్నవిగ నుండును. ఆవుపాల విరుగుడులోని తునకలు పెద్దవిగనుండునని క్రింద చదువగలరు.

అట్లు కలిసినప్పుడు విరిగిపోవని మాంసకృత్తు పదార్థము మరియొకటి గలదు. పాలు విరిగిపోయినప్పుడు అందలి విరుగుడును వడపోసి యెత్తివేయగా క్రిందికి దిగిన నీళ్లలో నిది లీనమైయుండును.

చనుపాలలోని చక్కెరకు పాలచక్కెర అనిపేరు. ఈచక్కెరకును చెరుకు ద్రాక్షరసము మొదలగు వానిలోని చక్కెరలకును భేదముకలదు.

(II) చనుపాలలోని క్రొవ్వు నలుసులు మిక్కిలి సూక్ష్మమైన పరిమాణము గలవి. ఇవి ఒక్కొక్కటి అంగుళములో రెండు వేలవవంతు మొదలు పండ్రెండువేలవ వంతు వరకు నుండును. అనగా అంగుళము పొడుగులో 12,000 వేల నలుసులుపట్టును. ఆవుపాలలోని క్రొవ్వునలుసులు వీనికంటె ననేకరెట్లు పెద్దవిగ నుండును. వీనినిబట్టి చనుపాలకు ఆవుపాలకును గల భేధములనుచక్కగ గుర్తింపగలరు.

చనుపాలు తియ్యగ నుండి కొంచెము నీచువాసనగా నుండునుగాని పులుపుండదు. ఆవుపాలలో కూడ పితికినవెంటనే పులుపుండక పోవచ్చునుగాని నిలువయుంచిన కొలదిని పులిసిపోవు స్వభావము కలదు. చనుపాలలో సాధారణముగా సూక్ష్మజీవులెన్నడునుండవు. కాని చనుమొనలు పరిశుభ్రముగా నుంచుకొననియెడల కొన్ని సూక్ష్మజీవులు పాలువచ్చు గొట్టములలోజేరి పాలలో నప్పుడప్పుడు కానవచ్చుట గలదు.

జున్నుపాలు:—ప్రసవమయిన తరువాత తల్లికి సరిగా పాలుపడక పూర్వము మొదట రెండు మూడు దినముల వరకును జున్నుపాలు అని యొకతరహా పాలుపడును. ఈపాలలో మాంసకృత్తులు హెచ్చుగను క్రొవ్వును చక్కెరయును తక్కువగను ఉండును. ఈపాలలో నొకబొట్టును సూక్ష్మదర్శినితో పరీక్షింపగా పెద్దపెద్దగుండ్రని నలుసులు కనబడును.

జున్నుపాలు ఆహారముగనే గాక బిడ్డలకు విరేచనకారిగ గూడ నుపయోగపడును. కాబట్టి ఈపాలను బిడ్డలకు తప్పక ఇయ్యవలెను. ఇట్టీపాలను కుడుపుటచే తల్లియొక్క గర్భకోశము శీఘ్రముగ ముడుచుకొని యథాస్థితినొందును.

రెండవ ప్రకరణము

పాలిచ్చు విధము, సమయము

త్రల్లికి ప్రసవాయాసము తీరినవెంటనే, అనగా బిడ్డ పుట్టిన తరువాత మూడు నాలుగు గంటలలోపలనే బిడ్డకొక్క సారి తల్లి పాలు కుడుపవలెను. ఇట్లుచేయుట మొదటి ప్రసవమునందు మిక్కిలి ఆవశ్యకము. ప్రసవమయిన దినమునను సామాన్యముగా తరువాత రెండుమూడు దినములవరకును తల్లివద్ద బొత్తిగ పాలుండకపోవచ్చును. అయినను ఈ మొదటిదినములలో బిడ్డకప్పుడప్పుడు పాలుకుడుపు చుండుటవలన తల్లిగర్భ కోశము చక్కగ ముకుళించి చిన్నదగును. చన్నులకును గర్భ కోశమునకును నరములద్వారా సంబంధముగలదు. ఇందుచేతనే పాలుపడక పూర్వముకూడ అప్పుడప్పుడు తల్లి చన్నులను కుడుపుచుండవలెనని చెప్పియుంటిమి.

ఇదిగాక ప్రసవమయినది మొదలు తల్లివద్ద చిక్కని పాలు (జున్నుపాలు) కొద్దిగానుండునని చెప్పియుంటిమి. దీనినే కొందరు ముఱ్ఱు పాలందురు. దీనిని త్రాగినయెడల బిడ్డకు చక్కగా విరేచమగును. ఈ దినములలో బిడ్డకు కావలసిన ఆహారమంతయు ఈ జున్నుపాలలోనే కలదు. సామాన్య

ముగాబిడ్డలకు మొదటిమూడు దినములలో నీ ముఱ్ఱుపాలే చాలును.

బిడ్డ మిక్కిలి బలహీనముగనున్నయెడల ఇతరుల నుండితెచ్చిన చనుపాలను రెండు గంటలకొకసారి డబ్బెత్తుచొప్పున ఇయ్యవచ్చును. చనుపాలు దొరకనియెడల ఆవుపాలను చక్కగ ఒక్క పొంగు వచ్చునట్లుకాచి పొయ్యిమీద నున్నప్పుడే ఆపాలలో అరసేరుపాలకు రెండుమూడు నిమ్మకాయల రసమునుపిండి ఆపాలను విరిచివేసి, విరుగుడును సన్నని బట్టతో వడబోసి ఎత్తివేసి మిగిలిన నీటిలో చిటికెడు చక్కెర వేసి కొద్దికొద్దిగా బిడ్డకు మూడుగంటల కొకసారిగాని నాలుగు గంటలకొక సారిగాని పోయవలెను. ఒక్కొకసారికి డబ్బెత్తు (అర అవున్సు) కంటె ఎక్కువగా పోయకూడదు. ఇట్లు తల్లికి పాలుపడువరకును పోయుచుండవచ్చును. ఇట్లు చేయుటకు వీలులేనియెడల ఒకవంతు ఆవుపాలలో రెండులేక మూడువంతులు నీళ్లుచేర్చి ఒక్కపొంగు పొంగనిచ్చి చిటిక చక్కెరవేసి పైకొలత ప్రకారముగానే ఇయ్యవలెను. నిమ్మకాయ రసమువలన శైత్యము గలుగునని తల్లులు భయపడ వలసినది లేదు. పైనివ్రాసిన విరుగుడు నీళ్లు పిల్లలకు మిక్కిలి సత్తువనిచ్చును. సులభముగ జీర్ణమగును.

ఒకానొకప్పుడు తల్లికి పాలిచ్చుట చేతగాకపోవుట చేతను, బిడ్డకు పాలు కుడుచుకొనుట చేతగాక పోవుటచేతను,

తల్లివద్ద పాలున్నను బిడ్డకిచ్చుటకు వీలులేకపోవును. బిడ్డకు చేతకానియెడల కొంచెము తేనెలో నొక వ్రేలును ముంచి ఆవ్రేలును బిడ్డనోటిలోపెట్టి కుడుపుట నేర్పవలెను. తేనెను బిడ్డకిచ్చుటవలన జబ్బులేదు. కొంచెము విరేచనకారియు, బిడ్డకు సులభముగ జీర్ణమగు ఆహారమునుగూడ నగుటచేత తేనె బిడ్డలకు మంచిదే. కొందరాముదములో ముంచిన వ్రేలును బిడ్డకు కుడిపెదరు. అదియును మంచిదే. తల్లికి పాలిచ్చుట చేతకానియెడల ఆమెకు చక్కగ నేర్పవలెను.

బిడ్డకు పాలిచ్చుటకు పూర్వము చనుమొనల నంటి ఏదైనను చెమటగాని, మయిలగాని ఉన్నయెడల అదిపోవునట్లుగా వేడి నీళ్లతో మెల్లగ చక్కగ కడుగవలెను. అరసేరు నీళ్లకు తులమెత్తు బోరికు పౌడరుగాని పటిక పొడుముగానివేసి కలిపిన గోరు వెచ్చని నీళ్లను ఉపయోగించిన మంచిది. ఇట్లు కడిగిన తరువాత వెచ్చని మెత్తని తెల్లగుడ్డతో నెమ్మదిగ తుడువవలెను. ఏవైపురొమ్మునుండి పాలియ్యదలచునో ఆ వైపు చేతిమీద బిడ్డను సదుపాయముగ నెత్తుకొనవలెను. తలకొంచెమెత్తుగను, శరీరము తల్లివైపునకు కొంచెము వంపుగను ఉండునట్లు బిడ్డను ఏటవాలుగ బెట్టుకొనవలెను. తల్లికూడ కొంచెము ముందునకువంగి చంటిని బిడ్డవద్దకు చేర్చవలెను. ఇప్పుడు తల్లి తన రెండవ చేతియొక్క చూపుడు వ్రేలునకును నడిమివ్రేలునకును మధ్య చనుమొన నిముడ్చు

కొని అవసరమైనప్పుడీ వ్రేళ్లసందున చనుమొనను నొక్కిపట్టుచు పాలను తగ్గించుచును, అఱచేతితో చంటినదుముచు వ్రేళ్లనువదులుజేసి పాలను హెచ్చించుచును, చనుమొనను బిడ్డనోటిలోబెట్టి బిడ్డకు పాలుకుడపవలెను. మొదటికానుపులో తల్లి చనుమొనలు మిక్కిలి చిన్నవిగానుండుటచేత బిడ్డ పాలుత్రాగుట కొకానొకప్పుడు కష్టముగ నుండవచ్చును. కాబట్టి పూర్తిగ పాలుపడక మునుపు బిడ్డకప్పుడప్పుడు పాలు కుడిపినయెడల, చన్నులు మెత్తగనున్నప్పుడే చనుమొనలు సాగి, పిమ్మట పాలుపడి బిఱ్ఱబిగిసి యున్నప్పుడు పాలుకుడుచుకొనుటకు తగియుండునట్లు చనుమొనలేర్పడి యుండును.

సాధారణముగా బిడ్డకొక్క వేళకు కావలసిన ఆహారమొక్క చంటిలోనే యుండుననియు, ఒక్కొకవేళ కొక్కొక చంటిలోని పాలుపూర్తిగ నిచ్చుచుండవలెననియు కొందరు చెప్పుదురు. ఒక్కొకవేళయందొక చంటిలోనిపాలు సగమును, రెండవ చంటిలోనిపాలు సగము నియ్యవలసినదే గాని ఒక చంటిపాలను పూర్తిగానిచ్చి వేయకూడదని మరికొందరు చెప్పుదురు. ఒక చంటిపాలను పూర్ణముగ బిడ్డకిచ్చుటకు సాధారణముగా 15 నిమిషములు పట్టును. పాలుబాగుగ నున్నవారలు ఒక చంటినుండి పాలిచ్చుచుండగా రెండవ చన్నుబ్బి దానినుండి పాలుధారగా కారిపోవును. అట్టి సమయములలో ఒకచంటి పాలుపూర్ణముగ నిచ్చివేసి రెండవ దాని నుపయో

గింపనియెడల రవికెయు బట్టలును తడిసిపోవునట్లు చేపు వచ్చిన పాలు కారిపోవుటయేగాక బిగదీసికట్టిన యెడల బిరుసెక్కిన చన్ను నొప్పియెత్త నారంభించును. కాబట్టి అట్టివారలు ఒక్కొక చంటినుండి సగముసగముపాలిచ్చుటయే మంచిది. పాలంత హెచ్చుగలేని తల్లులు ఒకచంటిపాలనే యిచ్చిన యెడల బిడ్డకు ఆకలితీరక పోవచ్చును. అందుచే వెంటవెంటనే వారు పాలియ్యవలసివచ్చును. అట్టివారలు కూడ బిడ్డకు కడుపు నిండువరకును రెండు చన్నులనుండియు పాలిచ్చుట మంచిది. కాబట్టి ఈవిషయమై తల్లులే తగినవిధమునుయోచించుకొనవలెను. పాలిచ్చిన వెంటనే తల్లులు తమ చనుమొనలను గోరువెచ్చని నీళ్లతోకడిగి మెత్తనిపొడిగుడ్డతో మెల్లగ తుడుచుకొనవలెను.

పాలిచ్చిన వెంటనే బిడ్డ నెమ్మదిగ పరుండుటకు అభ్యాసము చేయవలెను. కాని చేతులలో పెట్టుకొని ఇటు నటు ఆడించకూడదు. ఇట్లు చేయుటచే బిడ్డకు ఎత్తు అలవాటయి చేతులలో పెట్టుకొనకుండిన నేడ్చుచుండుటయేగాక కదలిక వలన పాలు వాంతియయి పోవుచుండును. అందుచే అవసరమైనప్పుడు తప్ప ఇతర సమయములలో బిడ్డలను చేతులలో నెత్తుకొనగూడదు. చంటిని నోటిలో పెట్టుకొని కడుపునిండపాలుత్రాగకమునుపే బిడ్డను నిద్రపోనీయరాదు. ఒకసారి ప్రారంభించిన తరువాత కడుపునిండు

వఱకును పాలీయవలెను. లేనిచో వెంటనే బిడ్డ లేచి ఏడ్చుటకు ఆరంభించి అక్రమపు పద్ధతులకు అలవాటు పడును. పగటి పూట పాలవేళకు బిడ్డ నిద్రపోవుచు లేవనియెడల తల్లి బిడ్డను లేపి పాలియ్యవలెను. బిడ్డల విషయములో నిద్ర చెడిపోవుట నంతగా గమనింపవలసిన పనిలేదు. నిద్రలోనుండి లేపినను బిడ్డలు పాలు త్రాగినవెంటనే తిరిగి తప్పక నిద్రపోవుదురు. కడుపులో పాలు లేనప్పుడుకంటె కడుపునిండియున్నప్పుడు బిడ్డలు చక్కగా నిద్రపోవుదురు. ఇట్లు వేళకు లేపి సరియైన కాలనిర్ణయమును బిడ్డకు నేర్పినయెడల ఎన్ని గంటల ఎన్ని నిమిషములకు బిడ్డకు తిరిగి పాలియ్యవలసిన అవసరమో తల్లికిని బిడ్డకును కూడ చక్కగ తెలిసి యుండును. ఈవిషయమై క్రింద చదువగలరు.

కాలనిర్ణయము

అప్పుడు పుట్టిన బిడ్డను కడిగి పరుండ బెట్టిన యెడల సామాన్యముగ వెంటనే నిద్రపోయి రెండుమూడు గంటల వఱకు లేవనే లేవదు. తల్లివద్ద వెంటనే పాలుగూడ పడియుండవు. కావున బిడ్డను ఆహారము కొఱకై లేప నక్కరలేదని నిశ్చయముగ చెప్పవచ్చును. కొంతసేపయిన తరువాత బిడ్డ తనంతట తానే లేచి ఏడ్చును. అప్పుడు బిడ్డను ఎత్తుకొని తల్లివద్ద పెట్టి పాలు కుడుపవలెను. అప్పటికి తల్లివద్ద పాలుపడకపోయినను మొదటి 2-3 దినముల వఱకు బిడ్డకు గంటల ప్రకారము

4 గంటలకు ఒకసారి తల్లి చన్ను కుడుపుచుండ వలెను. తల్లికి పాలుపడిన తరువాత మొదటి 2 నెలల అంతము వఱకు 2 గంటల కొకసారియు 3-వ నెల నిండువరకు 3 గంటల కొకసారియు 4-వ నెల మొదలు పాలు విడుచు వఱకు 4 గంటల కొకసారియు గంటల * ప్రకారము పాలిచ్చుచుండవలెను. బిడ్డలకు పైనిచెప్పిన ప్రకారము నిర్ణయమైన సమయములయందే పాలియ్యవలసినదిగాని వేళ అయినప్పుడును కానప్పుడును అనగా బిడ్డ ఏడ్చినప్పుడెల్ల చన్ను నోటిలోకూరి సమదాయించుట మిక్కిలి గొప్పతప్పు. ఇట్లు చేయుటవలన బిడ్డకు మంకుతనము అభ్యాసమై ముందుముందుకూడ చెడ్డ అలవాట్లకు ఇదియే ప్రాతిపదిక యగును. వేళతప్పకుండ పాలిచ్చుట తల్లి నేర్చుకొనిన యెడల బిడ్డయు వేళకు తప్పకుండ పాలకు ఏడ్చుట నేర్చుకొనును.

---

* ఈ గంటలలెక్క బిడ్డలకందరకు ఒక్కటిగా నెంచకూడదు. తల్లివద్ద పాలు హెచ్చుగనున్న యెడల, నొక అరగంట ఆలస్యముగ బిడ్డ లేచిఏడ్చును. పాలుతక్కువైన యెడల నొక అరగంట వేగముగ నేడ్చును. బిడ్డ యేడ్చురీతినిబట్టి ఆకలి చేత ఏడ్చుచున్నదో జబ్బుచేత ఏడ్చుచున్నదో, విలాసార్థమై ఏడ్చుచున్నదో అను విషయమును కొంచెము ప్రయత్నముచేసిన యెడల తల్లులందరును సులభముగ తెలిసికొనగలరు. కారణమేమియు లేకుండ సామాన్యముగా నారోగ్యముగల బిడ్డలెన్నడును ఏడువరు. కాని ఒకానొకప్పుడు విలాసార్థమై కొందరు బిడ్డలొక చిత్రమైన రీతిని ఏడ్చుచుందురు. దానిని తల్లులు గ్రహింపగలరు. ఇట్లేడ్చుటచే పిల్లలకు పాలు జీర్ణమయి బలము కలుగునేగాని నష్టములేదు.

ఈ విషయమందు జాగరూకతతో మెలగిన తల్లులు గడియారములకన్న తమబిడ్డలు క్రమముగ కాలమును చూపునట్లు తెలిసికొనగలరు. తరుచుగ గడియారము లయినను తప్పు తిరుగునుగాని చక్కగ నేర్పిన బిడ్డలు ఆయావేళలకు సరిగాలేచి పాలకు ఏడువక మానరు. తలచినప్పుడెల్లను బిడ్డకు పాలిచ్చుటచే బిడ్డ కొక్కొకప్పుడు పాలధికమై అజీర్ణము, కడుపునొప్పి, కడుపులోనిపాలు పులిసిపోవుట, వాయువు చేరుకొనుట, మొదలగు దుర్గుణములుపుట్టి వేళకానప్పుడెల్లను ఏడ్పుటకు ప్రారంభించును. ఇట్టి పిల్లల తల్లులు తమ బిడ్డలేడ్చినప్పుడెల్లను పై వ్యాధుల కన్నిటికి 'మందు' గా నొక్క గ్రుక్కెడు పాలిచ్చి బిడ్డనోరుమూయుటకు ప్రయత్నింతురు. ఇందుచే బిడ్డ అప్పటికప్పుడు ఊరకున్నను ఏడ్పొక దురభ్యాసముగా నేర్పడి తల్లికిని బిడ్డకును కూడ ననివార్యమైన కష్టముకలుగును.

కొందరు తల్లులు సామాన్యముగా రాత్రియంతయును బిడ్డను ప్రక్కలో బెట్టుకొని తామునిద్రపోవుచు తెల్లవారినదాక పాలిచ్చుచునే యుందురు. తనంతటతాను మెలకువ వచ్చినప్పుడెల్ల పాలుత్రాగుచు కునుకువచ్చినప్పుడెల్ల రొమ్మునునోటియందే బెట్టుకొని బిడ్డ నిద్రపోవు చుండును. ఇట్టి దురభ్యాసమువలన బిడ్డకును తల్లికిని నిద్రచెడిపోవుటయు, తల్లులచన్మొనలును బిడ్డల నోరును గూడ పుండగుటయేగాక తల్లుల

ప్రక్కలోబడి ఉక్కిరి బిక్కిరియై ప్రాణము పోవుటకూడ తటస్థించుచున్నది.

కాబట్టి రాత్రులయందు తల్లియు బిడ్డయు నెన్నడును ఒకపడకలో పరుండకూడదు. రాత్రుల యందు కూడ వేళ ప్రకారమే పాలిచ్చుచు బిడ్డను వేఱుగ పరుండ బెట్టవలెను. మొదటి నుండియు రాత్రియందు ఒకవేళ ఆహారము మాన్పి బిడ్డను నిద్రపుచ్చుటకు ప్రయత్నింప వలెను. ఇట్లు చేయుటచే తల్లికి నాలుగు గంటలయినను తొందరలేకుండ నిద్రపోవుటకు విరామము దొరకును. ఈ విరామమును క్రమక్రమముగ హెచ్చించుచు బిడ్డకు మూడునెలలు నిండువఱకు తల్లి 6 గంటల కాలము ఎడతెగక నిద్రపోవునట్లు చూచుకొన వచ్చును. ఎట్లన రాత్రి 11 గంటలకు పాలిచ్చి ఉదయము 5 గంటలకు తిరిగి పాలియ్యవలెను. 6 నెలలు దాటిన తరువాత బిడ్డలు ఆహారము లేకుండ 7, 8 గంటల వఱకు నిద్రపోయినను పోనియవచ్చును. అర్ధరాత్రియం దొకవేళ బిడ్డలేచి ఏడ్చిన యెడల కాగి చల్లారిన నీళ్ళనుతెచ్చి పెట్టుకొని త్రాగినన్ని ఇతరు లెవ్వరైనను ఇయ్యవచ్చును. తల్లి నిద్ర చెరుపుకొని లేవ నక్కరలేదు.

మూడవ ప్రకరణము

చనుపాలనుమాన్పు సమయము, విధము

సామాన్యముగా 9-వ నెల అంతమున చంటి బిడ్డలకు తల్లిపాలిచ్చుట మానవచ్చును. 12 నెలల కంటె హెచ్చు కాలము తల్లి పాలియ్య నక్కర లేదని సాధారణముగా చెప్ప వచ్చును. కాని చంటి పిల్లలకు మండు వేసవికాలములో చనుపాలు నిలుపుట అంతగా యుక్తముకాదు. కాబట్టి ఒకానొకప్పుడు అవసరమని తోచినయెడల అనగా వేసవికాలమున బిడ్డ చెడిపోవునని తలచినయెడల 13, 14 నెలల వరకును వైద్యుని సలహామీద తల్లిపాలియ్యవలసి వచ్చును. కొందరు పిల్లలకు పండ్లువచ్చు సమయములో మిక్కిలి తొందర కలుగ వచ్చును. అట్టి తొందర కలిగినపుడు చట్టున తల్లిపాలు నిలుపుటకంటె బిడ్డకుకొంచెము నెమ్మది యగువరకును పాలిచ్చుట మంచిది. కొన్ని పండ్లువచ్చి మరికొన్ని పండ్లురాక పూర్వ మందు మధ్యకాలములో సాధ్యమైనయెడల తల్లిపాలు నిలిపి వేయవలెను. అతిసార విరేచనములు, అజీర్ణము, కడుపుబ్బరము, మొదలగు వ్యాధులు కనుపడినయెడల తల్లిపాలు నిలుపుటకంటె వైద్యుని సలహామీద మరికొంతకాలముపాలిచ్చుచుండుటయే యుక్తము.

ఒక్కసమయమున తల్లికి బలహీనత మిక్కిలి హెచ్చుగ నున్నదను కారణముచేతగాని క్రిందజెప్పిన యితరకారణముల చేతగాని బిడ్డకుతొమ్మిదిమాసములు రాకపూర్వమే పాలిచ్చుట కూడదని వైద్యుడుచెప్పును. అప్పుడు వైద్యుని అనుమతి ప్రకారము పూర్తిగగాని కొంతవరకుగాని పిల్లకు పాలిచ్చుట నిలుపవలెను. మన దేశమునందలి ఆడువారలకు ఈ విషయ మును గురించి ఎంతచెప్పినను చాలదు. కొందరు తల్లులు మూఢత్వముచేత చెప్పినట్లు వినక తమకును, పిల్లలకును హాని కలుగ జేసికొనుచున్నారు.

బలహీనత

చెవులలో గుంయ్యిమనుధ్వనులు,కనులుచీకట్లుక్రమ్ముట, కను గ్రుడ్లలో నొప్పియెత్తుట, తలలోనొప్పి, కాళ్లు చేతులు వణుకుట, మైమరచి అరుపులు కేకలువేయుట, నవ్వులు పుట్టుట, స్మృతితప్పిపోవుట, ఆకలితగ్గిపోవుట, శరీరముకృశించి పోవుట, గుండెలలోదడపుట్టుట, అధికమగుబడలిక, అజీర్ణము, విరేచనము కాకపోవుట, ఎడమప్రక్క రొమ్ములో నధికముగ నొప్పియుండుట, నడుము కాళ్లు ఈడ్చుకొని పోవుట, ముఖ వర్చస్సు తెల్ల బారి పోవుట, ఊపిరాడక పోవుట, పాదములలో ఉబ్బుచూపుట, మొదలగు చిహ్నములన్నియు తల్లిపాలిచ్చుట నిలుపవలసిన దనుటకు సూచనలుగా నెరుగవలెను. ఈ జాబితా లోనివన్నియును లేక కొన్నిమాత్రమున్నను, బిడ్డ బలహీన

ముగనున్నను, వయస్సెంత యయినను, వైద్యుని సలహామీద వెంటనే తల్లిపాలు నిలిపి పోతపాలతో పెంచవలెను. లేనియెడల తల్లి క్షయవ్యాధి, హృదయవ్యాధి మొదలగు క్రూరవ్యాధులఁ పాల్పడును.

ఇప్పుడిప్పుడు మనదేశమున కూడ బిడ్డలకు పాలియ్య వలసి వచ్చుచున్నదని విసుగుకొనుచు ఎట్లయిన దానినుండి తప్పించుకొను నుద్దేశముతో కొందరుతల్లులు తమకు మిక్కిలి బలహీనముగా నున్నదని గాని తనకు పాలిచ్చుట చేతకాదని గాని చెప్పుచున్నారు. అట్టి విషయములయందు వైద్యుడు నిజమును గ్రహించి తగినసలహా నీయవలెను.

ఇదిగాక ఒక్కొక్కప్పుడు తల్లివద్ద యెన్నిపాలున్నను, బిడ్డకు చాలనట్లును, బిడ్డ ఆకలిచేత ఏడ్చుచున్నట్లును కనిపించును. అట్టి సమయము లందు చక్కగ యోచింపనిదే పోతపాలు పోయకూడదు. వేళతప్పి ఏడ్చినప్పుడెల్ల క్రమము లేకుండ, గడియగడియకు బిడ్డయందలి ఆశచేత బిడ్డలకు పెక్కుసార్లు పాలిచ్చుటచేత అజీర్ణము పుట్టి ఇచ్చినపాలు జీర్ణము కాక వృథాగా పోవుటవలన తల్లి ఎన్నిపాలిచ్చినను బిడ్డకు చాలినట్లు కనబడక పోవును. అట్టివేళల ఆతల్లిపాలనే తగిన వేళలందు బిడ్డ ఆకలికి తగినట్లు మితముగ నిచ్చుటచేత అజీర్ణముపోయి క్రమమయిన మార్గమునకు వచ్చును. ఇట్టిసమయములందు ఒకటి రెండు పూటలు తల్లి పిల్లకు పాలిచ్చుట

మాని చూడవలెనుగాని పోతపాలు పోయకూడదు. ఒక్కొక్కప్పుడు తల్లిపాలు మిక్కిలి తక్కువై పోవచ్చును. అప్పుడు సామాన్యముగా పాలు, మజ్జిగ, గంజి మొదలగు పలుచనయినట్టియు, సులభముగ జీర్ణమగునట్టియు, ఆహారము తల్లికి తగినట్లిచ్చిన పాలు సరిపోవును. రెండు పూటల భోజనము చేయు తల్లులు చాలినంత మజ్జిగతో చలియన్నము తినిన పాలు హెచ్చును. ఇట్టి తల్లులు పాలను మంచినీళ్లను ఎక్కువగ త్రాగిన మంచిది.

తల్లిపాలు మారిపోవుట

తల్లికిమనోవిచారము చేతగాని, ఎక్కువపనులతొందర చేతగాని, పాలు తగ్గిపోవచ్చును. అధికమోహము, భయము, కోపము, దుఃఖకరమైన వార్తను అకస్మాత్తుగా వినుట, మొదలగు వానిచేత తల్లియొక్క పాలగుణము మారిపోవచ్చును. అట్టి సమయములలో బిడ్డలకు అజీర్ణము గలిగి వాంతులు, విరేచనములు, ప్రారంభించ వచ్చును. అప్పుడు ఒకటి రెండు పూటలు తల్లిపాలను మాన్పిన మంచిది. కాని తిరిగి తల్లిపాలు అలవాటు చేయవలెను.

క్షయవ్యాధి

తల్లికి క్షయవ్యాధి యున్నయెడల బిడ్డలకాతల్లి పాలిచ్చుట ఉత్తమముకాదు. తల్లి ఉమ్మిలోనెప్పుడైనను నెత్తురు కనబడిన యెడల వెంటనే పాలునిల్పి వైద్యుని సలహా పుచ్చు

కొనవలెను. బిడ్డలకు పాలిచ్చు సమయములలో తల్లులను
ఈవ్యాధి హెచ్చుగ పీడించి దుర్బలుల చేయును. క్షయ
వ్యాధి యొకప్పుడుండి పూర్ణముగ కుదిరిన తల్లులు పిల్లలకు
పాలు ఇయ్యవచ్చును.

సవ్వాయి

కొరుకు (సవ్వాయి) మొదలగు అంటు వ్యాధులు గల
తల్లులు సామాన్యముగా తమపిల్లలకు పాలు ఇయ్యవచ్చును.
ఏలయన తల్లికున్న వ్యాధి పిల్లలకు కూడ సామాన్యముగా
గర్భములో నున్నప్పుడే అంటియుండవచ్చును.

ఒకొక్కప్పుడు తల్లికి కొరుకు (సవ్వాయి) వ్యాధి
అంటకుండనే, పుట్టిన పిల్లలకు తండ్రిద్వారా ఈ వ్యాధి తగుల
వచ్చును. అట్టి సమయములలో ఆతల్లి తనబిడ్డకు పాలు ఇచ్చి
నను, బిడ్డనుండి తల్లికిఆవ్యాధి రొమ్ముద్వారా అంటుకొనదు.
అయినను మరియొకదాది ఆబిడ్డకు పాలు కుడిపినయెడల
బిడ్డనుండి దాదికి ఆవ్యాధి తప్పక వచ్చును. కావున ఇట్టి
పిల్లలకు దాదులచే పాలు ఇప్పించుట అన్యాయము. తల్లియే
పాలియ్యవలెను. ఈ విషయము బహువిచిత్రము. దీనిని
'కార్లిసు' అను వైద్యుడు కనిపెట్టెను.

ఒకానొకప్పుడు బిడ్డకు ఏకారణముచేతనయినను,అనగా
నౌకర్లు, వారల గుడ్డలు మొదలగువాని సంపర్కమువలన
తల్లిదండ్రులకు లేని కొరుకువ్యాధి తగులవచ్చును. అట్టి

సమయమున ఆబిడ్డను పోతపాలతో పెంచవలెను. తల్లిపాలు
ఇయ్యకూడదు. ఇచ్చినయెడల తల్లికి తప్పక అంటుకొనును.

జ్వరములు

తల్లికి హెచ్చుజ్వరము రెండుమూడు దినములకు మించి
యుండునెడల బిడ్డలకు పాలిచ్చుట మాన్పవలెను. ఒకొ
క్కప్పుడు అట్టితల్లి పాలవలన బిడ్డలకు జబ్బుచేయును. అది
గాక తల్లికికూడ దానివలన బలహీనము హెచ్చగును. రెండు
మూడు వారములుగాని ఇంకను ఎక్కువ కాలము గాని పా
లిచ్చుట మానివేసినను తల్లికిశరీరమునందు దార్ఢ్యము వచ్చిన
పిమ్మట బిడ్డకిచ్చుటకు పాలు తిరిగిపుట్టును. అయినను వైద్యుని
యనుమతిమీద తల్లికి జబ్బుగనున్నను అప్పుడప్పుడు అనగా
నాలుగయిదు దినములకొకసారి బిడ్డకు కొంచెము పాలిచ్చు
చుండుట మంచిది. కొన్ని వ్యాధులలో రబ్బరుగొట్టముతో
గాని మరియొక విధమునగాని తల్లిపాలను అప్పటప్పటపిండి
తీసివేయుట యుక్తము.

పురిటి సంబంధమైన (అనగా సూతిక) జ్వరమునందును,
మశూచికము మొదలయిన అంటువ్యాధుల సంబంధమైన
జ్వరములందును. తల్లి బిడ్డలకు పాలియ్యకూడదు.

ఋతుసమయము

పాలిచ్చు దినములలో తల్లికిముట్టు వచ్చినప్పుడు ఒకొ
క్క సమయమందు తల్లిపాలు పిల్లలకు పడకపోవచ్చును.

కాని అది మిక్కిలి అరుదు. అందుచేత ఋతు సమయములందు తల్లులు బిడ్డకు పాలియ్య వచ్చును.

గర్భము

పాలిచ్చు దినములలో నకస్మాత్తుగ తల్లివద్ద నున్న పాలు తగ్గిపోయినయెడల తల్లి తిరిగి గర్భవతియై యుండునని సంశయింప నగును. అట్లు గర్భమువచ్చినయెడల వెంటనే బిడ్డకు పాలిచ్చుట నిలుప కూడదు. గర్భిణియైన తరువాత తల్లిదార్ఢ్యముగనున్న యెడల మూడు నాలుగు మాసముల వరకు తప్పక పాలియ్యవచ్చును. నెలలునిండక పూర్వమె గర్భవిచ్ఛిత్తి అగునలవాటదివరకున్నయెడల అట్టితల్లులు వెంటనే బిడ్డకు పాలు ఇచ్చుట నిలుపవలెను. వెంటనే గర్భవతులైన తల్లులందరును బిడ్డను పోతపాలతో పెంచవలెనని కొందరి వైద్యుల అభిప్రాయము.

చన్నులలోవ్యాధి

చన్నులలో గాని చనుమొనలలో గాని ఏదైన వ్యాధి అంకురించిన యెడల నొకా నొకప్పుడు పాలు నిలుపవలసి వచ్చును. ఈవిషయమై క్రింది ప్రకరణములలో చూడనగును.

ఏవిధమైన వ్యాధియు లేకున్నను తల్లిపాలు మిక్కిలి పలుచగనుండి, బిడ్డకు తగినంత ఆహారము ఇచ్చుటలేదని తోచినపుడును బిడ్డకృశించుచున్నపుడును, తల్లిపాలు నిలుప

వలెను. కొందరు స్త్రీలకు వారిమనస్సుయొక్క స్థితినిబట్టి ఒకనాడు పాలుమిక్కిలి హెచ్చుగను, ఒకనాడు బొత్తుగలేకుండను, ఉన్నయెడల అట్టి స్థితియందును 9 నెలలకు పూర్వమే పాలు మాన్పవలసివచ్చును.

మనదేశమునందు కొందరు తల్లులు మూడునాలుగు సంవత్సరముల వరకును బిడ్డలకు పాలిచ్చెదరు. ఈపాలు మిక్కిలి పలుచగ నీరువలెనుండును. ఈపాలచేత బిడ్డలకు ఆకలితీరక పోవుటయుండగా తల్లికి మిక్కిలి బలహీనముకలుగును. ఈ దురాచారమును నిలుపుట కిక్కడ ఎంతవ్రాసినను తీరదు. ఇట్లుపాలిచ్చుచుండుటచేత గర్భకోశము సరిగా ముకుళింపక ముట్లు సరిగారావు. నెత్తురుకూడ పలుచబడి తల్లికి బలహీనత హెచ్చగును. బిడ్డకుమంకుతన మబ్బునని చెప్పుదురు.

మందులు

కొన్ని మందులు తల్లి పాల మూలమున బిడ్డలకు ఎక్కును. నల్లమందు, ఉమ్మెత్తలరఖు, పొటాసియము, అయొడయిడు, బ్రోమయిడు, సాలిసిలేట్లు, పాషాణములు, విరేచనకారులగు ఉప్పులు, ఆముదము, ఇవి తల్లిపాలయందు కొంతవరకుపోయి ఒకానొకప్పుడు పిల్లలకు అపకారము చేయవచ్చును. తల్లిపాలగుండపోయి బిడ్డలకుపయోగించునను ఉద్దేశముతో తల్లులకు మందిచ్చుటవలన ఉపయోగములేదు. ఏలయన

ఎంతమోతాదు మందు నిశ్చయముగా బిడ్డకు చేరునోచెప్పుటకు వీలులేదు. బిడ్డకు కావలసినంత మోతాదుమందు బిడ్డకు చేరువరకు తల్లికిమందు లిచ్చుచున్నయెడల ఈమందులచే తల్లికి వ్యాధికలుగవచ్చును. ఎంతమోతాదుకావలెనో అంతే మోతాదును బిడ్డకేయిచ్చినయెడల మందు సులభముగ పనిచేయును. అపాయమునులేదు.

తల్లిపాలు నిలుపువిధము

తల్లిపాలను అకస్మాత్తుగగాని క్రమక్రమముగా గాని నిలుపవచ్చును. ఒక్కేసారి నిలిపివేయుటకంటె కొంతవరకు పోతపాలు అభ్యాసముచేసి 4-5 వారములలో క్రమక్రమముగ ఇతరాహారములనే అలవాటుచేయవచ్చును. ఇట్లు చేయుటచేత, బిడ్డయొక్క ఆహారమందు మార్పుచేయుటచే జీర్ణశక్తి చెడిపోక క్రొత్తపద్ధతి క్రమముగ అలవాటుపడి బిడ్డకు పుష్టికలుగును. కాని కొందరుబిడ్డలు తల్లిపాలెంతకాలమిచ్చునో అంతవరకు ఇతరాహారములు బొత్తుగ తినక మొండితనముచేయుదురు. అట్టిపిల్లలకు ఒక్కేసారి తల్లిపాలను నిలిపివేయుట యుక్తము. మఱికొందరు పిల్లలు తమంతట తామే తల్లిపాలను విడిచివేయుదురు. ఒకానొకప్పుడు బిడ్డకు అకస్మాత్తుగ తల్లి పాలయందు అయిష్టము పుట్టి ఎంతఒత్తిడి చేసినను బిడ్డ తల్లిపాలు త్రాగక యుండును. మరియొకప్పుడు ఒక చంటిపాలు త్రాగుచు రెండవ చంటిపాలు త్రాగుటకిష్టపడక

పోవచ్చును. ఒకానొకప్పుడు పాలు మిక్కిలి తక్కువగ నుండినప్పుడు బిడ్డలు తల్లిపాలు త్రాగుట కిష్టపడక పోవచ్చును. అట్టి సమయములందు తల్లిపాలు నిలిపివేయుట యుక్తము.

చనుపాలను అకస్మాత్తుగా మాన్పినపుడు తల్లులకు చన్నులుబ్బి నొప్పియెత్తవచ్చును. అప్పుడు తిరిగితల్లులు పట్టజాలక పిల్లలకు పాలిచ్చుట ప్రారంభింతురు. ఇట్లు పలుసార్లు ప్రయత్నించి విసిగి మూడునాలుగు సంవత్సరములవయస్సు వచ్చువరకు పిల్లలకు విడువక కొందరు పాలిచ్చుచుందురు. చన్నులమీద దూదినిగాని మృదువైన గుడ్డనుగాని ఒత్తుగ దిట్టమైన వెడల్పైన గుడ్డతో యెదురురొమ్ముమీద ఆనునట్లు నొక్కి బిగించి కట్టినయెడల వేరే చికిత్స అక్కరలేకయే పాలు తప్పక ఒకటి రెండు దినములలో హరించి పోవచ్చును. కాని మధ్యమధ్య విప్పుచు అపుడపుడొకసారి బిడ్డకిచ్చుచున్నయెడల బిగించి కట్టినను ప్రయోజనములేదు. ఇట్లు కట్టినపుడొకవేళ నొప్పియెత్తినను సాధ్యమైనంత వరకు ఓర్చుకొనియుండవలసినదే గాని తిరిగి బిడ్డలకు పాలిచ్చుటకు ప్రయత్నించిన యెడల ప్రయోజనములేదు. రెండు మూడు దినములలో నొప్పితగ్గని యెడల, కొంచెము వేడినీళ్ళతోగాని వెచ్చజేసిన ఉమ్మెత్త ఆకులతోగాని కాచి గట్టిగ రవికలనుబిగగట్టి వేయవలెను. ఇట్లు మూడు నాలుగు దినములుచేసిన యెడల ఏబాధయు లేకుండ పాలు నిలిచిపోవును. సాధారణముగా పాలు పిండి

వేయకూడదు. అట్లు చేసినయెడల తిరిగివచ్చుట కనుకూలము హెచ్చుగనుండును. జ్వరమువచ్చి బాధ మిక్కిలి హెచ్చయిన యెడల ఒకవేళ ఉద్ధరిణెడుపాలు పిండినను పిండవచ్చును. వెంటనేనొప్పి తగ్గిపోవును. పాలన్నియు పిండివేయ నక్కరలేదు. వేడినీళ్ల కాపుబిగించికట్టుటకంటె ప్రశస్తమైన చికిత్స లేదని చెప్పవచ్చును గాని వైద్యుని సలహామీద బెల్లడోనా తైలము (Belladona) పూసిగాని బెల్లడోనా ప్లాస్త్రీ వేసిగాని బిగువుగ కట్టివేయవచ్చును. విరేచనములకు మందు పుచ్చుకొనుట మంచిది. ఈ దినములలో మజ్జిగ, పాలు, అధికముగ నీళ్లుకూడ మానవలెను. సాధారణముగా ఆహారమునుకూడ తగ్గించవలెను. తాముచేయుపనిని హెచ్చించుకొనవలెను. కొందరు తల్లులు పిల్లలు పాలుత్రాగకుండ, చేదుగ నుండునట్లు ముసాంబరముగాని, కుంకుడుకాయ రసముకాని, చన్నులకు పట్టింతురు. ఇట్లు చేసినపుడుకూడ కొందరుపిల్లలు పాలు త్రాగక మానరు.అందుచే నొకానొకప్పుడు బిడ్డలకు వాంతులు మొదలగుగుణములు కలుగవచ్చును కాబట్టి మిక్కిలి జాగరూకతగా తల్లి నిద్రపోవునపుడు బిడ్డలు పాలు త్రాగకుండ చూచుకొనవలెను. ముసాంబర మొకవేళ బిడ్డనోటికి తగిలినను అపాయకరము కాదు. కాబట్టి యీరెంటిలో ముసాంబరమునే ఉపయోగించవలెను.

నాలుగవ ప్రకరణము

దాది

ఏబిడ్డకయినను దాదిచే పాలు ఇప్పించవలెనని నిశ్చయించకపూర్వమే మంచి దాది నేర్పరచుకొనవలెను. మంచి దాదికి లక్షణములు :

i. దాదియొక్క శరీరారోగ్యము సరిగా నుండవలెను.

ii. బిడ్డకిచ్చుటకు కావలసినన్నిపాలు కలదిగా నుండవలెను.

iii. మనశక్తికి తగినట్లు మన మియ్యగల జీతమునకు కుదరవలెను.

iv. తన స్వంతపనుల తొందర లధికముగలేక వేళవేళకు బిడ్డకు పాలిచ్చుటకు వీలు కలదిగా నుండవలెను. వివేకముతో మనము చెప్పినట్లెల్లవిని మనబిడ్డకు ఇష్ట ప్రకారము పాలిచ్చునదిగా నుండవలెను *

---

* ఒక్కొకదాది 'నేనుపన్నెండుగుర బిడ్డలను కన్నాను. నాకంటె మీకెక్కువ తెలియునా?' అని మనకే పంచాంగములు చెప్పుదురు. కాని అట్టిదాది బిడ్డలలో నొక్కరైనను బ్రతికియుండకపోవుటయే దాని యవివేకతకు నిదర్శనము.

1. శరీరారోగ్యము :

తమపిల్లల సౌఖ్యమును విడిచికొని యితరుల బిడ్డలకు పాలిచ్చుటకు ఒప్పుకొను తల్లులు సామాన్యముగా బీదవారుగా నుండవలెను. సుఖముగా తమపొట్ట పోసికొనగలవారలు తమ బిడ్డలసౌఖ్యమునకంటె ధన మధికముగా నెంచరు. ఏ బాపతు జీవనమైనను దొరికిన చాలుననుకొనువారలుమాత్రమే (బిడ్డ చచ్చినవారలు తప్ప) దాదులుగా నుండుట కొప్పుకొందురు. అట్టివారల నడవడి సరిగా నుండునని చెప్పుటకు వీలులేదు. 100 లో 99 మందికి సుఖసంబంధమైన వ్యాధు లుండును. దాది పని కొప్పుకొనువారలలో రెండుతరగతులవారు గలరని చెప్పవచ్చును.

1. పొట్టకు జరుగక బిడ్డకు నోరుకట్టి యితరుల బిడ్డలకు పాలిచ్చువారలు కొందరు.

2. తమబిడ్డ చనిపోయినప్పుడు పాలను ఎండగట్టకుండ ఇతరులబిడ్డలకు పాలియ్య నంగీకరించువారలు కొందరు.

ఈ రెండు తరగతులలో మొదటితరగతివారలు చేయు నది పాపకృత్యమైనను రెండవతరగతివారలకంటె మన కెక్కువ యుపయోగకారులు. ఏలయనగా చంటిబిడ్డలు చనిపోవుటకు తల్లుల అనారోగ్యమే ముఖ్యకారణ మని చెప్పవచ్చును. తల్లి ఆరోగ్యవంతురా లైనయెడల తనబిడ్డ యెందుకు చచ్చును?

తీవ్రమైన సుఖవ్యాధు లున్నతల్లుల బిడ్డలు బ్రతుకుట దుర్లభము. ఇద్దరు దాదులు మనబిడ్డకు పాలిచ్చుటకు వచ్చియుండి అందు ఒకదాది బిడ్డ లేనిదియు మరియొకదాది ఆరోగ్యవంతమైన బిడ్డ గలదియు నైనయెడల బిడ్డగలదాదిని యేర్పాటు చేసికొనుటయే కొంతవరకు యుక్తయు. బిడ్డ ఆరోగ్యముగ నుండుటయే తల్లియొక్క ఆరోగ్యమునకును తల్లివద్ద బిడ్డకు చాలినన్నిపాలుండుటకును నిదర్శనము. కాని తనబిడ్డను విడిచి మనబిడ్డకు పాలిచ్చునా అను విషయముమాత్రము గమనింపవలెను.

బిడ్డగలదాదినే పాలిచ్చుటకు నియమించుకొను తల్లులు ముందుగ దాదిని దాని బిడ్డను వైద్యునకుఁ జూపి సలహా తీసికొనవలయును. వైద్యుడు తల్లిని బిడ్డను శ్రద్ధగపరీక్షించి తల్లికిగాని బిడ్డకుగాని క్షయ, కుష్టు, కొరుకు, కోరింతదగ్గు, మొదలగు అంటువ్యాధులు లేవని నిశ్చయించుకొనవలెను. బిడ్డకు మూడునెలలు దాటి అంటువ్యాధి సంబంధమైన చిహ్నలేవియు లేక యున్నయెడల సామాన్యముగా ఆ బిడ్డయొక్క తల్లి ఆరోగ్యవంతురాలే యని చెప్పవచ్చును. దాది దీర్ఘ ఖాయిలాలో పడిలేచియుండి నీరసముగా నున్నయెడల అట్టి దాది కూడదు. కండపుష్టి గలదై ఆహారమునరిగా జీర్ణించుకొనుచున్నదా అని గమనింపవలెను. చన్నులు మిక్కిలి పెద్దవిగాగాని, చిన్నవిగాగాని యుండకూడదు. 16 సంవత్సములు

మొదలు 25 సంవత్సరముల లోపువయస్సు గలదిగ నుండుట మంచిది. దాది ప్రసవమైనతరువాత ముట్లు తిరిగికాకుండుట యుక్తము. తిరుగ గర్భవతియైనవారలు పనికిరారు. ఇన్ని చూచుకొని యేర్పాటు చేసికొనినను అందరిబిడ్డలకు దాది పాలు పడునని చెప్పుటకు వీలులేదు. నెలదినములు పాలిచ్చిన పిమ్మట బిడ్డ పెరుగక బిడ్డయొక్క తూనిక సరిగా హెచ్చక యున్నయెడల ఆ దాదిని నిలిపివేయుట యుక్తము.

దాది యాహారము

దాదులు తమ యిండ్లలోనే భోజనము చేయునెడల సామాన్యముగా మంచి ఆహారమును తినరు. వారలకు కడుపు నిండుటకు చాలినంత లేకపోవుటయే ముఖ్యకారణము. మనము తగినంత జీతమిచ్చి తినుమనినను వారలకుసాగదు. మనమే దయినను పెట్టినను ఇంటికి తీసికొనిపోయి ఇంటిలోని వారందరు పంచుకొనగా దాదిపాలికి కొంచమే వచ్చును. కాబట్టి సాధ్యమైనయెడల దాదిని మన యింటిలోనే పెట్టుకొని మనయెదుట అది భోజనము చేయునట్లు చూచుకొనవలెను. పాలయందలి సత్తువయు గుణములును దాది తినువస్తువులనుబట్టి మారుచుండును. వేసవికాలములో ముషిడి ఆకులు తిను ఆవులపాలు చేదుగానుండుట చూడలేదా ?

బిడ్డయొక్క జీర్ణశక్తినిబట్టి దాదియొక్క ఆహారమును ఒకొ్కకప్పుడు హెచ్చించుచు, ఒకొ్కకప్పుడు తగ్గించుచు

నుండవలెను. దాది ఆహారము ఎక్కువ తిన్ననాడును, నీళ్లు గంజి పాలు మొదలగు ద్రవపదార్థములను త్రాగిననాడును పాలు అధికమగును. అందుచే బిడ్డకొకానొకప్పుడు అజీర్ణము కలుగవచ్చును. బిడ్డకు శరీరారోగ్యము సరిగా లేక అజీర్ణ విరేచనము లగునప్పుడు దాదియొక్క ఆహారము తగ్గించవలెను. దాది శరీరారోగ్యము సరిగాలేనినాడు వైద్యునిసలహాలేనిదే బిడ్డకు దాదిచే పాలిప్పించరాదు. పాలిచ్చుదాది తినుమందులు పాలద్వారా బిడ్డకుజేరి వ్యాధిని కలిగింపవచ్చునను విషయము గమనింపవలెను.

ii. పాలుగలదాది:_కొందరదాదులకు శరీరారోగ్యము సరిగానుండియు తిండి బాగుగ తినగలిగియు పాలు లేకపో వచ్చును. అట్టివార లొకానొకప్పుడు చూచుటకు పాలుగల వాండ్రవలెనే యుండవచ్చును. కాని బిడ్డయొక్క తూనిక వారమువారమునకు పెరుగుచున్నదా లేదా అనునదే దాది వద్ద తగినన్ని పాలుండుటకు నిదర్శనము.

iii. దాదిజీతము:_పల్లెటూళ్లలో చవుకగా దొరకినను పట్టణములలో దాదులు తిండిపెట్టి నెలకు 7 లేక 8 రూపాయిలిచ్చినగాని దొరకరు. చిన్నజీతములుగల గుమాస్తాలు ఇట్టి దాదులనుపెట్టుకొని భరింపజాలరు. అట్టిచో మొదటినుండియు జాగ్రత్తగ ఆవుపాలు అలవాటుచేయుట మంచిది. క్రింది ప్రకరణము చూడుము.

iv. దాది యితర పనులతొందరలేనదిగా నుండవలెను. బీదవాండ్రలో చంటిబిడ్డ తల్లులకు సామాన్యముగా సంసార తాపత్రయము ఎక్కువగానుండును. తన ఇంటిపనులన్నియు చక్కబెట్టుకొనిన తరువాత మనబిడ్డకు పాలిచ్చుటకు వచ్చునెడల అట్టిదాది బిడ్డకు వేళతప్పి పాలుత్రాగుట అలవాటు చేయును. ఇదియే అజీర్ణమునకును, అనేకవ్యాధులకును, కారణమగును. ఇది బిడ్డయేడ్చుటకును, మంకుతనము నేర్చుకొనుటకును కారణమగును. కాబట్టి దాది తీరికగా బిడ్డయుండుచోటనే నివసించునదిగానుండుట మంచిది.

చెడ్డదాదికి లక్షణములు:- చెడ్డదాదియొక్క సామాన్యలక్షణములను కొన్నిటి నీక్రిందపట్టీలో వివరించియున్నాము. దాదిని నిర్ణయించుకొనువారలకిది కొంతవరకు సహాయపడగలదు.

1. మిక్కిలి చిక్కియుండుట.
2. మిక్కిలి స్థూలముగనుండుట.
3. అనుదినము కాలవిరేచనము కాకుండుట.
4. దినమునకు ఒకటిలేక రెండుసార్లకంటె హెచ్చుగ విరేచనము లగుచుండుట.
5. శరీరముమీద దద్దుర్లు, పుండ్లు, పొడలు మొదలగు చర్మవ్యాధులు గలిగియుండుట.
6. దాదిబిడ్డ చచ్చియుండుట లేక కృశించియుండుట.
7. తగవులమారిగా నుండుట.

ఐదవ ప్రకరణము

పోతపాలు

తల్లివద్ద పాలులేనప్పుడును ఆరోగ్యవంతురాలగు దాది దొరకనప్పుడును బిడ్డ నెట్లు పెంచవలెను? ఈవిషయ మీ గ్రంథమునందలి అన్ని విషయములకంటె మిక్కిలి ముఖ్యమయినది. దీనినిగూర్చి అనేకు లనేకవిధములుగ చెప్పుదురు. కొందరు ఆవుపాలు అన్నిటికంటె శ్రేష్ఠమందురు. కొందరు ఆవుపాలు కూడనేకూడ దందురు. ఫలానివారి బిడ్డకు ఆవుపాలు పోయగా కడుపులో బల్ల పెరిగి చచ్చిపోయినదని అందురు. మరికొందరు మిల్లెన్సుబుడ్డిగాని హార్లిక్సు మాల్టెడ్డుఫుడ్డు పాలుగాని పోయవలె నందురు. ఇంకనుకొందరు డబ్బాపాలు పోసిన ప్రశస్తమందురు. ఉన్నవిచాలక దినదినము రకరకముల పాలుపొడుములు హెచ్చుచున్నవి. తల్లులకేదియు పాలుపోక ఇదికాదని అది, అదికాదని ఇది తమపిల్లలకిచ్చుచు వారి జీర్ణకోశములను, ధనమును ప్రేమయు హెచ్చుగనున్న కొలది హెచ్చుగ చెరుపుకొనుచున్నారు. కాబట్టి క్రింది ప్రకరణమునందు చెప్పిన వేలువేలురకముల బుడ్డిపాలయందలి కీడుమేళ్లను విచారింపక మాస్వానుభవమువలన మిక్కిలి ఉపయోగకరమని తోచినట్టి పద్ధతిని వివరించుచున్నాము.

చనుపాలవలన బిడ్డయొక్కతూనిక హెచ్చనియెడల అనగా బిడ్డ పెరుగనియెడల 'బిడ్డ త్రాగినపాలు సరిగాజీర్ణ మగుచున్నదా లేదా?' అను విషయమును ముందుగా తెలిసికొనవలెను. విరేచనము పరీక్షించినయెడల అందులో జీర్ణముకాని పాలశేషము కనబడును. చాలీచాలని తల్లిపాలుత్రాగు పిల్లలకు మలబద్ధకము హెచ్చుగనుండి సామాన్యముగ విరేచనమేకాదు. అజీర్ణములేనిబిడ్డ పెరుగనియెడల బిడ్డకు పాలు చాలవని నిర్ధారణ చేయవలెను. పాలుచాలనప్పు డేమిచేయవలెనని వెంటనే ప్రశ్న వచ్చును. ఈదేశములో చనుపాలకుబదులు ఆవుపాలకుమించిన దేదియు లేదని మాయభిప్రాయము. కాని ఆవుపాలకును చనుపాలకును గలభేదమును మొదటిప్రకరణములో వివరించియున్నాము. అందుముఖ్యమయిన దొక్కటి చక్కగ గమనింపవలెను. చనుపాలుగాని ఆవుపాలుగాని బిడ్డ కడుపులోనికి పోయినవెంటనే విరిగిపోవును. ఒకానొకప్పుడు బిడ్డలు పాలుత్రాగినవెంటనే కొంచెమువాంతి చేసికొనెదరు. ఆవాంతిలోని; పాలువిరిగి (తునకతునకలు) తొరకతొరకలుగానున్నట్లు మీరుచూచి యుండవచ్చును. అట్లు పాలువిరిగి పోవుట జబ్బుగాదు. కడుపులోని పాలన్నియు అట్లే విరిగిపోవును. ఇట్లువిరిగిన తరువాత జీర్ణమగును. కడుపులోని పాలు విరిగిపోవుట జీర్ణమగుటలో నొకభాగమే.

ఆవుపాలలోగాని చనుపాలలోగాని ఒక ఉప్పురాయినైనను కొంచెము నిమ్మపండు రసమునైనను వేసి నిలవయుంచినయెడల కొంచెము సేపటిలో ఆపాలు విరిగిపోయి నీళ్లు వేరుగను విరుగుడు వేరుగను ఏర్పడును. ఇప్పుడు మీరు ఆవుపాలలోని విరుగుడు తునకలను చనుపాలలోని విరుగుడు తునకలను శ్రద్ధగ గమనించిన యెడల చనుపాలలోని తునకలు మిక్కిలి మృదువుగ సన్నని మాదిపోగులవలె చిన్న చిన్నవిగను కనుపడును. ఆవుపాలలోని పెద్దపెద్ద విరుగుడుతునకలు బిడ్డల కడుపులో శీఘ్రముగా జీర్ణముకావు. చనుపాలలోని తునకలు అతిశీఘ్రముగా జీర్ణమగును. ఇదియే ఆవుపాలకును చనుపాలకును గల ముఖ్యభేదము.

పైనిచెప్పిన ప్రకారము ఆవుపాలలోని సులభముగ జీర్ణముకాని పెద్దపెద్దవిరుగుడుతునకలను చిన్నవిగను మృదువుగను చేయుటయెట్లు? ఇట్లుచేయ గలిగితిమేని పోతపాలవలన బిడ్డలకు గలుగు కష్టములనన్నిటిని దాటినవారమగుదుము. ఇట్లు సంపూర్ణముగా ఆవుపాలను చనుపాలతో సరిసమానమయినవిగా చేయుట శాస్త్రజ్ఞులకింతవరకు తెలియలేదుగాని ఆవుపాలు పిండినవి పిండినట్లే ఇచ్చుటకంటె సరికిసరికి నీళ్లు కలిపినయెడల ఆపాలు చిక్కనిపాలకంటె సులభముగ జీర్ణమగునని సామాన్యముగా నిప్పటివైద్యు లభిప్రాయ పడుచున్నారు. ఆవుపాలలోను చనుపాలలోను ఉండు వివిధపదార్థముల పరి-

మాణములను ఉజ్జాయింపుగా తెలుపు ఈక్రిందిపట్టికను చూచినయెడల ఈవిషయము కొంతవరకు బోధపడును.

	మాంస కృత్తులు	పాల చక్కెర	కొవ్వు
ఆవుపాలలో నూటికి	3	4	3½
చనుపాలలో నూటికి	1½	7	3½

ఆవుపాలలో చనుపాలలోకంటె రెట్టింపు మాంసకృత్తుగలదు. ఇదియే ముఖ్యముగా పిల్లలకు జీర్ణముకాని భాగము. కాబట్టి ఆవు పాలలో సరికిసరి నీళ్లుపోసి మూడుపాళ్ళ మాంసకృత్తును 1½ పాలుగాచేసిన యెడల అప్పుడు ఆవుపాలు బిడ్డలకు చక్కగ జీర్ణమగునని తోచుచున్నది. చిక్కగనున్నప్పుడే చక్కెర తక్కువగ గలిగియున్న ఆవుపాలు పైనిచెప్పిన ప్రకారము నీళ్ళు కలిపినప్పుడు మిక్కిలి చప్పబడిపోవును. చక్కెరకూడ బిడ్డలకు కావలసిన ఆహారమే కాబట్టి బలమును తగ్గిపోవును. ఇందుకొరకు ఆహారమిచ్చినప్పుడెల్లను కొంచెము చక్కెరను చేర్చుకొనవలెను. కొందరు పాలలోనుండి తీసిన చక్కెరనే చేర్చుదురు. చెరుకునుండితీసిన నాటు (ఎర్ర)చక్కెర విరేచనకారియగుటచే దానిని చేర్చినను మంచిదే.

కొవ్వుకూడ బిడ్డలకు ముఖ్యముగ కావలసిన ఆహారము. పై పట్టికలవలన నీళ్ళుపోసిన పాలలో కొవ్వుకూడ సగము

నకు సగముతగ్గిపోవుచున్నది. ఇందు కొరకు చలిప్రదేశములలో నివసించువారలు పాలను కొంతసేపు నిలవయుంచి పాల పైభాగమున తేలు క్రొవ్వుభాగమును ప్రత్యేకముగ నెమ్మదిగ ఎత్తుకొని దాని నీపాలలో చేర్చుదురు. మనదేశమునందు పాలను నిలవయుంచినయెడల పులిసి చెడిపోవును. కాబట్టి ఆపద్ధతి మనకంతగాపనికిరాదు. చిన్నచిన్న డబ్బాలలో నిలవజేసియుంచిన పచ్చిమీగడను కొద్దిగ చేర్చుకొనవచ్చును గాని ఈ డబ్బాలు తెరచిన కొన్నిగంటలలోనే మీగడంతయు ఖర్చుకానియెడల అది చెడిపోవుటచే నదియు నంతగా ప్రయోజనకారి కాదు. గొప్ప పట్టణములలోనుండు పెద్ద కుటుంబములవారు అప్పుడప్పుడు తమబిడ్డలకు కొంచెము పచ్చిమీగడను (Cream) పెట్టవచ్చునుకాని ఇది లేకపోయినను సరికిసరి నీళ్లుచేర్చి ఆవుపాలతోనే నూటికి 99 మంది పిల్లలు చక్కగ పెరుగుదురు. పల్లెటూళ్ళలో ఉగ్గుతోపాటు ఆవునెయ్యి కొంచెముగా పెట్టువాడుకగలదు. అట్టి అభ్యాసము మంచిదని చెప్పవచ్చును.

కొందరు పిల్లలకు ఆవుపాలలో నట్టినీళ్లకంటె బార్లే నీళ్లుగాని, సున్నపునీళ్లుగాని పాలకు సరిసమానముగ జేర్చిన యెడల పాలు చక్కగ జీర్ణమగును. బలహీనముగనున్న పిల్లలకును, నెలలోపు పిల్లలకును ఒకానొకప్పుడు సరికి సరికి పలుచనచేసిన పాలుకూడ జీర్ణముకాకపోవచ్చును. విరేచనములు

ఎక్కువగుచున్నను, విరేచనములలో జీర్ణముకాని పాలతునకలు కనబడినను, ఆబిడ్డపాలలో ఒకటికి రెండుపాళ్ళు బార్లెనీళ్లుగాని సున్నపునీళ్ళుగాని చేర్చిన మంచిది. కాని ఒకటికి మూడింటికంటె పలుచనజేసిన ఆవుపాలలో పిల్లలకు బొత్తుగ బలము చాలదనితోచుచున్నది. ఆవుపాలను పైనచెప్పిన ప్రకారము పలుచగపోసినను జీర్ణముకాని పిల్లలకు ఆవుపాలుమార్చి వేరే పాలు కొన్నాళ్ళిచ్చి చూచుటమంచిది.

లేదా ఆవుపాలలో సోడా సిట్రేట అను మందును అవున్సనకు 1-గ్రయిను (గురిగింజ) ఎత్తుచొప్పునచేర్చి పిమ్మట పైనిచెప్పిన ప్రకారము నీళ్ళతోచేర్చి ఇచ్చినయెడల కొందర బిడ్డలకు ఆవుపాలు జీర్ణమగును. ఇందువలన పాలలోని విరుగుడు తునకలు చిన్నచిన్నవిగా నేర్పడుటచే సామాన్యమైన ఆవుపాలకంటె ఈమందువేసిన ఆవుపాలు సులభముగా జీర్ణమగును.

ఈపాలుకూడ జీర్ణముకానియెడల పొంగేపాలలో కొంచెము నిమ్మపండు రసముపిండి విరిగిపోవునట్లుచేసి వడపోసి విరుగుడును ఎత్తివేసి మిగిలిన నీటిలో కొంచెము చక్కెర చేర్చి ఇయ్యవలెను. బలమైన బిడ్డకుతగినంత ఆహారము ఈపాల నీళ్లలోలేదు. కాని బలహీనముగనుండు బిడ్డలకు పైనిజెప్పిన రీతిని ఏవిధముగను పాలు జీర్ణముకానప్పుడు ఈపాలనీళ్ళు సులభముగజీర్ణమై బిడ్డకు సత్తువనిచ్చును. ఇట్లు కొన్నిదినములు

గడచినపిమ్మట క్రమముగ పలుచని పాలిచ్చి చూడవచ్చును. ఒకానొకప్పుడు ఈపాల నీళ్ళకుతోడుగ కోడిగ్రుడ్డులోని తెల్లని భాగమును ఒకటికి పదిచొప్పున నీళ్ళలోకలిపి ఆనీళ్ళను ఇయ్యవచ్చును.

ఇట్లుచేసినను బిడ్డ యొక్కతూనిక హెచ్చని యెడల పాలలో పెప్సిను మొదలగు కొన్ని మందులనువేసి ముందుగనే సగము జీర్ణమగునట్లుచేసి పిమ్మట ఆపాలును బిడ్డకియ్యవలసివచ్చును. అట్టిది సామాన్యముగా అవసరముండదు. అవసరమైన యెడల వైద్యునివద్దనుండి గాని నర్సు (పరిచారిక) వద్దనుండి గాని ఈపద్ధతి ముందుగా నేర్చుకొనుట మంచిది.

ఇట్లు సగము జీర్ణముచేసిన పాలునుకూడ జీర్ణముచేసికొనని పిల్లలకును మఱియొక ఆధారముకలదు. ఇప్పుడు దినదినమును బిడ్డలకొరకు ప్రత్యేకముగ సృష్టింపబడు ఆహారముల సంఖ్య మితిమీరి హెచ్చుచున్నది. వానినిగూర్చి క్రింది ప్రకరణమునందు చూడగలరు.

కండెన్సుమిల్కు-లేక డబ్బాపాలు. అనగా పాలులోనుండు నీళ్ళను చాలభాగము ఎత్తివేయగా మిగిలిన చిక్కని పాకము. ఇందు కొందరు కొవ్వును చాలభాగము తీసివేసి దానికి బదులుగా చక్కెరచేర్చెదరు. తీపిచేర్చని డబ్బాపాలలో తగినన్ని నీళ్లు చేర్చియిచ్చిన కొందరుబిడ్డలు చక్కగా పెరుగుదురు. కాని తీపిచేర్చిన డబ్బాపాలు బిడ్డలకుమంచిదిగాదు. ఇందు కొవ్వుచాలదు. కావున రెండురకముల డబ్బాపాలను కలిపి యిచ్చిన మంచిది.

పాలపొడుములు

మన దేశమునందిప్పు డనేకరకముల పాలపొడుములు బిడ్డల ఆహారార్థమై బజారులలో అమ్మకమగుచున్నవి. అందు కొన్నిరకముల పొడుములు బిడ్డలకుపకారముకంటె అపకారమే యెక్కువగా చేయుచున్నవి. బుడ్డిపైనుండు ప్రకటనాడంబరముచే ననేకులు మోసపోయి తమ బిడ్డల ఆరోగ్యమును కోలుపోవుచున్నారు. ఈపాలపొడుములను కొన్నిటిని శోధించి డాక్టరు హచ్చిన్సను అనునొక రొకపట్టీని తయారుచేసియున్నారు. అందుకొన్నిటిని ఉదాహరణముగాగొని వాని స్వభావముల నీక్రింద వివరించుచున్నాము.

ఆహారము పేరు	నీరు	మాంసకృత్తు	క్రొవ్వు	పిండి లేక చక్కెర	లవణ పదార్థములు	వ. రా
	నూటికి	నూటికి	నూటికి	నూటికి	నూటికి	
ఎండబెట్టిన చనుపాల పొడుము	లేదు	12·2	26.4	52·4	2·1	చంటిబిడ్డలకు తగిన ఆహారమునుతయారుచేయ గోరువారందఱును ఈపాళ్ల ప్రకారము ఆహారముండు నట్లు చేయ ప్రయత్నింపవలెను.

ఆహారము పేరు	నీరు	మాంసకృత్తు	క్రొవ్వు	పిండి లేక చక్కెర	లవణ పదార్థములు	వ. రా
	నూటికి	నూటికి	నూటికి	నూటికి	నూటికి	
1 అలన్బరి ఆహారము (మొదటి రకము) మూడు నెలలలోపు బిడ్డలకు.	5.7	9·7	14.0	66·8	3·7	ఎండబెట్టిన ఆవుపాల పొడుములో కొంత మట్టుకు విరుగుడును ఎత్తివేసి శాకసంబంధమైన మాంసకృత్తు, పాలు, చక్కెర, మీగడయును చేర్చి తయారుచేసిన పొడుము. ఇందుకరిపిండిలేదు.
2 అలన్బరి ఆహారము (రెండవ రకము) మూడు నెలలు దాటిన బిడ్డలకు.	3·9	9·2	12·3	72·1	3.5	పైదానివలెనే చేయబడినదిగాని కొంచెము వేపుడు బియ్యపుపిండి ఇందులో చేరియున్నది. దీనియందు కూడ పచ్చి వరిపిండిలేదు.
3 హార్లిక్సు వేపుడు పాలు	3·7	13·8	9,0	70.8	2.7	ఎండబెట్టిన పాలపొడుము నూటికి 50 పాళ్లవంతునను, గోధుమపిండి

ఆహారము పేరు	నీరు	మాంసకృత్తు	క్రొవ్వు	పిండి లేక చక్కెర	లవణ పదార్థములు	వ. రా
	నూటికి	నూటికి	నూటికి	నూటికి	నూటికి	
						$26\frac{1}{3}$ పాళ్లవంతునను, వేయించిన బార్లిపొడుము 23 పాళ్లవంతునను సోడాపొడుము $\frac{3}{4}$ పాలువంతునను ఇందుచేరియున్నవి.
4 కార్నిక్స్ ఆహారము	5.3	13.6	2.5	76.4	2.2	ఎండబెట్టిన పాలపొడుము నూటికి $37\frac{1}{3}$ పాళ్లును, వేయించిన గోధుమపిండి $37\frac{1}{3}$ పాళ్లును, పాలచక్కెర 25 పాళ్లును, ఇందులో గలవు. ఇందు మార్పు జెందని వరిపిండి తయారుచేసిన పాలలో కొంచెముగా నుండును.
5 గ్లాక్సో	3.5	22.2	27.4	41.0	5.9	ఎండబెట్టిన పాలకు మీగడను, పాలచక్కెరను చేర్చి

ఆహారము పేరు	నీరు	మాంసకృత్తు	క్రొవ్వు	పిండి లేక చక్కెర	లవణ పదార్థములు	వ. రా
	నూటికి	నూటికి	నూటికి	నూటికి	నూటికి	
						తయారు చేయబడినది. పిండిపదార్థములు లేవు.
6 మెల్లిన్స్ ఆహారము	6.3	7.9	స్వల్పము	82.0	3.8	అంతయు వేయించిన ఆహారము. దీనిలోనుండు పిండిపదార్థమంతయు నీటిలో కరగిపోవును. వేపుడు బియ్యపుపొడిని నీళ్ళలో కలిపి ఆ నీళ్లను వడపోసి క్రిందికి దిగిన సారమును ఎండబెట్టి పొడుము చేయగా మిల్లెన్స్ ఆహారము వంటిది తయారగునని చెప్పవచ్చును. దీనిని బిడ్డల కిచ్చినప్పుడు దీనిలో ఆవుపాలు చేర్చుకొనవలెను.

ఆహారము పేరు	నీరు	మాంసకృత్తు	క్రొవ్వు	పిండి శేక చక్కెర	లవణ పదార్థములు	వ.రా
	నూటికి	నూటికి	నూటికి	నూటికి	నూటికి	
7 బెంజరు ఆహారము	3·8	10.2	1.2	79·5	0.3	మనపేగులకు సంబంధించి యుండు వృకమను నొక గ్రంధినుండి తీయబడిన సత్తుతో చేర్చిన గోధుమ పిండి బుడ్డిపైనుండు ప్రకారము తయారుచేసిన యెడల ఈ ఆహారములోని పిండి పదార్థములో చాలభాగము కరిగిపోవును. మాంసకృత్తు కొంతవరకు జీర్ణమగును. పాలుకూడ ఆహారమును తయారుచేయుటలోనే కొంతవరకు జీర్ణమగును.
8 ఆలన్బరి ఆహారము (మూడవ రకము) ఆరునెలలు దాటిన బిడ్డలకు	6.5	2	1.0	82.8	.5	గోధుమ పిండి, వేయించిన వరిపిండి సారము, ఈ రెండును చేర్చిన ఆహారము. తయారు చేసిన పిమ్మట పాలలో కొంత పిండి పదార్థము లుండును.
9 నీవుకు ఆహారము	6.5	10.5	1.0	80.4	1.6	ఉడికిన వరిపండిపొడుము పాలతో కలిపి తయారు చేయుట కేర్పడినది. నీళ్ళతో నిచ్చునెడల బిడ్డకు కావలసినపదార్థములన్నియు ఇందులోలేవు.
10 రాబిన్సను పేటెంటు బార్లీ	10.1	5.1	.9	82.0	1.9	బార్లెబియ్యపు పిండి ఇందు బిడ్డకు కావలసిన పదార్థములన్నియుతక్కువే కావున పాలతో చేర్చనియెడల సత్తువచాలదు.

పైని చెప్పినవిగాక బిడ్డలకొరకేర్పడిన ఆహారపదార్థములని పేరునకిప్పుడు వందలకొలది గలవు. పై వానినిబట్టి చూడగా ఇట్టి ఆహారములను మూడు తరగతులుగా మనము విభజింపవచ్చునని మీకు తెలియగలదు.

1 మొదటితరగతి.

చనుపాలకు బదులుగా అన్నివిధములను ఉపయోగించుటకు ఏర్పడిన ఆహారములు.

పై పట్టికలో మొదటి అయిదును ఈతరగతిలో చేరినవి.

2. రెండవతరగతి.

ఆవుపాలతో చేర్చి తయారుచేసినప్పుడు చనుపాలకు బదులుగా ఉపయోగించుటకు ఏర్పడిన ఆహారములు—

పై పట్టిలో 6, 7, 8 లు ఈతరగతిలోనివి. ఇందుండు పిండి పదార్థములు పాలను తయారుచేయు పద్ధతిలో కొంతవరకు జీర్ణమై చక్కెరగా మారిపోవుచున్నవి. పిండి ప్రత్యేకము పిండిగా నుండదు.

మొదటితరగతి ఆహారములు కొంతవరకు సులభముగ జీర్ణము కావచ్చునని చెప్పవచ్చును. కాని ఎన్నడో తయారుచేసి బుడ్డిలో పెట్టియుంచబడి యుండుటచే వానియందు అప్పుడు పిండిన ఆవుపాలలోను, తల్లిపాలలోనుగల సత్తువయుండదు. స్వాభావికముగ సృష్టియందుగల పదార్థములలో

నూతనస్థితియందొకానొక విధమైన సత్తువకలదు. కొన్ని జీర్ణరసములును గలవు. ఆసత్తువయును ఆజీర్ణరసములును ఆయా పదార్థములను నిలువ యుంచినకొలది నశించిపోవును. కాబట్టి ఈ పొడుములతో తయారుచేసిన పాలు బిడ్డకు అప్పటికప్పుడు సులభముగ జీర్ణమైనను వీనితో పెంచినబిడ్డలు చూచుటకు నవనవలాడుచు మొట్టమొదట పెరుగుచు వచ్చినను పిమ్మట కొంతకాలమునకు తీవ్ర వ్యాధులపాలు కావచ్చును.

ఏ కొద్దివ్యాధి వచ్చినను సాధారణముగా ఈబిడ్డలు తాళుకొనజాలరు. ఏవిధమున చూచినను ఆవుపాలు, సరిపడని పసిబిడ్డలకు మాత్రమే ఈపొడుములపిండితో తయారుచేసిన పాలియ్యవలెను. అట్టి బిడ్డలకు తరచుగ మంచి నారంజపండుగాని కమలాఫలముగాని పిండి దానిరసములో ఒక్కచిటికె చక్కెరనుచేర్చి ఇచ్చుటమంచిది. ఇతర పండ్లరసములుకూడ ఇయ్యవచ్చును. లేదాయిమిడినయెడల ఆవుపాలు వీలయినంతవరకు బుడ్డిపాలతోపాటు చేర్చుకొనుచు రావలెను. పిల్లలకు కడుపులలో పెరిగెడు "బల్ల" యని చెప్పువ్యాధి ఈపొడుములనుండి తయారుచేయు పాలవలన నధికముగ కలుగుచున్నదని అనేక వైద్యుల యభిప్రాయము. కాబట్టి ఈపాలనియ్యవలసి వచ్చిన తల్లి తన బిడ్డవిరేచనము తెల్లగనుండగనే వైద్యునిసలహా తీసికొనవలెను, లేదా అజీర్ణమధికమై కండ్లు పచ్చబారి శీఘ్రి

కాలములో నెత్తురు చెడిపోయి కామెర్లు మొదలగు తీర్పరాని వ్యాధిపాలగుదురు.

క్రొవ్వు తక్కువగ నున్న పాలు బిడ్డలకిచ్చునెడల ఎముకలలో వ్యాధి పుట్టి ఎముకలు వంగిపోవును. మడికాళ్ళు, గూను, ఛాతి వంగి వికారమునొందుట, మొదలగు వ్యాధుల పాలగుదురు.

నూతనపదార్థము లేశమైన లేక అంతయు బుడ్డిపాల మీదనే పెరుగు పిల్లలకు స్కర్వీయని మఱి ఒకవిధమైన వ్యాధి పుట్టి బిడ్డల ఎముకలను తాకినవెంటనే కావుమని ఏడ్చెదరు. పంటిచిగుళ్ళు ఉబ్బి తాకినంతనే నెత్తురు కారుచుండును.

సాధ్యమైనంతత్వరలో ఈపాలనుమాన్పి బిడ్డలకు స్వాభావికమైన ఆహారమగు దాదిపాలుగాని ఆవుపాలుగాని, అన్నము కాని అలవాటుచేయుటకు ప్రయత్నింపవలెను.

పండ్లురాకపూర్వము బిడ్డలు వరిపిండి మొదలగు పిండిపదార్థములను జీర్ణము చేసికొనజాలరు. కాబట్టి రెండవతరగతి ఆహారములు అనగా, 6, 7, 8లు ఇచ్చినయెడల పాలతో చేర్చి ఇయ్యవలెను. పాలతో చేర్చకుండ ఎన్నడు నియ్యకూడదు.

3. మూడవ తరగతి.

ఆహారమును తయారుచేసిన తరువాతకూడ పిండిపదార్థములు ఇందు మారకుండ అట్లే నిలిచిపోవును. పైపట్టికలో 9, 10 లు ఇందులో చేరినవి. ఇవి పండ్లురాని బిడ్డలకు బొత్తుగ

ప్రతికూలములు. పిమ్మటకూడ తగినంత పాలలో చేర్చి ఇయ్యవచ్చునుగాని ప్రత్యేకముగా నియ్యతగదు. బార్లినీళ్ళు మిక్కిలి పలుచనచేసి నీళ్లకుబదులుగా పాలలోచేర్చుకొనవచ్చునని చెప్పియుంటిమి. కాని బార్లెపొడమును గంజిగాకాచి పండ్లురాని పిల్లలకు ఇయ్యకూడదు. ఇట్లే ఆరోరూటుపిండి,బియ్యపుపిండి, గోధుమపిండి, మొదలగువాని గంజికూడ బిడ్డలకు, పండ్లు రాకపూర్వము ఇయ్యకూడదు. పండ్లువచ్చిన తరువాతకూడచిక్కగ నియ్యకూడదు. ప్రత్యేకముగ ఆవుపాలుజీర్ణముకాని పిల్లలకు పైపిండితో దేనితోనైనను తయారుచేసిన పలుచనిగంజితో సీపాలు కలిపి ఇచ్చినయెడల సులభముగ జీర్ణము కావచ్చును.

వైద్యునిసలహాలేనిది సీమనుండిదిగు తీవ్రమైన ప్రకటనాడంబరముల చూచి భ్రమపడి ఏదోయొక పాలపొడము నిచ్చి తమబిడ్డలను గోల్పోకుందురని ఈవ్యాసము నింతగా వ్రాసినాము. పాలపొడములతో చేసినపాలు సామాన్యముగా తియ్యగను కమ్మగను ఉండుటచేత బిడ్డలు వాని కలవాటుపడిన తరువాత విడువక హెచ్చుగ త్రాగుదురు. ఇది ముఖ్యముగ గమనించి తల్లులీయాహారములను సాధ్యమైనంత వరకు తగ్గించి ఇచ్చుటకు ప్రయత్నింపవలెను. బిడ్డలులావుగ ఉండ్రములవలె పెరుగుచున్నారని సంతసింపరాదు. ఈబిడ్డలకు వ్యాధి వచ్చినయెడల మిక్కిలి తీవ్రముగవచ్చునని జ్ఞాపకముంచుకొనవలెను.

ఏడవ ప్రకరణము

అజీర్ణము-కడుపునొప్పి

బిడ్డలకు తఱుచుగ సంభవించువ్యాధి అజీర్ణము. ఇంత వరకును ఆహారపదార్థముల భేదములగూర్చి తెలిసికొనిన మీకు ఈవిషయము గోచరము కాకమానదు. సామాన్యముగ కడుపునొప్పి, పాలుకక్కుట, విరేచనము లధికముగ నగుట, మలబద్ధము, బిడ్డచిక్కిపోవుట, ఇవియేబిడ్డలకు తఱుచుగ గలుగు బాధలు. ఈబాధలన్నియు అజీర్ణమను నొక్కవ్యాధియందే చేర్పవచ్చును. ఇవిగాక జ్వరము, దగ్గు, ఉబ్బసము, బిడ్డ చక్కగా పెరగక పొట్టపెరుగుట, పండ్లు మొలవక పోవుట, యెముక పట్టకపోవుట, ఈడ్పు(చిన్న బిడ్డతనము) మొదలగునవి చంటిబిడ్డలకు అప్పుడప్పుడు, వచ్చువ్యాధులని చెప్పవచ్చును.

ఇవియునుగాక సాంక్రామిక వ్యాధులు, అనగా ఒకరి నుండి మరియొకరికి అంటుకొను వ్యాధులుకూడ బిడ్డలకు రా వచ్చును. అందు మసూచికము, ఆటలమ్మ, పొంగు, గవదలు, కోరింతదగ్గు, గజ్జి, కండ్లకలక, కలరా, క్షయ మొదలగునవి ముఖ్యములు. ఇవిగాక తల్లిదండ్రులనుండి వంశపారంపర్యముగ గాని, దాదుల మొదలగు వారలనుండిఅంటుసోకుటచేగానివచ్చు కొరుకు పచ్చగసె వీనినిగూర్చి ముఖ్యముగ గమనింపదగును.

మరియు పుట్టుకతోనే బిడ్డలకు ఒకానొకప్పుడు కలుగు చుండు చెవుడు, మూగ, బుద్ధిమాంద్యము మొదలగు వానిని గూర్చియు, తల్లులు తెలిసికొననగును.

పై వ్యాధులనుగూర్చి సాధ్యమైనంతవరకు క్లుప్తముగ ఈక్రింది ప్రకరణములలో వివరించెదము.

అజీర్ణము

అజీర్ణమునకు లక్షణములు రెండు విధములు. కడుపు నొప్పి, వాంతి, విరేచనములు. ఇవి సాధారణలక్షణములు. జ్వరము, బిడ్డచిక్కిపోవుట మొదలగునవి తీవ్రలక్షణములు. లక్షణముల అన్నిటిలో సామాన్యమైనది కడుపునొప్పి.

కడుపు నొప్పి

బిడ్డల కడుపునొప్పికి మూడు ముఖ్యమైన కారణములు చెప్పవచ్చును.

1. కడుపులో పాలు పులిసిపోవుట:—బిడ్డకడుపులోని పాలు పులిసిపోయినయెడల కొన్నివిధములైన పులుసు పదార్థములుపుట్టి అవి పేగులను రెచ్చపెట్టి నొప్పికలుగజేయును.

2. పేగులలో జీర్ణముకాని పెరుగుబిళ్లలుండుట:—ఆవుపాలు త్రాగుబిడ్డలకు పాలుచిక్కగనుండుటచే అవి జీర్ణము కానప్పుడు ముక్కచెక్కలుగానుండు పెరుగుబిళ్లలుగా నేర్పడి అవి పేగులగుండ పోవునప్పుడు కడుపునొప్పి ఎత్తును.

3. పేగులలో అజీర్ణముచే గాలి సరిగాపోకపోవుటచే కడుపునొప్పి యెత్తవచ్చును.

తమ బాధలను సరిగా చెప్పలేని బిడ్డల నొప్పి తెలిసికొనుట తల్లికిగాని, వైద్యునకుగాని మిక్కిలి కఠినమైనపని. ఏవ్యాధికిని ఏడ్పు ఒక్కటియే మనకు సర్వత్రగోచరమగు సంజ్ఞ. ఒకబిడ్డ, ఆకలిచేత నేడ్చుచున్నదో, కోపముచేత ఏడ్చుచున్నదో నొప్పిచేత ఏడ్చుచున్నదో మొట్టమొదట తెలిసికొనవలెను. నొప్పిచేత ఏడ్చుచున్నదని తెలిసికొనిన పిమ్మట ఆనొప్పికి కారణము కడుపులో నున్నదో వేరేమరి ఎక్కడనైన నున్నదో తెలిసికొనవలెను. కడుపులోనే నొప్పియున్నయెడల కడుపుగట్టిగ నుండును. చెయ్యివేసి చూచినప్పుడు పొట్టమెత్తగ ఉండుటకు బదులు రాయివలె చేతికి తగులును. ఒకానొకప్పుడు ఉండలు ఉండలవలె పేగులు చుట్టుకొనినట్లు చేతికి తెలియవచ్చును. బిడ్డ తనచిన్ని తొడలను పొట్టదగ్గరకు ఈడ్చుకొని పాదములను విసరుచు బిగ్గరగ ఏడ్చుచుండును. ఒకానొకప్పుడు ఈఏడ్పు మిక్కిలి అధికమై బిడ్డకు ఈడ్పువచ్చి స్పృహ తప్పిపోవచ్చును. ఇట్లేడ్చునప్పుడు విరేచనములో జీర్ణముకాని పెరుగుబిళ్లలను చూచిన యెడల తప్పక అజీర్ణమువలన కలిగిన కడుపునొప్పిచేతనే బిడ్డ ఏడ్చుచున్నదని చెప్పవచ్చును. ఇట్లేడ్చుచుండు బిడ్డ అకస్మాత్తుగ అపానవాయువు విడిచి ఏడ్పునుచట్టున నిలిపినయెడల బిడ్డఏడ్పునకు కడుపునొప్పియే కారణమని నిశ్చయముగ చెప్పవచ్చును.

కాని బిడ్డ ఏడ్చినపుడెల్లను కడుపునొప్పియే కారణమని చెప్పుటతప్పు. పైని చెప్పినట్లు ఆకలియును, కోపమునుగాక ఇంక అనేకకారణములు కలవు. అందుముఖ్యమైనవి:—

1. చెవిలో నొప్పి. ఈవిషయమై తల్లినడిగిన బిడ్డతన చేతిని తరుచు చెవివద్ద పెట్టుకొనుచుండునని చెప్పవచ్చును. ఇట్లున్నచో చెవినొప్పి యున్నదని సందేహింపవచ్చును.

2. పండ్లువచ్చుట. పండ్లువచ్చునప్పుడు బిడ్డలు అధికముగ పోరుపట్టి ఏడ్చుటకలదు.

3. మూత్రమునందు మిక్కిలిసన్నని ఇసుకవంటి పదార్థము పోవుటచే బిడ్డలు ఒకానొకప్పుడు ఏడ్చెదరు.

4. మొగపిల్లల మూత్రద్వారము చివరనుండు చర్మము మూసికొను పోవుటచే సరిగామూత్రమురాక బిడ్డలు ఒకానొకప్పుడు పోరుపట్టి ఏడవ వచ్చును.

5. సరియైన ఆహారములేకపోవుటచే ఎముకలు క్రమముగ పెరుగక తాకినప్పుడెల్లను నొప్పిఎత్తి కొందఱు బిడ్డలుఏడ్చెదరు. బిడ్డను నెమ్మదిగ పడకలో పరుండపెట్టినప్పుడు ఇట్టిఏడ్పు తక్కువగానుండును. ఎత్తుకొనినప్పుడును, స్నానముచేయించునప్పుడును మిక్కిలి అధికమగును. దీనినిబట్టియు ఒక్కొక్క ఎముకనుతాకి పరిశోధించి చూచియు ఇది స్కర్వీవ్యాధియని కనిపెట్ట వచ్చును.

6. తల్లిదండ్రుల సంబంధమైన కొరుకువ్యాధిచే బిడ్డల యెముకలలో నొప్పిపుట్టి అందుచే బిడ్డలు ఏడువవచ్చును. ఇట్టి ఏడ్పు రాత్రులయందు అధికమగును. ఇతర లక్షణములవలనను పూర్వచరిత్రవలనను, ఇట్టి ఏడ్పును గ్రహింపవచ్చును.

7. కారణమేమియు లేకయే వినోదార్థము, కొందరు బిడ్డలు ఆటగా నేడ్చెదరు. ఇట్టిఏడ్పును తల్లులు సులభముగ గ్రహింపగలరు.

8. పై చెప్పిన కారణములేవియు లేకయే కొందరు బిడ్డలు స్వభావముచేత అధికముగ పోరుపెట్టి ఏడ్చుచుందురు. ఇట్టిబిడ్డలకు బుద్ధి స్వతహాగా తక్కువగుటచే ఇట్లుఏడ్చెదరని గ్రహించవలెను.

పై విషయములన్నియు చక్కగ యోచించి, కడుపు నొప్పియే బిడ్డయొక్క ఏడ్పునకు కారణమని నిశ్చయించుకొనిన పిమ్మట ఈక్రింది రీతిని చికిత్సచేయవలెను.

చికిత్స:—మొట్టమొదట పొట్టను వెచ్చవెచ్చగ కాచవలెను. కొంచెము గోరువెచ్చని ఆముదమును చేతికిరాచుకొని ఆచేతులతో మెల్లగ బిడ్డపొట్టను చక్కగ రాయవచ్చును. లేదా తమలపాకులకు రాచి వెచ్చగనుండునట్లు కాచుచుండవచ్చును. లేదా వెచ్చవెచ్చగ వేడినీళ్ళలో పిండిన గుడ్డతోగాని గోధమతవుడుతోగాని ఒత్తవచ్చును. వెచ్చవెచ్చగ పిండికట్టు

పొట్టమీద కట్టవచ్చును. కాని ఇట్లు చేయునప్పుడు మిక్కిలి వేడిగ ఏపదార్థమును ఉపయోగించరాదు. అట్లు చేసినయెడల బిడ్డ మరింత ఏడ్చును. బిడ్డకు హితవుగ నుండునట్లుండు వేడినీళ్ళలో ఆవపిండి కొంచెము కలిపి ఆనీళ్ళతో బిడ్డపొట్టను స్నానము చేయించినయెడల మిక్కిలి హెచ్చుగనుండు కడుపునొప్పులకు మంచిది. లేదా ఆవపిండిని నీటితోనూరి గుడ్డమీద పరచి పొట్టకు పట్టీవేయవచ్చును. పైకి వేడికలుగ జేయుటగాక, ఆసనముగుండ రెండులేక మూడుఅవున్సులు వెచ్చని నీటిని బిడ్డ తాళుకొనునంతవేడిగ పిచ్చికారి చేయవచ్చును. ఇదిగాక అపానవాయువు చక్కగ బయలువెడలిపోవుటకై 60చుక్కలు పెప్పరిమెంటునీళ్ళుగాని వామురసముగాని ఇచ్చుటమంచిది. (పుస్తకము చివరచూడుము).

ఇట్లు చేయుటచే అప్పటికి నొప్పితగ్గిపోవును. తిరిగి నొప్పిరాకుండ చేయుటెట్లు? తల్లిపాలు త్రాగుపిల్లకు కడుపు నొప్పి వచ్చినయెడల ఆతల్లి ఆపిల్లకు వేళతప్పి పాలిచ్చుచున్నదనియు, మిక్కిలి తరుచుగ పాలిచ్చుచున్నదనియు, చెప్పవచ్చును. రెండుగంటల కొకసారి యిచ్చుచున్నయెడల రెండున్నరగంట కొకసారి చేయవలెను. మూడుగంటల కొకసారి ఇచ్చుచున్నయెడల మూడున్నరగంట కొకసారి చేయవలెను. కడుపునొప్పిచే ఏడ్చుచుండు బిడ్డలకు మిక్కిలి తరుచు ఆహారమిచ్చుట సహజము.

ఎందుచేతననగా నొప్పిచేత ఏడ్చుచుండు బిడ్డకు వెచ్చవెచ్చని తల్లిపాలు పొట్టలోపడుటచే అప్పటి కప్పుడు మిక్కిలి హితముగానుండును. తల్లియు పాలిచ్చుట చేత బిడ్డ యేడుపు తగ్గుటచూచి వెంటవెంటనే వేళలేకుండ పాలిచ్చుటకు ప్రారంభించును. ఇట్లుచేయుటచేత అజీర్ణమధికమై కడుపునొప్పి హెచ్చును. తిరిగి తల్లిపాలుతరుచుగ నిచ్చుటయు హెచ్చగును. ఇట్లే ఒక తప్పున కింకొంక తప్పు తోడై నొప్పియెన్నటికిని తీరని దగును. ఇట్టిదానికిచికిత్స యేమనగా నీ చెడ్డయలవాటునుమాన్పుటయే. తల్లి ఇష్టము వచ్చినప్పుడుగాక గడియారముచేతబట్టుకొని ఇన్ని గంటలకొకమారు బిడ్డకు పాలియ్యవలసినదియేగాని బిడ్డ యెంత ఏడ్చినను నియమితమైన కాలము వచ్చువరకును బిడ్డకు పాలీయరాదు. ఇట్లుచేయుటచేత దురలవాటుమానిబిడ్డయొక్క అజీర్ణము తగ్గును.

కొందరు తల్లులపాలు చిక్కగనుండుటచేతనో, హెచ్చుగ నుండుటచేతనో, బిడ్డలకాపాలు అరగక విరేచనములో అరగని పాలు తొరకతొరకలుగా తెలియుచుండును. ఇట్టిచోట్ల కొంచెము సున్నపుతేటనీళ్ళను కొంచెము చక్కెరతోచేర్చి ప్రతిసారియుపాలిచ్చుటకు పూర్వమును బిడ్డకిచ్చుటచే పాలు చక్కగ అరుగును.

ఒకానొకప్పుడు బిడ్డకు మలబద్ధము హెచ్చుగనుండుటచే కడుపునొప్పి కలుగును. కాబట్టి మలబద్ధమునకు చికిత్సతప్పక చేయవలెను.

తల్లిపాలు త్రాగుపిల్లలకంటె బుడ్డిపాలుత్రాగు పిల్లలకు కడుపునొప్పి తరుచుగ వచ్చుచుండును. పాలను పరిశుభ్రముగ తయారుచేయకుండుటయే దీనికి ముఖ్యకారణము. పాలుశుభ్రముగ తయారుచేసినను బుడ్డిపరిశుభ్రముగ లేనియెడల పాలు పులిసిపోయి అజీర్ణముకలిగి కడుపునొప్పికి కారణమగును. పాలబుడ్లకు రెండువైపులను నోరుఉన్న యెడల లోపల మయిల ఏమియులేకుండ కడుగవచ్చును.

ఒకవైపుననే నోరుఉన్నసీసాలను పరిశుభ్రముగ కడుగుట కష్టము. ఈబుడ్లకుకొన్నిటికి పొడుగాటిగొట్టముండును. ఆగొట్టములో పాలతొరకలు నిలిచిపోయి అవి క్రుళ్ళి పాలను చెరుపును. ఇట్టి గొట్టముగల పాలబుడ్లు మరియును చెడ్డవి. మనదేశములో పాలగిన్నెలతోను ముక్కుగల గోకర్ణములతోను బిడ్డలకు పాలుపోయుదురు. వీనినిశుభ్రముచేయుట సులభమే కాని బిడ్డకెంతపాలు కావలయునో తెలియక, ఏడ్చుటకై నోరు తెరచునప్పుడెల్లను నోటినిండపాలు పోయు చుందురు. బుడ్డితో బిడ్డపాలుతాగినయెడల తనకెంతకావలెనో అంతయే త్రాగి పిమ్మటబుడ్డిని విడిచివేయును. ఈరీతిగ బిడ్డకక్కరలేనప్పుడు బిడ్డచే మనము బలవంతముచేసి పాలుత్రాగించ వీలు కాదు. అందుచే పాలగిన్నెకంటె పాలబుడ్లు ఒకవిధముగ ఉపయోగకరములైనను పరిశుభ్రముగ నుంచనియెడల పాలబుడ్లే చంటిబిడ్డలఅజీర్ణమునకు ముఖ్యకారణము.

బుడ్డి శుభ్రముగ నున్నదనియు, పాలు శుభ్రముగ తయారు చేయబడుచున్నవనియు నీకు నిశ్చయముగ తెలిసి యున్నయెడల బిడ్డకు కాలనియమము లేకకాని, పరిమాణ నియమము లేకకాని పాలిచ్చుటయే బిడ్డకడుపునొప్పికి కారణమని చెప్పవచ్చును. లేనియెడల పాలుమిక్కిలి చిక్కగనుండి యుండవచ్చును. అట్లయినచో పాలు పలుచన చేయవలెను (పోతపాలు ప్రకరణము చూడు). బిడ్డకు విరేచనము అనుదినము సరిగాకానియెడల మలబద్ధము పోగొట్టవలెను. అధికముగ విరేచనము లగుచున్నయెడల దానికి తగిన చికిత్స చేయవలెను.

పై చెప్పిన విషయములను చక్కగ గమనించుచు అపానవాయువు సరిగాపోవుటకును, కడుపులోని పులుసుతగ్గి ఆకలియగుటకును ఈక్రింది మందులు ఇయ్యవచ్చును.

(1) సోడాపొడరు 3 గ్రెయినులు.
వాము లేక శొంఠికషాయము 1 టీ స్పూను.
అతిమధురము కషాయము ½ టీ స్పూను.
వీనిని చేర్చి ఇయ్యవచ్చును. ఈ కషాయములు చేయుటలో 1-కి నాలుగు పాళ్ళు నీళ్ళుకలిపి ఒక పొంగు పొంగించవలయును.

(2) శొంఠి, వాము, కరక్కాయ, సైంధవలవణము సమభాగములుగ జేర్చి మొత్తమునకు నాలుగంతలు నీళ్లుచేర్చి

నాలవవంతుకు దిగునట్లు కాచి అందు ముప్పది మొదలు అరువది బిందువులవఱకు చనుపాలతోగాని నీళ్ళతోగాని చేర్చి య్యియ్యవచ్చును.

(3) అష్టచూర్ణము మూడు గ్రెయినులు మొదలు 5 గ్రెయినులవఱకు ఆవుపాలతోనియ్యవచ్చును. ఈ చూర్ణమును చేయువిధము. త్రికటుకము, అజామోదము, సైంధవ లవణము, జీలకఱ్ఱ, నల్లజీలకఱ్ఱ, ఇంగువ వీనిని సమభాగములుగా గ్రహించి చూర్ణముచేయునది. ఇందు ఇంగువమాత్రము కొంచెము వేయించవలెను.

(అష్టాంగ హృదయము-గుల్మ చికిత్స).

కడుపునొప్పిచే బాధపడు బిడ్డల ఆహారములోగాని మందులలోగాని చక్కెర అంతగాచేర్చరాదు. చక్కెరకు శీఘ్రముగ పులిసిపోవు గుణము గలదు.

పైని చెప్పినట్లు చేయుటచే సామాన్యముగా కడుపునొప్పి తగ్గిపోవును. కాని వెంటవెంటనే నొప్పివచ్చుచున్నను, పైవిధానముచే తగ్గక పోయినను వైద్యునకు చెప్పిపంపవలెను. కాని బిడ్డల నొప్పులకని ప్రకటింపబడు మందులను ఎన్నడును ఉపయోగపరుప కూడదు. కొన్ని మందులు నొప్పి నడచుటకై బిడ్డను నిద్రపుచ్చి అట్లే పరలోక నిద్రకుపంపును. నల్లమందైన్నడును తల్లులుగాని దాదులుగాని బిడ్డల కడుపునొప్పి నిలుపుటకై యుపయోగింపరాదు. వైద్యులుపయోగించినయెడల జాగ్రత్తగ బిడ్డను తరుచు చూచుచుండవలెను.

ఎనిమిదవ ప్రకరణము

అజీర్ణము - కక్కుకొనుట

అజీర్ణముయొక్క ముఖ్యలక్షణములలో కక్కుకొనుట యొక్కటి. బిడ్డలుకక్కుకొనుటలో ముఖ్యముగ మూడువిధములైనవి గమనింపనగును.

1. అకస్మాత్తుగ తీవ్రముగ వాంతులువచ్చుట.
2. కొద్దికొద్దిగ దినదినము కక్కుకొనుట.
3. విస్తారముగ దినదినము కక్కుకొనుచు బిడ్డచిక్కిపోవుట.

1. బిడ్డకెన్నడును లేని కక్కులు అకస్మాత్తుగ ప్రారంభమై శరీరమువెచ్చపడి నాలుకమీద పిండికట్టుకొని ఊపిరి పులుసు వాసనఎత్తును. ఇట్టికక్కులు జ్వరము మొదలగు తీవ్రమైనవ్యాధులు ప్రారంభమగునప్పుడు వానిమొదటి లక్షణముగా నుండవచ్చును. అట్టిదికానిచో ఇట్టి వాంతికి లంఖణమే పరమౌషధము. లంఖణమువలన బిడ్డలుతాళుకొనలేరని భయపడవలసిన పనిలేదు. రెండు, మూడు దినములయినను, వ్యాధిగ్రస్థులయినప్పుడు, ఆకలిలేక పోవుటచే, ఏమియు ఆహారము లేకుండ బిడ్డలుండగలరు. కాని కావలసినన్ని కాగి చల్లారిన మంచినీళ్ళుమాత్రము అప్పటప్పటఇచ్చుచుండవలెను. చలికాల

మైనయెడల పొట్టమీదవెచ్చని గుడ్డయు కాళ్ళకు మేజోళ్ళను వేయవలెను. తల్లులు ఉండలేనియెడల మిక్కిలి పలుచనిబార్లి నీళ్ళను ఇయ్యవచ్చును. ఏది ఇచ్చినను చల్లగనుండునట్లుగా చూచుకొని గరిటతో కొంచెము కొంచెముగా నియ్యవలెను. ఒకపూట లంఖణమువలన ఈవిధమగు వాంతి నిలువనియెడల వైద్యునికొరకు చెప్పిపంపవలెను.

2. కొద్దికొద్దిగ దినదినమును బిడ్డకక్కుకొనుచున్న యెడల అందుచే బిడ్డచిక్కిపోవుచున్నప్పుడేగాని తల్లి ఆతురతనొందపనిలేదు. కొందఱుబిడ్డలు మామూలుగాతమకుకావలసినదానికంటె ఎక్కువగత్రాగి అందుకొంచెము కక్కివేయుచుందురు. "కక్కే బిడ్డలుదక్కుదుర"నుసామెతబొత్తుగనిరర్థకము కాదు. ఇట్టివాంతి బిడ్డకు అలవాటుగా విడవకుండవచ్చుచున్నయెడల ఆహారము అధికమగుటచేతనో, కాలనియామకము లేకయే, వెంటవెంటనే ఆహారము ఇచ్చుటచేతనో కలుగుచున్నదని చెప్పవచ్చును. పోతపాలుపోయు బిడ్డలకు పాలుకొంచెము పలుచనచేయవలెను. కొంచెము ఆలస్యముచేయవలెను. తల్లిపాలు త్రాగు బిడ్డలకుకూడ కాలనియామకము తప్పకుండ అనుదినముకంటె అరఘంట ఆలస్యముగ పాలియ్యవలెను. ఇట్లుఆహార పరిమాణమును, కాలపరిమాణమును, సరిజేసిన పిమ్మట కూడవాంతి నిలువనియెడల వైద్యుడురబ్బరుగొట్టమును కడుపులోనికి పోనిచ్చి దానితో కడుపుకడగవలెను. కొందరు బిడ్డ

లకు బిస్మత్ కార్బనేటు (Bismuth Carbonate) 10 గ్రేయినులును, మరికొందరకు హైడ్రోక్లోరిక్కు ఆసిడ్‌నీళ్ళు (Hydrochloric acid dilute) 2 లేక 3 చుక్కలును ఇచ్చిన చక్కగపనిచేయును. ఏబిడ్డకు ఏదిపనిచేయునో వైద్యుడు శోధనచే తెలిసికొనవలెను.

3. అధికముగ కక్కుకొనుచు బిడ్డ చిక్కిపోవునపుడు అట్టివాంతికి చికిత్స చేయకుండ విడువరాదు. బిడ్డ చక్కగ బెరుగుచుండునపుడు కొద్దిగ అప్పుడప్పుడు కక్కుకొనుచున్నను అశ్రద్ధచేయవచ్చునని పైన చెప్పబడి యున్నను, దినదినమునకు బిడ్డయొక్క ఆరోగ్యము క్షీణించుచు చర్మము ముడతలుపడుచు ఎముకలు పైకి దేలుచున్న యెడల అట్టివాంతులు ఒకతీవ్రమైన వ్యాధియని గ్రహించవలెను. ఇట్టివ్యాధియొక్క ముఖ్య లక్షణములను క్రింద సూచించుచున్నాము.

1. వాంతి వచ్చునప్పుడు అతి విసురుతో వచ్చుచు కక్కుకొను పదార్థములు ఎత్తుగను దూరముగను పోయిపడుట.

2. తాగినపాలకంటె అధికముగ కక్కునా అనునట్లు ఒక్కొక్కసారి బోలెడు కక్కుట.

3. కక్కిన పదార్థములలో పాలసంబంధమైన విరుగుడు నీళ్ళుగాక జిగట జిగటగనుండు కఫము పడుట.

4. విడువకుండ బిడ్డయొక్క తూనిక తగ్గిపోవుట.

5. వాంతితో పాటు అధికముగ మలబద్ధముండుట. బిడ్డకెన్ని పాలు కావలెనో అన్ని జీర్ణముకాక పోవుటయే ఇందులకు కారణము.

6. క్రమేణ బిడ్డకు ఎముకలు బయలుపడుచు చర్మము ముడతలు పడుట.

ఇట్టి లక్షణములు గల బిడ్డయొక్క కక్కులకు ముసలమ్మలమాటలు విని చికిత్సచేయకుండ విడువరాదు. వైద్యుడే చికిత్సచేయవలెను.

బిడ్డ కక్కుకొనునపుడు తల్లిపాలు ఆబిడ్డకు పడలేదనియు వెంటనే నిలుపవలసినదనియు కొందరు చెప్పుదురు. ఈవిషయములో ఒక్కొక్కప్పుడు వైద్యులుకూడ తప్పుదారిని పోవచ్చును. ఈవిషయములో ఇతర చికిత్సలన్నియు చేయకుండ తల్లిపాలు విడిచి పోతపాలు అలవాటుచేయుటవలన మిక్కిలి కష్టములు కలుగవచ్చును. పోతపాలెవ్వియును పడకుండ తిరిగి తల్లిపాలే కావలసిన యెడల అప్పుడు తల్లిపాలు దొరకక, కష్టపడవలసివచ్చును. ఇట్లే పోతపాలు పోయుబిడ్డలకు కూడ ఇది కాదని అదియు, అదికాదని మరియొకటియు బిడ్డకు ఇచ్చుటకంటె చక్కగ యోచించిన పిమ్మట పాలను మార్చవలెను కాని తొందరపడ కూడదు. వాంతితగ్గుటకు స్వదేశవైద్యులు నెమలిఈకలుకాల్చినమసిని రెండు లేక మూడు గ్రెయినులను తేనెతో కలిపి యిచ్చెదరు.

తొ మ్మి ద వ ప్ర క ర ణ ము

అజీర్ణము-అతిసారము

విరేచనములు అధికముగ నగుటయే పిల్లలపాలిటి మారి యని చెప్పవచ్చును. ఈచెన్నపట్టణములో 5746 గురు చంటి బిడ్డలు గత సంవత్సరమున మృతినొందియున్నారు. ఇందు 1040మంది అనగా నూటికి 18 మంది విరేచనముల వలననే మృతినొందియున్నారు. ఇట్టివ్యాధికి మూడుకారణములు కన బడుచున్నవి.

1. బిడ్డకడుపులో చేరు సూక్ష్మజీవులను అక్కడనే మృతి నొందించుటకు తగినంత అమ్లరసము (Hydrochloric Acid) లేనందున ఆసూక్ష్మజీవులు పేగులలోనికి బోయి ఉద్రేక మును కలిగింపవచ్చును.

2. పోతపాలు త్రాగుబిడ్డల ఆహారము సూక్ష్మజీవుల పెంపునకు మిక్కిలి తగిన ఆహారమగుటచే పాలు ఎంతమాత్రము పులిసిపోయినను జీర్ణముగాక విరేచనములు కలిగించును.

3. పెద్దవారలకంటె బిడ్డలకు అతిశీఘ్రముగా వేడి చలి, తడి మొదలగువానిచే పేగులలో అజీర్ణముకలుగును.

కాబట్టి పైని చెప్పిన మూడు విధములయిన కారణముల చేతను అతి సారము కలుగకుండ చూచుకొన వలయును.

1. సూక్ష్మజీవులు:—ఇవి ఈదేశములో వేసవికాల మందు దుమ్ముతోపాటు పాలలోపడి అధికముగ పాలను చెఱు చును. ఇదిగాక ఇంటికి చుట్టుప్రక్కలనుండు చెడుచోట్లలో క్రుళ్ళుచుండు పదార్థముల మీది గాలియందును మురికిగల వీధులు, దొడ్లు మొదలగు చోట్లనుండి వచ్చుగాలియందును జనసంఘము, మురుగుచుండు కాలవలు, పేడకుప్పలు, ఇట్టివి గలచోట్లనుండి వచ్చుగాలియందును సూక్ష్మజీవులు అధికముగ పెరుగును. కాబట్టి ఇట్టిచోట్లనుండు బిడ్డలు అతిసారముచే బాధ పడుచున్నయెడల అట్టి బిడ్డలను నిర్మలమైన స్థలములకు మార్చుట యుక్తము. ఇందుచేతనే జనసమ్మర్దముగల పట్టణ ములలోని బిడ్డలు పల్లెలలోని బిడ్డలకంటె హెచ్చుగ అతి సారమునకు పాలగుదురు.

2. బిడ్డల కిచ్చుపాలపై ఒక నిమిషమైనను మూత తెరచి యుంచక చక్కగా ఒక్క పొంగు పొంగునట్లు కాచి ఇచ్చిన యెడల పాలయందుండు సూక్ష్మజీవులు నశించును. పాలుకాచిన తరువాత మూతలేకుండ తెరచియుంచిన యెడల కాచినందు వలని ప్రయోజనము లేకపోవును. దుమ్ములోని సూక్ష్మజీవులు పాలలో చేరినయెడల అక్కడ అవి మిక్కిలి చక్కగ పెరుగు నని తిరిగి నొక్కి చెప్పవలసిన పనిలేదు. పాలను ఏపూట

కాపూట పితుకుకొని అప్పటికప్పుడు బిడ్డ కిచ్చుటయుక్తము. పాల పొడుములలోనుండి బిడ్డపాలను తయారుచేసికొనువారు ఎప్పటి కప్పుడే పొంగునీళ్లతో పాలను తయారుచేసికొనుట యుక్తము. కొంచెముసేపు చల్లారుటకై పెట్టిపెట్టినను మూసి యుంచవలెను.

ఆహారము సరిగానున్నయెడల బిడ్డలకు 99 పాళ్లు అతి సారవిరేచనము లెన్నడును కలుగవని సామాన్యముగ చెప్ప వచ్చును.

లక్షణములు:—కొందఱు బిడ్డలకు విరేచనములు మెల్లమెల్లగ ప్రారంభించి క్రమక్రమముగ అధికము కావచ్చును. మఱికొందఱకు అకస్మాత్తుగ అధికముగనే ప్రారంభము కావచ్చును. వాంతియుకూడ ఉండవచ్చును. విరేచనముల రంగు ప్రథమమున పసుపు పచ్చగనుండి సామాన్యవర్ణముతోనే ప్రారంభించి పిదప ఆకుపచ్చనై పిమ్మట జిగురును, నెత్తురు కూడ కనపడవచ్చును. ఇంకను అధికమైనయెడల మిక్కిలి దుర్వాసనతో కూడిన నీళ్ళవిరేచనములు కావచ్చును. ఆకు పచ్చనివిరేచనములవలన పిత్తకోశమునుండి (Liver) పైత్యరసము (Bile) అతివేగముగ క్రిందికి పోవుచున్నదనియు దుర్వాసనగ నుండుటవలన సరిగా జీర్ణముకాకముందే ఆహారము బయటకు గెంటివేయ బడుచున్నదనియు తెలిసికొనవలెను. పెరుగు తునుకలవలె గుండ్రముగను ఉండలుండలుగనుండు నలుసులు

విరేచనములో కలిసియుండును. ఇవి జీర్ణముకాని పాలని తెలిసికొనవలెను. ఒకానొకప్పుడు ఆసనమును పుండుజేసి మంట లెత్తించునట్లుండును. అట్టిబిడ్డలకు పిఱ్ఱలమీద ఎఱ్ఱనిదద్దులను, పుండ్లను చూడవచ్చును. ఈవిరేచనము కోమలమైన పాదముల వెనుకభాగములపై పడిన అక్కడకూడ పుండ్లేర్పడవచ్చును. ఇట్లు పుండుజేయు విరేచనములు ఆహారములో కొవ్వుపదార్థములు హెచ్చుగనుండుటచే కలుగును. ఆహారములో తీపు పదార్థములు హెచ్చుగ నున్నయెడల సామాన్యమైన రంగుతోడనే నురుగుతో చేరిన విరేచనములగును. జిగటగనుండు విరేచనములు ఒకానొకప్పుడు కలుగుచుండును. ఇట్టివిరేచనములగునప్పుడు ఆసనము సమీపమున నుండు పెద్దపేగులో వ్యాధి ఉన్నట్లు గ్రహింపవచ్చును. విరేచనములో నెత్తురున్న యెడల పెద్దపేగులో వ్యాధి ఉన్నట్టు నిశ్చయింపవచ్చును.

సామాన్యమైన అతి సారము జ్వరము లేకుండ నుండవచ్చును. లేక తీవ్రమైన జ్వరము రావచ్చును. విరేచనము లధికమై కాళ్లు చేతులు చలువలు క్రమ్మి బిడ్డ మిక్కిలి బలహీనముగ నుండవచ్చును. ఈబలహీనమంతయు విరేచనములవలననే కలిగినదని చెప్పకూడదు. సూక్ష్మజీవుల వలన కలిగిన విషములు రక్తములోనికి వ్యాపించి ఈబలహీనమును శీతలమును పుట్టింపవచ్చును. విరేచనములు అధికమైన బిడ్డలకు మాడపట్టు దించుకొని పోవును. కండ్లు గుంటలుపడి తెఱచుకొని యుండును.

పిమ్మట బిడ్డ నిద్రపోవునపుడు సగము తెఱచుకొని యుండును. నల్లగుడ్డుమీద తెల్లనిజిగట చేరును. చర్మము ముడుచుకొని పోవును. ఇట్టి లక్షణములున్న యెడల తీవ్రమైన వ్యాధియని గుర్తింపవలెను. మూత్రముకూడ ఇట్టి స్థితిలో తగ్గిపోవును. జ్వరము పైకి తగ్గిపోయినను ఆసనములో హెచ్చుగనే యుండును. బిడ్డ నల్ల బారి పిమ్మట తెల్ల పడి తుదకు ఈడ్పువచ్చి ప్రాణములు విడుచును.

చికిత్స:—మందులవలన అంతగా ప్రయోజనము లేదని నమ్ముము. మనకుండు మార్గములు ముఖ్యమైనవి రెండేగలవు.

1. తిండిలేకుండ మాడ్చుట (లంఖణము)

2. కడుపులోని విషపదార్థములను బయటకు త్రోయుట (శోధనము)

ఈరెండు విషయములను గట్టిగ జ్ఞాపకముంచుకొన్న యెడల చికిత్సలో నెన్నడును సరియైన దారి తప్పిపోదు.

1. లంఖణము:—అతిసారమునందు పేగులలో సూక్ష్మజీవులు మిక్కిలి అధికముగ పెరుగుచుండునని చెప్పియుంటిమి. ఆసూక్ష్మజీవులకు పాలు మిక్కిలి హితమైన ఆహారమనియు తెలిసికొనియున్నాము. కాబట్టి మనము ఎంతపాలిచ్చిన అంత విషమును బిడ్డకు మనమిచ్చుచున్నామని తలచవలెను. నీవేమి చేసిననుసరేకాని బిడ్డకు పాలు మాత్రము ఇయ్యవద్దు, అనునది సూత్రప్రాయముగ నెంచవలెను.

ఆహారములేకుండ 2, 3 దినములైనను బిడ్డజీవించ కలదనియు, మంచినీళ్లుమాత్రము అప్పుడప్పుడు ఇచ్చుట మిక్కిలి అవసరమనియు ఇదివరలో చెప్పియున్నాము. బిడ్డనువెచ్చగకప్పియుంచినచాలును. అధమము మొదటి 24 ఘంటలయినను పాలను బొత్తుగ నిలుపుటమంచిది. తల్లిని తృప్తిచేయుకొఱకు నీళ్ళవంటి బార్లినీళ్లుగాని, చిట్టుడుకు నీళ్ళుగాని, కోడిగుడ్డులోని తెలుపు కలిపిననీళ్ళుగాని ఒక్కొక్క చిన్న చెమ్చాడు అప్పుడప్పుడు ఇచ్చుచుండవలెను. ఇందలి మంచినీళ్లే ముఖ్యముగాని ఆహారపదార్థము ముఖ్యమైనదికాదు. బిడ్డయొక్క ఆరోగ్యము చక్కపడుచు వచ్చుచున్నయెడల 2, లేక 3 దినములవఱకుకూడ ఇట్లు గడపవచ్చును. కొంచెము గుణముకనపడిన తరువాత నిమ్మకాయరసముతో విరిచిన పాలనీళ్ళుగాని, 1 టికి 16 పాళ్ళ నీళ్ళువేసికాచిన వేపుడుబియ్యపు నీళ్ళుగాని విరేచనపు రంగు పసుపుపచ్చనగువఱకు ఇయ్యవలెను. తుదకు మెల్లమెల్లగ ఆవుపాలు ఇయ్యవలెను.

2. శోధనము:— అనగా విషపదార్థములను వెలిపుచ్చుట. వాంతి ఉన్నయెడల మొట్టమొదట కడుపును రబ్బరుగొట్టముతో కడుగుటయుక్తము. పిమ్మట ఆసనమార్గమున రబ్బరుగొట్టముపోనిచ్చి సాధ్యమైనంత దూరమువఱకు వెచ్చవెచ్చని ఉప్పునీళ్ళతో కడుగుట మంచిది. ఇట్లు చేయుటచే ఆమాశాభాగములలోని అజీర్ణపదార్థములును, కొంతవఱకు

సూక్ష్మజీవులును, వానివిషములు కూడ వెలువడును. ఎనిమా డబ్బా 2 అడుగులయెత్తుకంటె పైకిఎత్తకూడదు. రబ్బరు గొట్టమును మెల్లమెల్లగ ఆసనముగుండ పోనిచ్చునపుడు నీటి ప్రవాహమును విడిచియుంచుటవలనగొట్టము సులభముగ లోపలికిపోవును. విస్తారముబలవంతముగ గెంటనియెడలఎక్కువ దూరములోపలకు రబ్బరుగొట్టముపోవుచున్నను భయములేదు. కాని బలవంతముగ చొప్పించుటచే ఒకానొకప్పుడు బిడ్డయొక్క పలుచని పేగు చిల్లిపడవచ్చునని గమనించవలెను. ఇట్లు ఆసనమార్గమున పరిశుభ్రమైన నీళ్ళుతిరిగివచ్చువఱకు కడగవచ్చును.

చర్మము ముడతలుపడుచు బిడ్డనీరసముగ నున్నయెడల, రక్తప్రవాహము మిక్కిలి హీనముగనుండుటచేత శరీరమునందలి విషములు దహింపబడుటకు అవకాశము తక్కువగ నున్నదని గ్రహించవలెను. అట్లున్నయెడల మిక్కిలి పరిశుభ్రమయిన నాలుగుఅవున్సులఇత్తడిపిచికారికి చిన్నరబ్బరుగొట్టము తగిలించి, ఆరబ్బరుగొట్టపుకొనకు బోలుసూదిని తగిలించి మెలకువతో తగిన వైద్యుడు వెచ్చనిఉప్పునీళ్ళను పొట్టప్రక్కనుండు చర్మముక్రిందకు సూదినిగ్రుచ్చి ఆనీటిని పిచ్చికారిచేయవలెను. ఇట్లుచేయుటచేత రక్తములోని కీనీరు వేగముగపోయి దాని ప్రవాహ మధికమయి యందలి విషపదార్థములు తగ్గి రక్తము పరిశుభ్రపడును.

విరేచనములగు బిడ్డకుతిరిగి విరేచనములకే మందిచ్చుట చిత్రముగ తోచినను ప్రథమదశలో బిడ్డకుకొంచెము ఆముదము కాని, వాంతి ఎక్కువగ నున్నయెడల అరగ్రెయిను కాలోమెలు (రసకర్పూరము) గాని ఇచ్చుటయుక్తము. ఇట్లుచేయుటచే మధ్యనుండు చిన్నపేగులలోని మలము బయలువెడలి కొంతవఱకు పరిశుభ్రపడును.

పైనిచెప్పిన లంఖణ శోధనవిధులుగాక బిడ్డయొక్క, చర్మము ముడతలుపడి శరీరము వెచ్చగనున్నయెడల తడిగుడ్డలోబిడ్డను చుట్టిపెట్టియుంచుట యుక్తము. ఇందుచే మూత్రము స్రవించును. మూత్రము స్రవింప జేయుటకై స్వీట్‌స్పిరిట్సుఆఫ్ నైటరు మొదలగు మందులను కొంచెముగ నియ్యవచ్చును. బిడ్డకు మిక్కిలి చలువలుగ్రమ్మి శరీరమంతయు, చెమటలుబట్టి శీతలముగనున్నయెడల బిడ్డను కొంచెమావపిండికలిపిన గోరువెచ్చనినీటిలో తలవరకు ముంచియుంచుట మిక్కిలి యుక్తము. హారతి కర్పూరము 1టికి 15 పాళ్ళు నూనెలోచేర్చి దానిని 5 చుక్కలు చర్మముక్రిందికి పిచికారిచేయుటవలన వేడిపుట్టును. లేదా కర్పూరద్రావకము(Spirits of camphor)ను 5మొదలు 10 చుక్కలవరకు నోటిమార్గమున ఇయ్యవచ్చును. అరచుక్క లైకరు స్ట్రిక్నీనును (Liq strychnine) 4 గంటల కొకసారి చర్మముక్రిందికి పిచికారి చేయవచ్చును. బ్రాంది పదిచుక్కలు కోడిగ్రుడ్డులోని తెలుపుచేర్చిన నీళ్ళతో అప్పుడప్పుడు ఇయ్యవచ్చును.

బిడ్డను మొదటినుండియు చక్కని వెలుతురును, సామాన్యమైన గాలియు గలచోట జనసమ్మర్దములేకుండ పరుండ బెట్టవలెను. బిడ్డకు ప్రతిదినమును రెండుసార్లు గోరు వెచ్చని నీళ్ళతో స్నానము చేయించి పరిశుభ్రమైన బట్టలను వేయవలెను. చెడిపోయినప్పుడెల్లను మలము విసర్జించు గుడ్డలను మార్చుచు క్రొత్తగుడ్డలను మెత్తనివిగా వేయుచుండ వలెను. బిడ్డనోటిని తరుచు చన్నీళ్ళతో తుడుచుచుండవలెను. మోటగుడ్డతో తుడిచి పుండుచేయకూడదు. జనసమ్మర్దమును, దుర్గంధమునుగల పట్టణములలోని బిడ్డలను సాధ్యమైనయెడల విశాలమై పరిశుభ్రమైన పల్లెటూళ్ళకు మార్చుట మంచిది.

ఇతరమందులు:—ఈవ్యాధికి మందులంతగా ప్రయోజనకారులు కావని పైని చెప్పియున్నాము. పేగులలోని సూక్ష్మజీవులను నశింపుచేయుట కని యియ్యబడు సేలాలు మొదలగు మందుల వలన నంతగా ప్రయోజనము కానరాదు. ఎట్లు పనిచేయునో యింకను చక్కగా తెలియక పోయినను రసకర్పూరము (Calomel) ఈవ్యాధిలో నమ్మతగినమందు. విరేచనముల స్వభావమును బట్టి ఇంకను మరికొన్ని మందులు లాభకరములు కావచ్చును. విరేచనము మిక్కిలి పులుసు వాసనగనున్నయెడల బిస్మతుకార్బనేటుగాని, ఆరోమాటిక్ చాకు (Aromatic chalk) గాని ఉపయోగపడవచ్చును. విరేచనములు జిగురుగను ఆకుపచ్చగను ఉన్నప్పుడు అయిదు

చుక్కలు ఆముదము తుమ్మజిగురుతో చేర్చి పాలుమోస్తరుగా చేసి కొంచెము పిప్పరుమెంటు నీళ్ళతో రెండు లేక మూడు గంటలకొకసారి ఇయ్యవచ్చును. కక్కుటకొంచెము నెమ్మదిగానున్నప్పుడు బిస్మతు కార్బనేటు 10 గ్రెయినులును రసభస్మము గ్రెయినులో ఆఱవవంతును, డోవరుపౌడుము గ్రెయినులో ఆరవవంతును చేర్చి ఆపొట్లమును కోడిగ్రుడ్డు తెలుపు చేర్చిన నీళ్ళతోగాని చనుపాలతోగాని నాలుగు లేక ఆరుగంటలకొక సారి ఇయ్యవచ్చును.

విరేచనము మిక్కిలి పలుచగ నీళ్ళవలె నుండి మిక్కిలి వాసనగలిగి యున్నయెడల వగరుపదార్థము లిచ్చుట యుక్తము. సిల్వరునైట్రేటు గ్రెయినులో 8-వ వంతు, డైల్యూటు నైట్రికాసిడు ఒక చుక్క, గ్లిసరను 5 చుక్కలు, డిస్టిల్డువాటరు (వాననీరు) 120 చుక్కలు చేర్చిన ద్రావకమును దినమునకు మూడు లేక నాలుగుసార్లు ఇచ్చినయెడల వాసనగల నీళ్ళవిరేచనములకు మిక్కిలి గుణము కలుగును.

విరేచనములు కట్టుటకు ఈక్రింది తాళీశాదిచూర్ణము గాని జాతీఫలాది చూర్ణముగాని 2 మొదలు 5 గ్రెయినులు మోతాదులుగా తేనెతో నియ్యవచ్చును.

తాళీశపత్రి 1 పాలు, మిరియాలు 2 పాళ్లు, శొంఠి 3 పాళ్లు, పిప్పళ్లు 4 పాళ్లు, తవక్షీరి 5 పాళ్లు, ఏలకులు అరపాలు, లవంగపుపట్ట అరపాలు, చక్కెర 32 పాళ్ళును చక్కగ చూర్ణముచేసి వస్త్రగాలితము చేయవలెను. తాళీశాదిచూర్ణము.

జాజికాయ, లవంగాలు, ఏలకులు, లవంగపట్ట, పచ్చకర్పూరము, కరక్కాయ, ఉసిరిక్కాయ, వెలిగారము, తుంగముస్తలు వీనిని సమభాగములుగా తీసికొని చూర్ణముచేసి వస్త్రగాలితము చేయవలెను.

జాతీఫలాది చూర్ణము.

విరేచనములో జిగురును నెత్తురును ఉన్నయెడల బూరుగుబంక, అతివస, కొడిశపాలవిత్తులు వీనిలో దేనినైనను చక్కగ చూర్ణముచేసి రెండుమొదలు అయిదు గ్రెయినులు తేనెతో ఇయ్యవచ్చును. శరీరమున వేడిపుట్టుటకు కస్తూరిని ఇయ్యవచ్చును.

నల్లమందు

మన దేశమునందు పిల్లలకు నల్లమందు అధికముగ ఇచ్చుట గలదు. ఏమియు తెలియని తల్లులు నల్లమందిచ్చి సులభముగ పిల్లలను చంపవచ్చును. ఒక గురిగింజలో 15-వ వంతు ఎత్తు నల్లమందిచ్చి చచ్చిబ్రతికినట్లయిన ఒకానొక పిల్లను నేను ఎరుగుదును. మరియు ఒకానొకప్పుడు నల్లమందు చేయు ఉపకారము దానివలననే గాని మరియే యొక్క మందువల్లను కాదని కూడ చెప్పవచ్చును. కావున నల్లమందు వలన కలుగు అపకారోపకారములు దానిని మన ముపయోగించు పద్ధతులను బట్టియుండును. అతిసార విరేచనములలో నొకప్పుడు దీనివలన ఎక్కువ ఉపకారము కావచ్చును గావున నల్లమందును బొత్తుగ నిషేధింపక ఏయేసమయములలో ఎట్లు ఇయ్యవలయునో తెలిపెదము.

1. వ్యాధిప్రారంభించిన తోడనే ఎన్నడును ఇయ్యకుము. వ్యాధినికలుగజేయువిషపదార్థములన్నింటిని పేగులలోనడచిపెట్టి రోగమును తగ్గించుటకు బదులు హెచ్చించును. కాబట్టి వ్యాధి యొక్క ప్రథమావస్థలలో కొద్దిపాటి విరేచనకారులనే ఇచ్చుట యుక్తము.

2. కాళ్ళుచేతులు చల్లపడి రోగి నీరసస్థితిలోనున్నప్పుడు ఎన్నడును నల్లమందియ్యకుము. అట్లిచ్చినయెడల మత్తుఅధికమై ప్రాణములను తీయును.

3. నాలుకమీద తెల్లనిపిండిచేరి గఱుకుగానున్నప్పుడు నల్లమందియ్యకుము.

4. నల్లమందిచ్చుటకైనిద్రపోవుబిడ్డ నెన్నడును లేపవద్దు. ఈవిషయము గమనించినయెడల అధికమైన మోతాదువలన కలుగు అపాయముతగ్గును. తల్లిగాని దాదిగాని బిడ్డకదివరకే మైకముగానున్నప్పుడు, తిరిగిమందును ఇన్ని గంటలకొకసారి ఇయ్యవలెనను జ్ఞానముతోసరిగా చూడకుండ నిద్రపోవుబిడ్డను లేపి మందు ఇచ్చునెడల మిక్కిలి శోచనీయమైన అపాయము కలుగవచ్చును.

పై సూత్రములను గమనించుచు వాడినట్లైన ఈ క్రింద వివరించు అవస్థలయందు నల్లమందువలన గుణము చూపట్టును.

1. విరేచనములు మిక్కిలి తరచుగనగుచు రోగి మిక్కిలి హెచ్చుగ తినుకు చున్నప్పుడు నల్లమందియ్యవచ్చును. పేగులలో క్రింది భాగమునందు వ్యాధియున్నదని దీనివలన తెలియును.

2. విరేచనములలో మిక్కిలి వాసనయుండి నాలుక పరిశుభ్రముగనున్న యెడల నల్లమందియ్యవచ్చును. చిన్న పేగులో ఆహారము తగినంతసేపు నిలిచియుండి జీర్ణము కాకమునుపే పేగులయొక్క అధికచలనమువలన బైటకు గెంటి వేయబడుచున్నదనియు నల్లమందువలన అట్టివేగము నిలిచి జీర్ణశక్తి వృద్ధియగుటకు అవకాశము కలుగుననియు గ్రహించవలెను.

3. ఆహారము కడుపులో పడినవెంటనే విరేచనమయిన యెడల అట్టివిరేచనములకు కొంచెము నల్లమందిచ్చిన యెడల మిక్కిలి ఉపయోగకారి కావచ్చును. ఇదికూడ పైదానివలనే పేగులయొక్క చలనవేగమువలన గలుగును.

నల్లమందును ఇతరమందులతో చేర్చి ఇయ్యక ప్రత్యేకముగ ఇయ్యవలెను. ఒకానొకప్పుడు ఇతరమందుల గుణము కొరకై వానినిచ్చునప్పుడు నల్లమందును మాత్రము నిలుపవలసి వచ్చును. అప్పుడు అన్ని మందులను జేర్చి ఒకటే మందుగా చేసియున్న యెడల నిబ్బందియగును.

పదియవ ప్రకరణము

మలబద్ధము

మలబద్ధమునుగూర్చి తల్లులందరును మిక్కిలి చక్కగ తెలిసికొనవలయును. ఏలయన పసితనములో కుదర్చనియెడల ఇది యావజ్జీవమును రోగిని బాధించును. ఇతరములైన అనేక దురలవాటులవలెనే మలబద్ధమును ఒక్కసారిపట్టువడిన తరువాత విడుచుట దుర్లభము. మనలలో నెవ్వరైనను మలబద్ధముచే ఇప్పుడు బాధపడుచున్న యెడల మనతల్లియే దీనికి కారణమని ఆమెను దూషించిన తప్పుకాదు. ఏలయన ఆమె తగుప్రయత్నము చేసి పసితనముననే దానిని మాన్పిన ఇప్పుడు మనకీయవస్థ యుండదు. ఇట్లు వ్రాయుటనుబట్టి మలబద్ధమనువ్యాధిని గుఱించి ఎంతముఖ్యముగ తల్లులు శ్రద్ధపుచ్చుకొనవలెనో తెలిసికొనగలరు.

మలబద్ధము పోతపాలు త్రాగుబిడ్డలకంటె తల్లిపాలు త్రాగుబిడ్డలకు హెచ్చుగనుండును. ఆయాతల్లుల పాలయందు ఏదైన యొకవిధమైన లోపముండుటచేతనో లేక పాలుతక్కువగుటచేతనో మరి యేకారణముచేతనో నిశ్చయముగ చెప్పజాలము కాని కొందరుతల్లులపాలలో తగినంత కొవ్వుపదార్థ

ములు లేకపోవుటచేత మలబద్ధము కలుగవచ్చునని కొందఱి అభిప్రాయము. మలబద్ధముగల బిడ్డలకు కొందరికి కడుపునొప్పి యుండును. వీరల పేగులకు సరియైన గమనము లేకపోవుటయే మలబద్ధమునకు కారణముగావచ్చును. కొందరు బిడ్డలవిరేచనము రాయిగ సుద్దముక్కలవలె తెల్లగ పొడిపొడిగా నుండ వచ్చును. ఇట్టి బిడ్డల మలబద్ధము వారల పేగులలో తగినంత జీర్ణరసములు లేకపోవుటచేత నని చెప్పవచ్చును. మరి కొందరకు పుట్టుకతోనే పేగులలో కండబలము తక్కువగుటచే విరేచనము సరిగా కాకపోవచ్చును. మలబద్ధముగల కొందరు బిడ్డలకు బుద్ధి బలముకూడ తక్కువగ నుండి నరముల పటుత్వము చాలక యీయలవాటు కలిగియుండ వచ్చును. మలబద్ధముచేకలుగు నష్టములు:—

1. బిడ్డ చిక్కిపోవుట

2. ఆంత్ర వృద్ధి అనగా పేగు బొడ్డులోనికిగాని, గజ్జలోనికిగాని దిగుట.

3. ఆసనమువద్ద మాంసపుకండ క్రిందికి దిగుట.

4. పెద్దపేగు దినదినము తిత్తివలె పెద్దదై అందు మలము నిలువయుండి నానాటికి పేగులుబలహీనమును జెందుట.

5. నిద్ర సరిగా పట్టకపోవుట, ఆయాసపడుట, ఉలికి ఉలికి పడుట.

6. ఈడ్పువచ్చుట.

7. జ్వరము వచ్చుట.

చికిత్స:—మలబద్ధమునకు చికిత్స ఏనాటికానాడుచేసి విడిచివేసిన ఎంతమాత్రమును ప్రయోజనములేదు. తల్లులు సామాన్యముగా విరేచనము, 2 లేక 3 దినములవఱకు కాకపోయిన తరువాత ఇంత ఆముదముపోసి 4 లేక 5 విరేచనములు కాగానే తృప్తిపొందుదురు. తిరిగి 4 దినములవరకు విరేచనము లేకుండ బిడ్డఅవస్థపడుచున్నప్పుడే తిరిగి ఆముదము పోయుదురు గాని ఈనడుమరోజులు ఏమియుచేయక విడచివేయుదురు. ఇది గొప్పతప్పు. ఇట్లుచేయుటచేతనేబిడ్డకు చెడ్డలవాటుపట్టుపడును. సహజముగ, ఆముదములోతత్కాలమునకు విరేచనముకలిగించు గుణముండినను మరునాటికి మలబద్ధ మధికముగ చేయు గుణము దానిలోకలదు. కాబట్టి దినదినమును ఎంతఆముదమిచ్చిన బిడ్డకు 2 విరేచనములగునో అంతఇచ్చి అదేప్రకారము కొన్ని దినములో కొన్నివారములో కొన్ని నెలలో అవసరముకొలది ప్రతిదినమున ఇచ్చుచు క్రమక్రమముగ తగ్గించవలెను. కొంత కాలమునకు సహజముగ విరేచనమగుగుణము పేగుల కభ్యాసమువలన కలుగును. అంతవరకును తల్లులు విసుగుజెందకుండ ఏదోయొకవిధముగ ప్రతిదినమును విరేచనమగునట్లు చూచుకొనవలెను. విరేచనములకిచ్చు మందులన్నిటిలో ఇంతవరకు ఆముదమే బిడ్డలవిషయమై ప్రశస్తమైనదని వైద్యులందఱును సామాన్యముగా ఒప్పుకొందురు. కాని పైనిచెప్పినట్లు అనేక

కారణములవలన కలుగుమలబద్ధమునకు ఒకానొకప్పుడు ఎంత ఆముదము ఇచ్చినను పనిసరిగా చేయకపోవచ్చును. అట్టివారలకు

ముసాంబరము, అరఖు (Tincture of aloes)	3 చుక్కలు.
సోడా లేక మెగ్నిషియము సల్ఫేటు (Soda or Megnesium sulphate)	10 గ్రయినులు.
బెల్లడోనా అరఖు (Tincture of Bellodona)	1 చుక్క.
శొంఠి షర్బతు (Syrup of zinger)	20 చుక్కలు.

వీనిమొత్త మంతా 60 చుక్కలు అగువరకు పిప్పెరమెంటు నీళ్ళనుచేర్చి దానిని ఒక మోతాదుగా ఉదయమునను సాయంత్రమునుగాని, మూడుపూటలనుగాని, వయస్సునుబట్టియు రోగియొక్క బలమునుబట్టియు మోతాదుమార్చుకొనుచు, ఇచ్చినయెడల ఒకానొకప్పుడిది ఆముదముకంటె చక్కగ పనిచేయును.

ఇదిగాక కాలొమెలు (రసభస్మము) మోతాదు $\frac{1}{2}$ మొదలు 2 గ్రెయినులు బిడ్డలకు మిక్కిలి ఉపయోగకరము. సునాముఖి లేహముగాని రేవల్చిన్ని మాత్రలుగాని ఉపయోగింపవచ్చును.

1. సునాముఖిచూర్ణము 10, ధనియాలచూర్ణము 5, అత్తిపండు 10, చింతపండు 10, రేలగుజ్జు 9, ఎండుద్రాక్షపండ్లు 5, అతిమధురము చూర్ణము 1, బెల్లము 100, లేక చక్కెర 200, పాళ్ళుచేర్చి చక్కగనూరి కావలసినన్ని నీళ్ళుచేర్చుకొని లేహపాకమువచ్చునట్లు కొద్దినిప్పుమీద నెమ్మదిగా వండవలెను. మోతాదు 5 మొదలు 10 గురిగింజలెత్తుచొప్పున నాలుగుగంటల కొకసారి విరేచనమగువరకు బిడ్డకిచ్చుచుండవచ్చును.

సునాముఖిలేహము.

2. రేవల్చిన్ని 1, ముసాంబరము 1, ఓమము 2, శొంఠి 2, ఈప్రకారము పాళ్ళువేసి దీనిని చూర్ణమును తమలపాకులరసముతోగాని తులశిరస

ముతోగాని మెత్తగనూరి ఆవగింజలవలె మాత్రలు చేయవలెను. మోతాదు 1 మొదలు 8 మాత్రలు, తేనెతోగాని ఆముదముతోగాని ఇయ్యవలెను.

రేవల్చిన్నిమాత్రలు.

ఏమందు ఇచ్చినను ఆనాటికానాడు విడచివేయక క్రమమైనగుణము దినదినమునకు కలుగునట్లు శ్రద్ధతో అనేకదినములు ఇయ్యవలెను. మందులుగాక కొందరుబిడ్డలకు కొన్నాళ్ళవరకు ప్రతిదినమును రెండుపూటలును మెల్లగ చమురురాచిన చేతులతో పొట్టమీద చరుముచు అయిదునిమిషముల పాటు పరిశ్రమచేసిన కాలవిరేచనము చక్కగనగును. కొందఱబిడ్డలకు ఆహారము హెచ్చుచేసినయెడల మందులక్కరలేకయే విరేచనము సహజముగనగును. మరికొందరకు క్రొవ్వుపదార్థములు అనగా ప్రశస్తమైననేతిని ఉగ్గుతో కలపియిచ్చుట మంచిది. ఇట్టి బిడ్డలకు ఆవువెన్న గచ్చకాయంత పెట్టవచ్చును.

కాలవిరేచనము కానిపిల్లలకు కొందరు సబ్బుబిళ్ల ముక్కగాని, తమలపాకు తొడిమెగాని ఆసనములోపెట్టి కొంత సేపుంచుదురు. ఇట్లుచేయుటచే నొకానొకప్పుడు కొద్దిగవిరేచనము అయినను కొన్నిదినములీ ప్రకారము అలవాటయిన తరువాత నీచికిత్స చక్కగా పనిచేయదు. కొందరు ఆసనములోనికి గ్లిసరైనుగాని, సబ్బునీళ్ళు మొదలగునవిగాని పిచికారి చేయుదురు. అప్పటికప్పుడు అనుకూలమయినను ఆసనమార్గమున విడువక చికిత్సచేయుటచే ఆసనమును పేగులలోని చివరభాగమునురేగి పుండుపడును. కాబట్టి ఈవిధమగు చికిత్సలు దినదినము చేయుటకు తగినవి కావు.

పదునొకండవ ప్రకరణము

జ్వరము

అజీర్ణమును గూర్చి వ్రాయునప్పుడు వాంతులతోగాని, విరేచనములతోగాని జ్వరముకూడనుండవచ్చునని తెలిపియుంటిమి. వాంతులే జ్వరమునకు కారణము కాకపోవచ్చుననియు, ఇతర విధములైన జ్వరములు వచ్చునప్పుడు కూడ బిడ్డలకు జ్వరముతో పాటు వాంతులు రావచ్చుననియు చెప్పియుంటిమి. బిడ్డకు జ్వరమువచ్చినప్పుడు అది యెట్టిజ్వరమై యుండవచ్చునో తెలిసికొనుటకై ముఖ్యాంశములను వివరించెదము.

1. బిడ్డకు జ్వరమువచ్చినతోడనే దానికి తగినంత కారణము బిడ్డయొక్క జీర్ణకోశముల సంబంధమైనది లేదని తోచినయెడల గ్రామములో మశూచకము, ఆటలమ్మ, పొంగు, గవదలు మొదలగునవి కలవా లేవా యను విషయము యోచించవలెను. బిడ్డ ఒంటిమీద పొడలు, పొక్కులు మొదలగునవి ఉన్నది లేనిది శోధించవలెను. పొంగురాకముందు బిడ్డకు ముక్కువెంటను కండ్లవెంటను నీళ్లు వచ్చుట, కండ్లెఱ్ఱబడుట మొదలగు లక్షణము లుండును. ఆటలమ్మకు జ్వరము వచ్చిన దినముననే శరీరముమీద స్పష్టముగ పొక్కులు కనబడును. మశూచికము నందు తీవ్రమైన జ్వరము, వాంతి,

ఆయాసపడుట తప్ప మొదటి రెండుదినములలో వేరులక్షణములు సాధారణముగా నుండవు.

2. ఆయాసము హెచ్చుగనుండి బిడ్డ రోజుచు ఉన్నయెడల ఊపిరితిత్తులలో న్యూమోనియా అను కఫసంబంధమైన జ్వరముగా నుండవచ్చును.

3. ఇంట్లో దోమలును చుట్టుప్రక్కల చలిజ్వరపురోగులును ఉన్నయెడల బిడ్డజ్వరము చలిజ్వరమే (విషమజ్వరము) కావచ్చును. ఈజ్వరము సాధారణముగా ప్రతిదినము ఏదోయొక వేళవచ్చి కొంతసేపు విడిచివేయును. లేదా దినము విడచి దినము వచ్చును.

4. ఒకానొకప్పుడు విరేచనము కాకపోవుట చేతనే హెచ్చుజ్వరము రావచ్చును. కాబట్టి విరేచనము అయినదో లేదో విరేచనము ఎట్లున్నది అనువిషయములు గమనించవలెను. అజీర్ణ విరేచనములగుచున్నయెడల దానివలన జ్వరము రావచ్చును. జిగట నెత్తురుగా విరేచనము లగుచున్నను, విరేచనములో జీర్ణముగాని పాలసంబంధమైన తొరకలున్నను గమనింపుము.

5. చెవులో మిక్కిలి లోపలి భాగమున కురుపు ఉండవచ్చును. అప్పుడా చెవిచుట్టు ప్రక్కలతాకిన నొప్పియెత్తును. బిడ్డ చేతిని చెవివద్దకు తెచ్చుకొనుచుండును. లేనియెడల మరియెక్కడనయినను కురుపు తేలుచుండవచ్చును. శరీరము యావత్తును ఎముకలనుయావత్తును మెల్లమెల్లగ నొక్కిచూడవలెను.

చీము ఎక్కడ ఉన్నను ఎంత కొంచెమున్నను లోపల అడగి యున్న యెడల హెచ్చుజ్వరము రావచ్చును.

6. మూత్రము సరిగా పోవుచున్నదా లేదా? మూత్రము నందు చీము ఉన్నదా చూడవలెను.

7. గొంతులో నేదైన అడ్డుచుకొని యున్నట్లుగాని, యెఱ్ఱగనున్నట్లుగాని, వాపుగ నున్నట్లుగాని ఉన్న యెడల గమనింపవలెను. బిడ్డలకు గొంతుకలో కాయలవలెనుండి అవి ఉబ్బినప్పుడు జ్వరమువచ్చుట గలదు.

8. సన్నిపాత జ్వరము, క్షయ మొదలగు జ్వరములను చాలదినములకు గాని యొకానొకప్పుడు గుర్తించుటకు వీలుండదు.

చికిత్స :—జ్వరమురాగానే వైద్యునకు బిడ్డనుచూపుట మంచిది. అంతకుపూర్వము సరిగా విరేచనముకాకున్న యెడల అరగ్రెయినుగాని ఒకగ్రెయినుగాని కాలోమెలునుగాని కొంచెము ఆముదముగాని రెండునుచేర్చిగాని ఒకవిరేచనము అగునట్లుగా అలవాటునుబట్టి ఇయ్యవచ్చును. మిక్కిలి తీవ్రమైన జ్వరమున్న యెడల తలమీద మంచుగడ్డ వేసిన రబ్బరుసంచిని పెట్టవచ్చును. మిక్కిలి బరువైన గుడ్డలువేసి బిడ్డనుమూసిపెట్టకూడదు. మిక్కిలిహెచ్చుగ గాలివీచు చోట్లను పరుండబెట్టరాదు. గాలిలోబిడ్డనెత్తుకొని త్రిప్పరాదు. జ్వరముహెచ్చుగనుండి శరీరము కాగుచున్నప్పుడు పలచని మెత్తనిగుడ్డను చన్నీళ్ళలోతడిపి బిడ్డను ఆతడిగుడ్డలోచుట్టిపెట్టి బరుండబెట్టుట మంచిది. ఇట్లు జ్వరము తగ్గువరకు చేయ వచ్చును. ఇందుచే జ్వరముతగ్గి సామాన్యముగ హెచ్చు జ్వరముచే కలుగు ఈడ్పు మొదలగునవి రాకుండ ఉండును. ఇట్లు చేయునపుడు గదిలోనికి గాలి ప్రవాహముగరాకుండ తలుపులుకొంచెము మూసిపెట్టవలెను. జ్వరమున్నప్పుడు బిడ్డకు తగిన వయిద్యుడే చికిత్స చేయుట ఉత్తమము. అందుచే నింతకంటె హెచ్చుగ వ్రాయ లేదు.

జలుబుతోకూడిన జ్వరమునకు క్రిందవివరించిన కస్తూరి మాత్రలను తేనెతోగాని చనుపాలతోగాని అరగదీసి దినమునకు మూడు లేక నాలుగుచొప్పున ఇయ్యవచ్చును.

కస్తూరి, గోరోజనము, జున్ను, పావుదారు, మిరియాలు, సాళి రసము (Mercury) గంధకము వీనిని సమభాగములుగ గ్రహించి తమలపాకురసముతోగాని, తులసిరసముతోగాని మెత్తగనూరి ఆవగింజలవలె మాత్రలనుచేయవలెను. (కస్తూరిమాత్రలు)

శరీరము మిక్కిలివేడిగనుండి తాపమధికముగ నున్న యెడల ఉశీరాదిపానమను నీక్రిందికషాయమును నాలుగుగంటల కొకసారి ఏడాదిలోపుబిడ్డలకు 10 మొదలు 60 చుక్కలవరకు ఇయ్యవచ్చును.

వట్టివేళ్లు, కురువేరు, రక్తచందనము, పర్పాటకము, తుంగముస్తలు, శొంఠి వీనిని సమభాగములుగ తీసికొని చూర్ణముచేసి మొత్తమునకు నాలుగురెట్లు నీళ్లుచేర్చి రాత్రియంతయు ఆరుబయటపెట్టి తెల్లవారిన తరువాత

తీసి వడపోసియుంచేది. అప్పటికప్పుడు చేసికొనవలెననిన మొత్తమునకు నాలుగురెట్లు నీళ్ళుపోసి ఒక్కపొంగుపొంగించి వడపోసి ఇచ్చేది.

ఉశీరాదిపానము, శార్ఙ్గధరసంహిత, పూర్వఖండము, ద్వితీయాధ్యాయము

జ్వరము విడచివిడచి వచ్చుచున్న యెడల పంచతిక్త కషాయమును 20 మొదలు 60 చుక్కలవరకు తేనెగాని చక్కెరగానిచేర్చి దినమునకు రెండులేక మూడుసార్లు బిడ్డకడుపులో నాహారములేని సమయమున ఇయ్యవలెను.

నేలవేము, తిప్పతీగ, చేదుపొట్ల, కటకరోహిణి, పర్పాటకము వీనిని సమభాగములుగ తీసికొని మొత్తమునకు 16 రెట్లునీళ్ళుపోసి మూతలేనికుండలో సగముమిగులువరకు కాచి వడపోయవలెను. కషాయములో నాలుగవవంతు తేనెగాని, చక్కెరగానిచేర్చి గోరువెచ్చగ ఇయ్యవలెను. ఎప్పటికప్పుడు కషాయము చేసికొనవలెను.

పంచతిక్తకషాయము.

ఇట్టిజ్వరములకు సుదర్శనచూర్ణము 5 మొదలు 10 గురిగింజలెత్తు తేనెతో 8 గంటలకొకసారి ఇయ్యవచ్చును.

శార్ఙ్గధరసంహిత మధ్యమఖండము షష్ఠాధ్యాయము.

పంద్రెండవప్రకరణము

దగ్గు, ఉబ్బసము

అజీర్ణము తరువాత బిడ్డలను బాధించువ్యాధులలో ముఖ్యమైనది దగ్గు. ఈదగ్గులో అనేకవిధములు కలవు. ఒకవిధమైన దగ్గునకు కారణము బిడ్డయొక్క గొంతుకలోనే యుండును. ఇట్టి దగ్గులలో గొంతుకయందు ఎరుపును, వాపును, స్వరము కొంచెముమారి యుండుటయు కనిపెట్టవచ్చును. గొంతుకలో ఇరుప్రక్కలను 2 కాయలవలె నుండు దుర్మాంసపుకండలు ఉబ్బి దానివలన మాట చక్కగ రాకపోవుటయుకలుగును. జ్వరమునుఅప్పుడప్పుడు కలుగుచుండును. ముక్కునకును, గొంతునకును వెనకభాగమునందు దుర్మాంసము అధికముగ పెరిగియున్న యెడల బిడ్డలు నిద్రపోవునప్పుడు నోరు తెరచుకొని పరుండి నోటివెంటనే ఊపిరివిడుచుట చూడవచ్చును. ఇట్టి దుర్మాంసములచే బిడ్డలకు దగ్గు ఆయాసము కొద్దిపాటిజ్వరము తిరిగి తిరిగి వచ్చుచుండవచ్చును. ఇట్టిబిడ్డలు చక్కగ పెరగరు. కాబట్టి బిడ్డల అభివృద్ధికి గొంతుకలోని దుర్మాంసములేవియైనను ఆటంకము చేయుచున్న యెడల వానికి వైద్యుని అనుమతి ప్రకారము చికిత్సచేయుట ఉత్తమము. కరక్కాయ మొదలగు వగరు పదార్థములు గొంతువ్యాధులకు

మంచివి. ఒకానొకప్పుడు ఈదుర్మాంసములను కోసి ఎత్తివేయుట మంచిది.

గొంతువ్యాధిచే వచ్చు దగ్గుగాక ఊపిరితిత్తులలో కఫము చేరుటచే దగ్గు పుట్టవచ్చును. దగ్గుతోకూడ జ్వరము లేనియెడల అంతగ అపకారమేమియు కలుగక పోవచ్చునుగాని జ్వరము అధికముగా నున్నప్పుడు మిక్కిలి జాగ్రత్తగ చికిత్స చేయవలెను. న్యుమోనియా అనువ్యాధిలో ఊపిరితిత్తిలో నొకభాగముగాని ఒకవైపంతయుగాని ఉబ్బి కఫముతోనిండి ఊపిరి సరిగా ఆడక ఒకానొకప్పుడు ఉపద్రవమును కలుగజేయును. సామాన్యముగ న్యుమోనియావ్యాధి అకస్మాత్తుగ హెచ్చుజ్వరముతోను, వాంతులతోను ఒకానొకప్పుడు ఈడ్పుతోను ప్రారంభమగును. బిడ్డ ఊపిరి అతివేగముగ విడుచుచుండును. ఊపిరి బైటికి విడుచుటయందు ఒకవిధమైన ధ్వనియు, ముక్కుపుటములు ఆడుచుండుటయు చూడనగును. ఇట్లున్నయెడల వెంటనే బిడ్డను వైద్యునకు చూపుట యుత్తమము. న్యుమోనియా యొక్క ప్రథమావస్థలో దగ్గు ప్రథమలక్షణముకాదు. జ్వరమును, వేగముగ ఊపిరివిడుచుటయే ముఖ్యములు. కొందరు బిడ్డలు న్యుమోనియాతో 3 లేక 4 దినములవరకు ఆడుకొనుచునే యుండవచ్చును. న్యుమోనియా జ్వరము సామాన్యముగ 7 లేక 8-వ దినమున అకస్మాత్తుగ దిగిపోవును. కాని ఒకానొకప్పుడు ఊపిరితిత్తులలో నీవ్యాధి ఒకతిత్తిని విడిచి మరియొక తిత్తిలో ప్రవేశించుటచే వ్యాధి అంతయు ఒక్కసారి దిగిపోక క్రమక్రమముగ తగ్గవచ్చును.

చికిత్స:—కొంచెము గోరువెచ్చని నీళ్లలో మెత్తని గుడ్డనుతడిపి పిండివేసి జ్వరముహెచ్చుగా నున్నప్పుడు అనగా 104 దాటి బిడ్డ ఆయాసపడుచున్నప్పుడు శరీరమంతయు చక్కగ తుడుచుటకంటె వేరుచికిత్స ఏమియు అక్కరలేదు. కాని బిడ్డను చక్కని వెలుతురును, విశాలమును గల గదిలో పరుండబెట్టి విస్తారము గాలి రానీయక అధికముగ ఆహారమీయక జనసమ్మర్దము లేనిచోట నుంచి చక్కని ఉపచారము చేయుచునుండవలెను. నిద్దుర లేనియెడల వైద్యుడుమందిచ్చును, కాని నల్లమందు వేయరాదు. బిడ్డశరీరము పైని మోపులు మోపులుగా బట్టలువేసి అడచి పెట్టి ఊపిరి ఆడకుండ చేయరాదు. కాగిచల్లారిన చల్లనిమంచినీళ్ళను బిడ్డతాగినన్ని ఇయ్యవచ్చును.

పైన వివరించిన సామాన్యమైన న్యుమోనియా గాక మెల్లమెల్లగ దగ్గుతో ప్రారంభించి మొదట కొంచెము జ్వరము వచ్చి పిమ్మట జ్వరము అధికమై దానితోపాటుదగ్గును, ఆయాసమును హెచ్చి అలసటకలిగించు మరియొకవిధమైన బ్రోంకో న్యుమోనియా అనువ్యాధి మరియొకటికలదు. ఇదిసామాన్య న్యుమోనియావలె అకస్మాత్తుగవచ్చి కొన్నిదినములు మితిగా ఉండి అకస్మాత్తుగ దిగిపోదు. మెల్లమెల్లగవచ్చి నియమము

లేకయుండి రోగినిపీడించి మెల్ల మెల్లగ దిగిపోవును. సామాన్య న్యుమోనియాకంటె ఇది బిడ్డలమరణమునకు హెచ్చుగ కారణమగును. చక్కని ఉపచారమును విశాలమైనగదియు అత్యధికముకాని ఆహారమును ఈవ్యాధిని కుదుర్చుటకు ముఖ్యములు. ఈవ్యాధి చిరకాలము విడువక ఉన్నయెడల ఒకానొకప్పుడు స్థలముమార్చుట యుక్తము. ఒకానొకప్పుడు వ్యాధి ఊపిరితిత్తులలోనుండి బైటికివ్యాపించి త్రిత్తిపైపొరలమధ్య గసిగాని, చీముగానిచేరి జ్వరము విడువకయుండవచ్చును. దానిని వెంటనేకనిపెట్టి శస్త్రముచేసి తీసివేయుటయుక్తము.

తేమతో చితచితలాడునేల, పొగగ్రమ్ముపొయ్యి, చీకటికొట్టు, క్రిక్కిరిసినసామాను, చూడవచ్చినగుంపు, కిరసనాయలు దీపము, చీముదూరకుండ మూసిన కిటికీలు, ఊపిరిఆడకుండ కంబళ్ళు, గొంతువరకుతిండి, జ్వరముతగ్గుటకు మందులు, వీనితో చికిత్సచేసిన బిడ్డకు ఒకటేమార్గముగాని వేరొకటిలేదని చెప్పవచ్చును.

ఉబ్బసము:—తల్లిదండ్రులనుండి వంశపారంపర్యముగ ఉబ్బసముగాని, నరములసంబంధమైన తలనొప్పి మొదలగు వ్యాధులు గాని గలవారిబిడ్డలకు ఉబ్బసము పసితనముననే రావచ్చును. ఇదిగాక గొంతుకలో దుర్మాంసములుగల బిడ్డలకు కూడ ఉబ్బసము రావచ్చును. అజీర్ణమువలనను, కడుపులో పురుగులుండుటవలనను, మొగపిల్లల పురుషాంగముపై తోలు

అంటుకొనిపోయి ఉండుటవలనను ఉబ్బసము రావచ్చును. ఇతర దగ్గులకును ఉబ్బసపు దగ్గునకునుగలభేదము తెలిసికొనుట యొకానొకప్పుడు కష్టముగానుండవచ్చును. ఆయాసము అకస్మాత్తుగతగ్గుట ఉబ్బసమునకుగల నిదర్శనములలో ముఖ్యముగ గమనింపనగును.

చికిత్స:— 1. బిడ్డపడకపైని గుడ్డతో గుడారమువలె నిర్మించి ఆగుడారములో అడ్డసరము, ఉమ్మెత్త మొదలగు ఉబ్బసముహరించు ఆకులపొగను తగుమాత్రము వేయుట మంచిది. ఒక గరిటలోనిప్పువేసి ఆనిప్పుమీద ఓషధులను వేసి దానిమూలమున గుడారములోనికి పొగచొప్పించవచ్చును.

2. ఆహారము మిక్కిలి శ్రద్ధతోసరిచూడవలెను. సరిగా కాలవిరేచనము అగుచుండునట్లు చూడవలెను. అవసరమైన యెడల కొంచెము కాలోమెలు ఇయ్యవలెను.

3. తడిలోనికిని, చలిగాలిలోనికిని బిడ్డనుతీసికొని వెళ్ళగూడదు. కాళ్ళు,ఎదుర్రొమ్ము, మెడ కప్పి వెచ్చగనుంచవలెను. వేడినీళ్ళ స్నానముచేయగానే ఎదుర్రొమ్ముపైని చన్నీళ్ళను, వాడుకగా కొట్టుచున్నయెడల బిడ్డమోటుబారి కొందరకు ఉబ్బసముతగ్గునని చెప్పుదురు.

4. స్థలము మార్చినయెడల కొందరికి ఉబ్బసముతగ్గును.

5. తీవ్రమైన లక్షణములున్నయెడల తగినవైద్యునకు చూపవలెను.

6. ఉబ్బసము తిరిగిరాకుండ చేయవలెననిన విడవకుండ చాలనెలలు చికిత్సచేయవలెను.

బిడ్డలకు జలుబుతోకూడిన దగ్గునకు కరక్కాయిగాని లవంగము, సన్నరాష్ట్రము, దుంపరాష్ట్రము వీనిలో దేనినైన గాని తేనెతో రెండులేక మూడుచుట్లు సానమీాధ అరగదీసి నాలుకకు రాయవచ్చును. నల్లతనులపాకుల రసము 10 మొదలు 30 చుక్కలవరకు వీనితోకలిపి ఇయ్యవచ్చును. కఫము అధికముగనుండి బిడ్డదగ్గుచే బాధపడుచున్నపుడు అడ్డసరపు ఆకురసము 30 చుక్కలవరకు తేనెతోకలిపిగాని ప్రత్యేకముగ కాని ఇయ్యవచ్చును. జ్వరమధికముగ నున్నయెడల జ్వరప్రకరణమున చెప్పినమందులను, చికిత్సను ఉపయోగపరచుకొనవలెను.

పదమూడవ ప్రకరణము

సాంక్రామిక వ్యాధులు

సాంక్రామిక వ్యాధులనగా ఒకరినుండి మరియొకరికంటువ్యాధులు. మసూచకము, ఆటలమ్మ, పొంగు, గవదలు, కండ్లకలక మొదలగునవి ముఖ్యముగ గమనింపదగును. అంటువ్యాధుల వ్యాపకమునుగూర్చిన విషయములను సంక్షేపముగ తెలియజేయుపట్టీని ఈ ప్రకరణముయొక్క చివరభాగమున నుదాహరించి యున్నాము. ఈవ్యాధులుగల రోగుల శరీరమునం దొక్కొక్కవ్యాధి కొక్కొకజాతి సూక్ష్మజీవులు గలవనియు, ఈసూక్ష్మజీవులొకరినుండి మరియొకరి కంటుకొనుటచే నీవ్యాధి యొకరినుండి మరియొకరి కంటుకొనుననియు నిప్పటిసిద్ధాంతము. ఈసూక్ష్మజీవులు మురికిగలచోట్లను, జనసమ్మర్దము గలచోట్లను అధికముగవృద్ధియగును. ఈవ్యాధులు వ్యాపింపకుండ మనము చేయవలెననినయెడల మనము ఈక్రింది మూడు, ముఖ్యసూత్రములను గమనించవలెను. ఇతరవిషయములనుగూర్చి మేము రచించిన అంటువ్యాధులను గ్రంథమును చూడనగును.

1. వ్యాధిని ప్రకటనచేయుట.-(Notification) అనగా అంటువ్యాధి గ్రామములో ప్రవేశించినతోడనే దానిని దాచి

పెట్టక తత్క్షణమే సర్కారు ఉద్యోగస్థులకును, తద్వారా సర్వ జనులకును బహిరంగపరచవలెను.

2. రోగిని ప్రత్యేకపరచుట.-(Isolation) అనగా రోగి నుండి యితరుల కావ్యాధి అంటకుండ చేయుటకై రోగిని ప్రత్యేకస్థలమునందుంచుట. అనుమానాస్పదమగు ప్రదేశముల నుండి వచ్చు ప్రయాణీకులను తగిన శోధనచేయకుండ గ్రామము లోనికి రానీయకూడదు.

3. వ్యాధికి కారణ భూతములగు సూక్ష్మజీవులను సంహరించుట.

1. సూక్ష్మజీవులయొక్క ఆహారములగు మురికి పదార్థములు మనచుట్టుప్రక్కల లేకుండ సర్వప్రదేశములను పరిశుభ్రముచేయుట (By clearing dirt)

2. సూక్ష్మజీవులు మనశరీరములో ప్రవేశించినను వానికి లొంగకుండ మనశరీరదార్ఢ్యమును చక్కగ వృద్ధిపరచుకొనుట (By improving personal Hygiene)

3. మనశరీరములో సూక్ష్మజీవులవృద్ధికి హానికరములగు టీకాలు మొదలగు సాధనముల నభివృద్ధిపఱుచుట (By acquiring immunity)

4. వ్యాధులను పుట్టించు సూక్ష్మజీవులను దొరకినచోట్లనెల్ల వెదకి వెదకి చంపుట, (By Disinfiction).

సూక్ష్మజీవుల దండయాత్రను మనము సంహరించుటకై ఫినైలు ఒకటికి 20 పాళ్ళు నీళ్లతోను, కార్బాలికు ఆసిడ్డు ఒకటికి 40 నీళ్లతోను, సావరము ఒకటికి 2,000 పాళ్ళు నీళ్ళతోను, పొటాసియము పెర్మాంగనేటు ఒకటికి 1000 పాళ్ళు నీళ్ళతోను కలిపి ఆనీళ్లతో అనుమానాస్పదములగు ప్రదేశముల నన్నిటిని పరిశుభ్రము చేయవలెను. ఈమందు నీళ్ళలో రోగులు ఉపయోగించు సమస్తసామానులును చక్కగ ఊరనిచ్చి ఉడకబెట్టి పిమ్మట ఎండలో వేయవలెను. అంటువ్యాధులుగల రోగుల సంపర్కముగలిగిన వారలందరును ఈమందునీళ్ళలో చేతులను 5 నిమిషములవరకును ముంచియుంచి చక్కగ కడిగికొనవలెను.

సూక్ష్మజీవసంహారులు.

ఈక్రింది త్రిమూర్తులను మనమెన్నడును మరువరాదు.

1. ఎండ
2. గాలి
3. నిప్పు

1	మయిలపడిన సామానులను పరిశుభ్రముచేయునది	ఎండ
2	చీకటిగదులను పరిశుభ్రముచేయునది	గాలి
3	మరికినీటిని పరిశుభ్రముచేయునది	నిప్పు

☞ పొంగునీళ్లలో నుడకబెట్టినయెడల 15 నిమేషములలో సూక్ష్మజీవులన్నియు చచ్చును; కాబట్టి నీటిని చక్కగ మరగనిచ్చి చల్లార్చుకొని త్రాగవలెను. మంచినీళ్లలోని మట్టి మొదలగు మలినపదార్థములను తొలగించుటకై ఇందుపకాయ (చిళ్ళగింజ) గంధమును నీళ్ళలో కలిపి నిలవయుంచి తేటనీటి నుపయోగించవలెను.

అంటువ్యాధుల పట్టీ.

నెం	వ్యాధి పేరు	అంతర్గత కాలము (శరీరములో సూక్ష్మ జీవులు ప్రవేశించినది మొదలు వ్యాధి బయటబడుటకు పట్టు కాలము)	రోగిని బహిష్కరింప వలసిన కాలము
	1	2	3
1	మశూచకము (Small Pox) లేక పెద్దమ్మవారు	10 మొదలు 15 రోజులు	పక్కు లన్నియు ఊడిపోవువరకు. అనగా 2 మొదలు 4 వారములు
2	ఆటలమ్మ లేక పైరమ్మవారు (Chicken Pox)	10 మొదలు 14 రోజులు	సాధారణముగా 2 వారములు
3	పొంగు లేకతట్టమ్మ (Measles)	10 మొదలు 12 రోజులు	డిటో
4	సన్నిపాతజ్వరము (Typhoid)	7 మొదలు 21 రోజులవరకు - సగటున పదునాల్గు దినములు	జ్వరము విడిచిన తరువాత 42 దినములు
5	డెంగుజ్వరము (మడకలమ్మ) (Dengue fever)	2 మొదలు 6 రోజులు	10 లేక 14 దినములు
6	గవదలు లేక పుట్టలమ్మ (Mumps)	10 మొదలు 25 రోజులవరకు	4 వారములు
7	కోరింతదగ్గు లేక కక్కువాయి దగ్గు (Whooping Cough)	7 మొదలు 14 రోజులు	1 వ్యాధి ప్రారంభమయినది మొదలు 6 వారములు
8	కలరా	1 మొదలు 4 దినములలోపల	పదిదినములవరకు
9	చలిజ్వరము (Malaria)	1 లేక 2 వారములు. అంతకు పైన కూడ నుండవచ్చును	జ్వరము బొత్తిగ రాకుండువరకు
10	కండ్లకలక	1 వారము	పుసికట్టకూడదు
11	సెగ (Gonorrhœa)	2 లేక 8 రోజులు	చీముతగ్గిన తరువాత ఆరు వారములు
12	ఇన్ఫ్లూయెంజా (Influenza)	1 లేక 3 రోజులు	14 దినములవరకు
13	ప్లేగు	1 మొదలు 7 రోజులు	21 దినములవరకు
14	కల్లవాపు (Glanders) డిటో	3 మొదలు 18 రోజులవరకు	పశువ్యాధి 14 దినములవరకు
15	దొమ్మ (Anthrax) పశువ్యాధి	2 మొదలు 3 రోజులు	డిటో
16	సర్పిలేకదద్దురు (Erisipelas)	1 మొదలు 2 రోజులు	7 దినములవరకు
17	ధనుర్వాయువు (Tetanus)	2 దినములు మొదలు 24 దినములలోపల	. . . .
18	సూతిక జ్వరము (Peurperal fever)	1 మొదలు 5 రోజులు	. . . .
19	కొరుకు (Syphillis)	40 రోజులు అంతకన్న ఎక్కువ	రెండు సంవత్సరములు
20	కుక్కకాటు	బహుశః కొన్ని వారములు లేక నెలలు	వ్యాధి కుదురువరకు
21	క్షయ	నిశ్చయముగా తెలియదు	వ్యాధి కుదురువరకు లేకయావజ్జీవము
22	న్యూమోనియా (Pneumonia)	డిటో	కఫమువచ్చుచున్నంత కాలము
23	సంధియొత్తే మెడ నడుము కొయ్యబారివంగిపోవు ఒకవిధమైనజ్వరము (Cerebro-spinal fever)	7 మొదలు 14 దినములు	. . . .

నెం	వ్యాధి పేరు	అంతర్గతకాలము (శరీరములో సూక్ష్మజీవులు ప్రవేశించినదిమొదలు వ్యాధి బయిటబడుటకు పట్టుకాలము)	రోగిని బహిష్కరింప వలసిన కాలము
	1	2	3
24	తామర (Ring-worm)	8 దినముల లోపల	పూర్తిగపోయిన తరువాత 28 దినములవరకు
25	కుష్ఠవ్యాధి (Leprosy)	తెలియదు కొన్ని సంవత్సరము లుండవచ్చును	వ్యాధి పూర్తిగ కుదురువరకు
26	గజ్జి (Itch)	8 దినములు	6 వారములు
27	తిమ్మిరివాయువు(నంజు) (Beri-beri)	నాలుగు వారములు	నిశ్చయముగా తెలియదు
28	డిఫ్తీరియా (Diphtheria గొంతుకలోపుండుపుట్టి చంపు వ్యాధి)	1 మొదలు 4 దినములు	వ్యాధి కుదిరినతరువాత 8 వారములు
29	బూదకాలు (Elephantiasis)	నిశ్చయముగా తెలియదు	యావజ్జీవముజ్వరమువచ్చు దినములు
30	నారికురుపు	కొన్ని వారములులేక నెలలు.	కురుపుపూర్తిగా మానిపోవువరకు
31	క్రిమిజపాండువు (Ankylostomiasis)	నిశ్చయముగా తెలియదు.	విరేచనములో క్రిములగ్రుడ్లుండు నంతవరకు

గజ్జి, బూదకాలు, నారికురుపు క్రిమిజపాండువు వీనిని పుట్టించునది పరాన్నభుక్కులను జాతిలోని జంతువులు - నిజమైన సూక్ష్మజీవులు కావు.

పదునాలుగవ ప్రకరణము

కొరుకు-పచ్చుసెగ

ఈవ్యాధులను ప్రత్యేకముగ నొక ప్రకరణములో జేర్చి ఇక్కడ చర్చించుట కొందరకు అసంగతముగ తోచవచ్చును. కాని ఈవ్యాధులు మనదేశమునందు ఇప్పుడు వ్యాపించుచుండు తీవ్రమునుబట్టియు, తల్లులకు వీని విషయమై గల అజ్ఞానముచేత గలుగు అపాయపరంపరలను బట్టియు, దాదుల మూలమున గొప్పగొప్ప కుటుంబములలోగూడ పాపము! నిరపరాధులగు బిడ్డలకీవ్యాధులంటి వారలను జీవితకాలాంతమువరకు పీడించుచుండుటను బట్టియు వీని వ్యాపకమునుగూర్చి అందరకును కొంతవరకైనను తెలియుటకై ప్రత్యేకముగ నొక ప్రకరణ మిచ్చితిమి.

తల్లితండ్రుల నుండిగాని తాతలనుండిగాని వచ్చిన కొరుకు సంబంధమైన నిదర్శనములు.

1. పూర్వచరిత్ర.—౧. ఇంతకు పూర్వము పుట్టిన బిడ్డలు బ్రతుకక పోవుట. ౨. బిడ్డలు చచ్చిపుట్టుట. 3. తల్లికి తరుచు గర్భస్రావములయి యుండుట. ౪. తొమ్మిది నెలలు నిండక పూర్వమె బిడ్డ పుట్టియుండుట.

2. బిడ్డకొకవిధమైన ముఖవర్చస్సు:—౧.కనుబొమ్మలు అణగియుండుట. ౨. చితుకముక్కు అనగా ముక్కుదూలము వంగియుండుట. 3. తల ఎముకలు సరిగా అతుకుకొనక సంధుల వద్ద యెముకల అంచులు బొడ్డుగ ప్రోగుపడియుండుట.

3. పిర్రలమీదను ఇంకను అక్కడక్కడ శరీరము మీదను యెఱ్ఱనిరంగుగల దద్దులును పొక్కులును పుండ్లును కనబడుట. (తొడలసందులను, పిర్రలసందులను, మలమూత్రాదులంటుట వలనను, రాపుడుచేతను ఒకానొకప్పుడు ఈవ్యాధి లేనిపిల్లలకుగూడ దద్దులుపుట్టవచ్చును. కాని ఈభేదము వైద్యుడు సులభముగ తెలిసి కొనవచ్చును).

4. ముక్కు లోపలి పొరలలో జబ్బుపుట్టుటచే తరుచు జలుబు చేసినట్లుగా ముక్కులు బిడాయించుకొని పోవుట. సామాన్యమైన జలుబునకును దీనికినిగల భేదము వైద్యుడు కనిపెట్టవచ్చును.

5. ఎముకలలో సామాన్యముగా నొప్పులుండి బిడ్డ రాత్రులయందు నిద్రపోక తెల్లవార్లు ఏడ్చుచుండుట, వేళ్ళకణుపులు లావెక్కుట.

6. కొరకు సంబంధమైన అంటుసోకిన బిడ్డలు సామాన్యముగా పుట్టినప్పటినుండియు ఏదోయొక విధమైన జబ్బుచే చిక్కిపోవుచునే యుందురు. కొందరు పుట్టినదిమొదలు కొన్ని వారములవరకు బాగుగ నున్నట్లుండి చిక్కుటకు ప్రారంభింతురు.

ఇవి సంక్షేపముగ బిడ్డలకు వంశపారంపర్యముగ వచ్చు కొరుకువ్యాధియొక్క ముఖ్యలక్షణములు. ఇందు కొన్నిలక్షణములు ఇతరవ్యాధులకుకూడ ఉండుటచేత త్వరపడి యేదో ఒక లక్షణము చూచి కొరుకువ్యాధి బిడ్డకు గలదని భయపడరాదు. జాగ్రత్తగ పరిశోధన చేయవలెను.

వంశపారంపర్యముగవచ్చు కొరుకువ్యాధిగాక దాదులు ముద్దుపెట్టుకొనునప్పుడు ఎంగిలి తగులుటవలనను, పండ్లకాటు తగులుటవలనను, వారలకుండు పుండ్లమీదిరసి బిడ్డలకంటుటవలనను ఈవ్యాధి గొప్పగొప్ప కుటుంబములలోని బిడ్డలకు పాప మకారణముగ వచ్చియుండుటచే ఇట్టి సంపర్కము విషయమై తల్లులు మిక్కిలి జాగ్రత్తగ నుండవలెను. దాదులకీవ్యాధియున్నయెడల వారలచే పాలిప్పించరాదు. బిడ్డకీవ్యాధియున్నయెడల వ్యాధిలేని దాది యీబిడ్డకు పాలిచ్చినప్పుడు దాది కీవ్యాధి అంటుకొనును. కాబట్టి ఇట్టిబిడ్డలకు తల్లి అయినను పాలీయవలెను. లేదా యీవ్యాధిచే నదివరకే పీడింపబడిన దాదియైనను పాలీయవలెనుకాని ఆరోగ్యవంతురాలగు దాది ఇట్టిబిడ్డలకు పాలిచ్చిన తప్పక ఈవ్యాధి దాదికి రావచ్చును.

పచ్చసెగ.

మనదేశమున ఈవ్యాధి నానాటికి ప్రబలుచుండుటచే దీనినిగూర్చి ఇక్కడ వివరించినాము. ఈవ్యాధివలన బిడ్డలకు రెండు ముఖ్యమైన అపాయములు గలవు. పచ్చసెగ అంటువలన బిడ్డలకు కండ్లకలక వచ్చును.

1. బిడ్డపుట్టీపుట్టకముందే అనగా తలమాత్రముబైటకు వచ్చినతోడనే కండ్లను బోరికుమందు నీళ్ళ (1-కి 10) లో ముంచిన స్వచ్ఛమైన దూదితో కడగవలెను. లేనియెడల తల్లి కొకవేళ ఈవ్యాధియున్నయెడల బిడ్డపుట్టు మార్గములోనుండి యున్న పచ్చసెగ చీము కంటికి తగిలి కండ్లకలకవలె ఈవ్యాధి కంటికివచ్చి కండ్లుపోవును. వెంటనే చికిత్సచేయని యెడల ఈవ్యాధి కుదరదు. ప్రపంచములోని గ్రుడ్డివారలలో మూడవవంతు ఈప్రకారము కండ్లు పోగొట్టుకొనిన వారలే గనుక ఇంతగ వ్రాసినాము.

2. దాదులు మొదలగు వారల కీవ్యాధియుండి, వారల కొంగులతో స్నానముచేసినబిడ్డలను, తుడుచుటవలన నేమియు నెరుగని పసిబిడ్డల జననేంద్రియములలో నీవ్యాధి కొన్ని కుటుంబములలో కనుపడి యున్నది. కాబట్టి మిక్కిలి పరిశుభ్రమైన గుడ్డలనే యుపయోగించవలెనుగాని అయినగుడ్డను కాని గుడ్డను దాదు లుపయోగింపరాదు.

చికిత్స:—తగినవైద్యుడే చేయదగినదిగాన ఇచ్చట నీవిషయమును వివరించలేదు. కొరుకు వ్యాధికితగిన మోతాదులతో రసకర్పూరముగాని లేక రసముకలిసిన ఇతర మందులనుగాని మెళుకువతో నుపయోగించవలెను. పచ్చసెగయొక్క అంటుచే కలిగిన కండ్లకలకయందును, యోని పుండ్లయందును బోరికుమందు నీళ్ళతో వెచ్చవెచ్చగ వ్యాధిగల భాగములను దినమునకు 5 లేక 6 సార్లు చక్కగ కడగవలెను.

పదునైదవ ప్రకరణము

వికారస్వరూపము.

(పొట్ట - గూను)

ఈప్రకరణమునం దాహారసంబంధమైన యొకవ్యాధిని గూర్చి ప్రత్యేకముగ వ్రాయుచున్నాము. ఈవ్యాధికి సరియైన పేరు తెనుగు భాషయందుగాని సంస్కృత భాషయందుగాని కానరాదు. ఇంగ్లీషునందు దీవ్యాధికి రిక్కెట్సు అనిపేరు. రిక్కెట్సు అనుపదమునకు వికారస్వరూపమని వ్యుత్పత్త్యర్థము. ఈవ్యాధినిగూర్చి ఇంగ్లీషులో మొట్టమొదట అనగా 1681 సంవత్సరములో గ్లిసను అనునాతడు వివరించి యున్నాడు.

ఈవ్యాధి మనదేశమునం దీకాలమున హెచ్చుచున్నదని చెప్పుటకు నిదర్శనములు కలవు. నవనాగరికత హెచ్చి తల్లులు తమబిడ్డలకు పాలిచ్చుటకుగల సదుపాయములుతగ్గిన కొలది ఈవ్యాధి హెచ్చును. తల్లులకేదో పనితొందరచేతగాని, స్వతహాబలహీనతచేగాని పాలు లేక ఇతర ఆహారములు త్రాగుటవలన పిల్లల కీవ్యాధి హెచ్చుగవచ్చును.

ఈవ్యాధియొక్క ముఖ్యమైన లక్షణములు.

1. ఎముకలలో విపరీతమైన లావెక్కుట:-మన కాళ్ళు, చేతులు, ఎదురురొమ్ము మొదలగు స్థలములలోనుండుపొడుగాటి

ఎముకలు కొనలయందును, తలయందుండు పరుపైన ఎముకలు మధ్యభాగము నందును పెరుగుచుండును. ఆరోగ్యస్థితిలో నీయెముకల వృద్ధి యిట్లగుచుండునుగాని ఈవ్యాధిలో నిట్టి పెంపుగల చోట్లనుండు యెముక మిక్కిలి విపరీతముగ పెరుగును. ఇందుచే పొడుగు యెముకల కొనలయందు వికారమైన లావేర్పడును. ఇట్టిలావు ఎదురురొమ్ము ఎముకలలో తులసిపూసల తావళములవలె రెండువైపులను మధ్యయెముకకు ప్రక్కలందు పైనుండి క్రిందికి రెండు వరుసలుగా తెలియును. కాళ్ళుచేతులలోని సంధులవద్ద ముద్దముద్దలుగా ఎముకలు లావెక్కి యుండును. తలలోని యెముకలు సామాన్యముగా పెరుగునట్లు అర్ధ చంద్రాకారమైన వలయమేర్పడునట్లు పెరుగక, తల పలకలుదేరి చదరముగా పెట్టెవలె పెరుగును. తలయొక్క మధ్యభాగము ఎత్తుగను వట్రువగను ఉండుటకుబదులు పరుపుగనుండును. మాడపట్టుననుండు గుంటలు శీఘ్రముగా పూడక వానియంచులలోని యెముక బొద్దుగా ప్రోగుపడియుండును.

2. ఎముకలు వంగుట.

3. ఎముకలలోని అక్రమమైన లావుగాక వానియందలి ఖనిజపదార్థములు హరించిపోవుట.

సహజముగ ఆరోగ్యవంతమైన వారి ఎముకలలో 63 పాళ్ళు ఖనిజపదార్థముండును. ఈవ్యాధిగల బిడ్డల శరీరములో

నీఖనిజపదార్థము నూటికి 21 పాళ్లు మాత్రమే ఉండును. ఈఖనిజపదార్థములో చాలభాగము సున్నము సంబంధమైనది. ఎముకకు గట్టినిచ్చునది. ఇట్టిపదార్థము తక్కువగుటచేత ఎముకలు మెత్తనై వంగిపోవును.

౧. కాళ్ల యెముకలలో సామాన్యముగా తొడయెముక ముందునకు వంగును. పిక్కలోని పెద్దయెముక క్రిందిభాగమున ముందునకుగాని వెలుపలి వైపునకుగాని వంగిపోవును. దండయెముకలును, ముంజేతి యెముకలునుకూడ వెలుపలి వైపునకే వంగును. ఈమార్పులు సామాన్యముగా బిడ్డలుకూర్చొను అలవాటునుబట్టి ఉండును. చేతులమీద బరువానుకొని కూర్చుండినప్పుడు మెత్తని ఎముకలు వెలుపలవైపులకువంగుట సహజమేకదా. ఇట్లే వెన్నెముకమధ్య నేదోయొకభాగమున వెనుకవైపునకు వంగుటచే గూను ఏర్పడును.

4. పైనివివరించిన యెముకల సంబంధమైన లక్షణములుగాక ఊపిరితిత్తులలోను, కడుపులోనుకూడ నీవ్యాధి లక్షణములను గుర్తింపనగును. ఈబిడ్డలకు తరుచుగ జలుబు దగ్గు వచ్చుచుండును. తరుచుగ పలుచని విరేచములగుచుండును. కొంతమందిపిల్లలకు ప్లీహముకొంచెము పెద్దదిగను గట్టిగను ఉండును. ఈలక్షణములే ఎముకలవంపులకంటె బిడ్డలకు హెచ్చుగ అపకారమును చేయును. జీర్ణశక్తి సరిగాలేక పొట్టపెద్దదై ముందరకువచ్చుట స్పష్టముగ చూడనగును.

5. కొందరు బిడ్డలకు ఎముకలలో నేమియు వ్యాధి కనబడకపోయినను వారలకండలును, సంధులవద్దనుండు త్రాళ్లును మిక్కిలి వదులుగనుండి చక్కగ పట్టుపట్టకపోవుటచేత సరిగా నిలువబడలేరు. నడవలేరు.

సాధారణముగా ఈ మార్పులేవియును ఆరుమాసములకు పూర్వము కనిపట్టవు. ఏడాదిలోపల బిడ్డలను జాగ్రత్తగ పరీక్షించినయెడల పైమార్పులు గ్రహింపదగియున్నను తల్లులు 18 నెలలవరకు వీనిని గుర్తించక వీనినిగూర్చి శ్రద్ధచేయరు. మాయింట బిడ్డలు త్వరగానడవక పోవుట అలవాటేయనియు, వారిబిడ్డ ఆలస్యముగానే నడచినది. వీరిబిడ్డకూడా మూడేళ్లదాకా నడవనేలేదు, ఏమి నష్టమయిన దనియు చెప్పుకొనుచు అశ్రద్ధచేసెదరు. ఈవ్యాధిని ఎంతత్వరగా గుర్తించిన చికిత్సకంత మంచిది. ఈబిడ్డలకు ఆలస్యముగ పండ్లువచ్చును. ముచ్చెలగుంట ఆలస్యముగ మూయును, బిడ్డ సహాయము లేనిదే కూర్చుండుటకును ఆలస్యమగును. నడచుటకు ఆలస్యమగును. ఈలక్షణములన్నియు బిడ్డ చక్కగ పెరుగకపోవుటచే గలుగుచున్నవని గమనించి తల్లులు వెంటనే వైద్యుని సలహా తీసికొనవలెను.

చికిత్స:—ఆహారము సరియైనదిగా లేనందుననే ఈ వ్యాధి వచ్చుచున్నదని వైద్యుల యభిప్రాయము. ఆరోరూటు పిండి బియ్యపుపిండి మొదలగు ఆహారములను హెచ్చుగ పండ్లు రాకముందే అనగాబిడ్డకువీనిని జీర్ణముచేసికొనుశక్తిలేక ముందే ఇచ్చుటచే నీవ్యాధి కలుగును. బిడ్డల ఆహారములో తగినంత

కొవ్వుపదార్థము లేకపోవుటచేత ముఖ్యముగ నీవ్యాధికలుగుచున్నది. మాంసకృత్తు పదార్థములు జీర్ణమైనంతవరకు బిడ్డలకు ఇయ్యవలెను. క్రొవ్వునకును, ఎముకలు మెత్తపడుటకు గల సంబంధమేమో ఇంతవరకు తెలియదుగాని క్రొవ్వు తగ్గించిన యెడల చంటిబిడ్డలకుగాని ఇతర జంతువులకుగాని యెముకలు మెత్తబడునని నిశ్చయముగ తెలిసియున్నది.

కాబట్టి బిడ్డకు పిండిపదార్థములను తగ్గించి, ఇచ్చుటయు పాలు హెచ్చించుటయు మొదటి చికిత్స. కాడ్లివరాయిలుగాని, కోడిగుడ్డులోని చొనగాని పాలతో జేర్చి ఇయ్యవచ్చును. అప్పుడు చిలికియెత్తిన క్రొత్తవెన్న దినమునకు గచ్చకాయంత ఇచ్చి చూచుట యుక్తము. కాని జీర్ణమగుచున్నదా లేదాయనునది చూచుకొననిదేయే కొవ్వు హెచ్చించ కూడదు. పచ్చి మాంసమును మెత్తగగొట్టి పచ్చిగా రసముపిండి జీర్ణశక్తిని బట్టి కొంచెము కొంచెముగ నిచ్చిన కొందఱ బిడ్డలకు గుణమగును.

ఆహారమును సరిచేయుటతప్ప మందులవలన ఈవ్యాధి కంతగా ప్రయోజనములేదు. చక్కని గాలియు, చక్కని ఎండ వెలుతురును బిడ్డకుమిక్కిలిసహకారులగును. కాబట్టిబిడ్డనువిశాలమైన గదిలోనుంచి తలుపులు సాధారణముగా తెరచియుంచవలెను.

వంగినయెముకలకు సాధారణముగా చికిత్స అక్కరలేకయే వయస్సువచ్చిన కొలది సరియగును. అవసరమైనచో శస్త్ర చికిత్స యుపయోగకరము.

పదునారవ ప్రకరణము

స్కర్వీ

ఇది ఆహారసంబంధమైన వ్యాధులలో నొకటి. నెలల వెంబడి నూతనమైన ఆహారము ఏమియు లేక డబ్బాలు మొదలగు వానియందు నిలువయుంచిన ఆహారమును తిన్నయెడల పెద్దవాండ్రకుకూడ ఈ వ్యాధివచ్చును. పూర్వము ఓడలలో నెలలవెంబడి ప్రయాణముచేయుచు మధ్యమధ్య రేవుపట్టణము నెన్నడునుచేరక ప్రాతబడిన ఆహారములనే తినెడివారలకు ఈ వ్యాధి యధికముగ వచ్చుచుండెడిది. యుద్ధములలో నెలల వెంబడి ముట్టడివేయబడిన వారలకు ఈవ్యాధి వచ్చుచుండును. సరియైనఆహారము ఇయ్యనియెడల జైలులలోకూడ ఈవ్యాధి ఖయిదీలకు వచ్చును. ఇట్టివారలకు తోటకూర, గోంగూర మొదలగు నూతనమైన శాకపదార్థము లిచ్చుటచే వ్యాధి నివారణమగును.

లక్షణములు

1. తాకినప్పుడెల్లను బిడ్డకావుమని యేడ్చుట.

2. అకస్మాత్తుగ కాళ్లు చేతులయందు వాపును ఎరుపును కనబడుట. అవయవములలో నొకటినిగాని కొన్నిటినిగా బిడ్డ ఉపయోగింప లేక పోవుట.

3. పండ్లకుదుళ్లలో సులభముగ నెత్తురుగ్రమ్మి చిగుళ్లు ఒకవిధమైన ఊదావర్ణముకలిగి యుండుట.

4. శరీరముమీద కొంచెముదెబ్బ తగిలినను చర్మము క్రింద నెత్తురుచిమ్మి నల్లగ కములుచుండుట.

5. మూత్రముతో కూడ నెత్తురువచ్చుట.

తమ బిడ్డలకుతగిన ఆహారము తెచ్చి పెట్టుకొనలేని బీద వారలబిడ్డలకేగాక భాగ్యవంతుల బిడ్డలకుకూడ నీవ్యాధి కన్పట్టుచున్నది. పేటెంటుఆహారములు అనగా బుడ్లలో నిలవ యుండి వచ్చుపాలపొడములు డబ్బిపాలు మొదలగు వానివలన వారలకిది కలుగు చున్నది. ఈబిడ్డలు చూపులకు చక్కగ పెరుగుచున్నట్లే యుందురు.

చికిత్స:—నూతనమైన ఆహారములలో నేదోయొకశక్తి యున్నది. అట్టిఆహారము లేనివారలకే ఈవ్యాధికలుగుచున్నది. కాబట్టి ఇట్టివ్యాధిగల బిడ్డలకు అంతకుపూర్వమిచ్చు ఆహారమును తక్షణమునిలిపి ఆవుపాలు ఇచ్చుట మంచిది. తియ్యని నారింజపండుగాని కమలాఫలముగాని పచ్చిద్రాక్షపండ్లుగాని నిమ్మపండ్లుగాని పిండి ఆరసములో అవసరమైనయెడల ఒక చిటిక చక్కెరవేసి ఇచ్చినయెడల ఈబిడ్డలు బహు శీఘ్రముగ ఆరోగ్యవంతు లగుదురు.

పదునేడవ ప్రకరణము

ఈడ్పు

చంటిబిడ్డగుణము, బాలపాప చిహ్నములు

తల్లికి మిక్కిలి భయంకరమైనట్టియు, వైద్యుడు తరుచు చూచునట్టియు వ్యాధులలో ఈడ్పు మిక్కిలి ముఖ్యమైనది. దీనికి మనదేశములో చంటిబిడ్డగుణమనియు బాలపాపచిహ్నములనియు పేళ్ళుగలవు. బిడ్డలలో మాత్రమే ఈవ్యాధి తరుచుగ వచ్చుటచే నాపేళ్లు వచ్చి యుండవచ్చును.

బిడ్డలకువచ్చు ఈడ్పులలో రెండు విధములు గలవు

1. సహజముగ అనగా మరియే వ్యాధియు లేకుండగనే ఈడ్పుమాత్రము వచ్చుట. బిడ్డలకు వయస్సుహెచ్చిన తరువాత కూడ నీ యీడ్పు విడువక అపస్మారము (కాకచెమ్మలు) గా పరిణమించవచ్చును. పెద్దవయస్సున అపస్మారము వచ్చువారలలో నూటికి రమారమి 20 మందికి చిన్నతనములో చంటిబిడ్డగుణము కనబడును.

2. ఇతరవ్యాధులలో ఈడ్పు ఒక లక్షణముగా రావచ్చును. ఎట్లన,

1. చలిజ్వరము, న్యూమోనియా మొదలగు తీవ్రజ్వరములు వచ్చుటకు పూర్వము పెద్దవారలకు చలి కుదుపు

వచ్చును. దీనికి బదులు బిడ్డలకు ఈడ్పువచ్చును.

2. పండ్లువచ్చుట.

3. అజీర్ణము.

4. కడుపులో పాములు.

5. మెదడుయొక్క పైపొరయందలి ప్రకోపము.

6. రికెట్సు అను జీర్ణసంబంధమైన వ్యాధి.

7. మలబద్ధము.

8. కక్కువాయి మొదలగు వ్యాధులలో ఊపిరి ఆడకపోవుటచే ఒకానొకప్పుడు ఈడ్పురావచ్చును.

ఈడ్పువచ్చినప్పుడెల్లను సామాన్యముగా బిడ్డకుస్పృహ గూడ తప్పియుండును. ఇందుచే ఈడ్పులో సర్వత్రమెదడుకూడా వ్యాధిపీడితమైనదని తెలిసికొనవచ్చును.

చికిత్స

బిడ్డకు ఈడ్పువచ్చినవెంటనే వైద్యుడు దగ్గఱలేనియెడల దాదిగాని తల్లిగాని చెయ్యవలసిన పని.

1. బిడ్డముఖము మాత్రము పైనుండునట్లు గోరువెచ్చని నీళ్ళతొట్టిలో బిడ్డను ముంచవలెను. ఇంతట సామాన్యముగా ఈడ్పు నిలచిపోవును.

2. బిడ్డపండ్లమధ్య పడి నాలుక తెగిపోకుండ రెండు దవడలమధ్య గుడ్డచుట్టగాని కర్రముక్కగాని పెట్టవలెను.

3. మెడకును యెదురొమ్మునకును చుట్టుబిగిసియున్న బొందులు గుండీలు మున్నగువానిని వదులుచేసి చక్కనిగాలి వచ్చినట్లు గదితలుపులను తెఱచివేయవలెను, తిరిగి బిడ్డకు ఈడ్పువచ్చునేమో యను సందేహముతో వేడినీళ్లు సిద్ధముగా పెట్టుకొనవలెను.

4. వైద్యునకు శీఘ్రమైనంత త్వరలో చెప్పిపంపించ వలెను. అట్లు చెప్పిపంపించునప్పుడు యేదోయొక మోస్తరు కబురుచేయక బిడ్డకు ఈడ్పువచ్చినదని స్పష్టముగా తెలియ జేయవలెను. అప్పుడతడు తగిన పరికరములతో వచ్చుటకు వీలగును.

5. జ్వరము హెచ్చుగ అనగా 103 డిగ్రీలకు పయిన యున్న యెడల నెత్తిమీద మంచుగెడ్డనీళ్ళలో ముంచిన మెత్తని గుడ్డను పెట్టవచ్చును. లేక ఊడికొలోను మొదలగు చల్లని ద్రవములను తల కుపయోగించవచ్చును.

6. ఈడ్పు మిక్కిలి హెచ్చుగ నున్న యెడల క్లోరొఫార మును గుడ్డమీద వేసి వాసన చూపించవలెను. ఇది ముఖము మీదపడినయెడల పుండుపడును.

9. మలబంధము నివర్తించుటకుగాను తైలవస్తి లేక గోరువెచ్చని సబ్బునీళ్ళతో వస్తి చేయవలెను.

10. పొటాసియమ్ బ్రోమైడ్, క్లోరల్‌హైడ్రస్, అను మందులు ఈడ్పులందు మిక్కిలి యుపయోగకరములు. అర

గ్రేసుమొదలు రెండు గ్రేసులువరకు ఘంటకొకసారి నీళ్ళలో కలిపి ఇయ్యవలెను. నిద్రబోవుబిడ్డకు యెన్నడును వీని నివ్వ గూడదు. ఈమందులు రెండును మైకమును కలుగజేసి ఈడ్పును రాకుండ జేయును. ఈమందులను మింగించుటకు సాధ్యముకాని యెడల మూడుమొదలు అయిదుగ్రేసులవరకు వీనిలో దేనినైనను ఆసనమార్గమున కొంచము నీళ్ళతోజేర్చి వస్తిని జేయ వలెను. సామాన్యముగా నల్లమందును ఉపయోగించకూడదు. కాని ఈడ్పులు ఏవిధమున నిలవక వెంటవెంటనేవచ్చి మిక్కిలి బాధించుచున్న యెడల, మార్ఫియాను ఆరునెలల బిడ్డకు ఒక గ్రేసులో యాభైయవంతుచొప్పున ఒకానొకప్పుడు ఇవ్వవలసి వచ్చును.

పదునెనిమిదవ ప్రకరణము.

పురుటింటిలో బిడ్డలకువచ్చువ్యాధులు.

1. చచ్చినట్లు పుట్టుట:— సాధారణముగా బిడ్డలుపుట్టగానే కావుకావుమని ఏడ్చుదురు. ఇట్లేడ్చునప్పుడు ఊపిరితిత్తులు చక్కగ తెరచుకొని గాలి ఊపిరితిత్తుల లోనికిపోవును. పిమ్మట సహజముగ గాలి వెలుపలకు లోపలకు పోవుచు ఊపిరి క్రమముగా ఆడుచుండును. కాని బిడ్డనీరసముగ పుట్టుటచేతగాని, బిడ్డపుట్టుటకు మిక్కిలి ఆలస్యమగుటచేత గాని, బిడ్డయొక్క బొడ్డుత్రాడు మణిగి పోవుటచేతను, బిడ్డపుట్టుమార్గములో నేదైనను ఒత్తుడు కలుగుటచేతను బొడ్డుత్రాడు మూసుకొనిపోయి రక్తప్రసారము తగ్గియుండుటచేతగాని, బిడ్డ పాండువర్ణముగనో లేక నీలముగనో పుట్టును. ఒకానొకప్పుడు బిడ్డ తల బయిటకు రాకమునుపే ఊపిరిపీల్చుటకు ప్రయత్నించినయెడల తెమడ మొదలగు పదార్థములు ఊపిరితిత్తులకు పోవుమార్గముల కడ్డపడి ఊపిరిసరిగా ఆడక పోవచ్చును. ఇట్టిబిడ్డ పుట్టినవెంటనే ఏడువక చచ్చినట్లుగానే ఉండును. కాని సామాన్యముగా నిజముగ చచ్చియుండక తగిన చికిత్స చేసినయెడల ఊపిరి పీల్చుటకు ప్రారంభించును. తగిన చికిత్స లేనియెడల అట్లే చచ్చిపోవును.

పాండువర్ణముగ పుట్టినబిడ్డకుండులక్షణములు:—నోరు తెరుచుకొనియుండును. నాలుక పెదవులు తెల్లగా నుండును. శరీరము చల్లగ నుండును. కండ్లు మూసికొని యుండును. కాళ్ళు చేతులు పట్టుతప్పి వ్రేలాడుచుండును. ఆసనము తెరచుకొని యుండును. గుండెలు బహు బలహీనముగ కొట్టుకొనుచుండును.

నీలముగ పుట్టినబిడ్డకుండు లక్షణములు:— పెదవులు కందినట్లుండి వాచియుండును. కండ్లు ఎఱ్ఱగనుండి తెరచుకొని మిడిగ్రుడ్లదియుండును. నాలుకయు నోటిలోపలి భాగమును యెఱ్ఱగ కందియుండును. శరీరము వెచ్చగనుండును. కాళ్ళు చేతులు కొంచెము బిగబట్టినట్లుండును. బొడ్డుత్రాడు కొంచెముబ్బియుండును. పాండువర్ణముగ పుట్టిన పిల్లల నాడికంటె నాడి స్ఫుటముగ నుండును. పాండువర్ణముగ పుట్టినపిల్లలకంటె నీలముగ పుట్టినపిల్లల చికిత్స సులభము.

చికిత్స:—ఊపిరి చక్కగ ఆడునట్లు చేయవలెను. ఇందుకొరకై గొంతుకలోను ముక్కులలోను ఏదైనను కఫము మొదలగునవిచేరి అడచుకొని యున్నయెడల అట్టి పదార్థములను నోటిలో వేలుపెట్టి తీసివేయవలెను. బిడ్డనుతలక్రిందుగా కాళ్ళతో పట్టుకొని పిర్రలమీద రెండు గట్టిదెబ్బలీయవలెను. ఇట్లు చేయుటచే బిడ్డ గ్రుక్కపట్టి ఏడ్చుటకు ప్రయత్నించును. అప్పుడు ఊపిరితిత్తులలోనికి గాలిపోయి చేరును. ఒక్కసారి ఏడ్చుటకు ప్రారంభించినయెడల ఊపిరి తనంతటతానే చక్కగ

ఆడును. బిడ్డను ఒకసారి వేడినీళ్లలోను నొకసారి చన్నీళ్ళలోను వెంటవెంటనే ముంచినయెడలకూడ మంచిది. వేడిగాని చలిగాని తగిలినతోడనే బిడ్డయేడ్చుటకు ప్రారంభింపవచ్చును. నీలముగ పుట్టిన పిల్లలకు బొడ్డు కోసినచోట కట్టినత్రాటిని వదులుచేసి కొంచెము నెత్తురును బయటకుపోనిచ్చుట మంచిది. పాండువర్ణముతో పుట్టినపిల్లలకు బొడ్డుత్రాటిగుండ వీలయినంతవరకు మరికొంచెము నెత్తురును తల్లినుండి ఎక్కించుట మంచిది. బొడ్డుత్రాటిని రెండువేళ్ళ మధ్యనిమిడ్చి నొక్కుచు క్రమముగ ఈవేళ్ళను బిడ్డవైపునకు నొక్కుకొనుచుపోయిన యెడల కొంచెము హెచ్చుగ నెత్తురు బిడ్డకీమార్గమున చేరవచ్చును. ఇట్లుచేసినను ఊపిరి రానియెడల ఊపిరి తిత్తులలోనికి సన్ననిరబ్బరు గొట్టమునుచొరచి ఊదిచూడవలెను. నాలుక నిమిషమునకు 20 సార్లు ముందుకీడ్చుచు వెనుకకు విడచుచుండవలెను. లేదా చికిత్సకుని రెండు అరచేతులను తనముందర తెరచిపెట్టుకొని, ఆయరచేతులమీద బిడ్డవీపు ఆనుకొనునట్లు వెల్లకిల పరుండబెట్టి, చేతులతో ఎదురొమ్మును రెండుప్రక్కల నుండి మెల్లగ మధ్యవైపుకు నొక్కుచు, పిర్రలును తలయు దగ్గరకు చేర్చునట్లు ప్రయత్నించుచు ఎదురొమ్మును సంకుచింప చేయవలెను. ఇప్పుడు ఊపిరి తిత్తులలోని గాలి బయటకు పోవును. పిమ్మట చేతులపట్టు విడిచి పెట్టవలెను. ఇప్పుడు ఎదురొమ్ము కొంచెము వికశించి గాలిలోపలకు చేరును. ఇట్లు

విసుగుజెందక గుండెలలో ఎంతమాత్రమైనను చలనమున్నదని మనకు ఆశయున్నంతవరకు నిమిషమునకు 20 సార్లు చొప్పున చేయవలెను. చచ్చిపుట్టినారన్న బిడ్డలిట్టి చికిత్సలచే కొన్ని గంటలయిన తరువాతకూడ ప్రాణమునుబొందిన నిదర్శనములు గలవు. ఇదంతయు ముగియువరకు బిడ్డ చల్లబడిపోకుండ వేడి నీళ్ళలోబెట్టిగాని, వెచ్చనిబట్టలతో కప్పిగాని యుండవలెను. మిక్కిలి బలహీనమగు బిడ్డను చక్కగ ఊపిరివిడచిన తరువాతకూడ కొన్ని గంటలవరకు జాగ్రత్తగా చూచుకొనుచుండవలెను.

2. ఊపిరి సరిగా ఆడకపోవుట:— కొందరు బిడ్డలకు పుట్టినతరువాత కొన్ని దినములవరకును అప్పుడప్పుడు శరీరమంతయు నీలముగ నగుచుండును. వీరి శరీరము ఒకప్పుడు కందినట్లును అనగా నీలముగలసిన యెరుపురంగు గలిగినట్లును, మరియొకప్పుడు సాధారణముగాను ఉండును. ఇట్టిబిడ్డలు బహు హీనస్వరముతో ఏడ్చెదరు. వారల ఊపిరితిత్తులుచక్కగ తెరచుచుండవు. ఒకానొకప్పుడు వూపిరి తిత్తులలో నేదోయొకటి బొత్తిగముడుచుకొని పోయియున్నను యుండవచ్చును. ఇట్టి బిడ్డలను చక్కని వేడినీళ్లలో స్నానము చేయించవలెను. పిర్ర మీద ఒక్క గట్టిదెబ్బవేసి అప్పుడప్పుడు ఏడుపించవలెను. వెచ్చవెచ్చగ దూదిలోగాని, వేడినీళ్ళచే నాలుగుప్రక్కల ఆవరింపబడి రెండుప్రక్కల తెరచియున్న పెట్టెలోగాని పరుండ

పెట్టి బిడ్డయొక్క శరీరవేడిమిని కాపాడవలెను. కాని చక్కని గాలి బిడ్డముఖముపై వీచుచుండవలెను. ఇట్టిబిడ్డలు అకస్మాత్తుగ మృతినొందవచ్చును. కాబట్టి మిక్కిలి జాగ్రత్తగ చూచుకొనుచుండవలెను. బిడ్డ బలహీనముగ ఏడ్చునప్పుడెల్లను ఊపిరితిత్తులు సరిగా ఆడడములేదని సందేహింపవలెను.

3. ధనుర్వాయువు:—పురిటింటనే ఏదోయొక ఈడ్పు వచ్చి బిడ్డ కొయ్యబారి చచ్చిపోవు బిడ్డలెందరో ఈదేశమునందు గలరు. ఇట్టిబిడ్డలందరు మన అశ్రద్ధచే అకారణముగ చచ్చిపోవుచున్నారని అనేకులకు తెలియదు. మనము కొంచెముజాగ్రత్తగ నున్నయెడల ఈచావులలో నూటికి 99 న్నర తగ్గిపోగలవు. ఈ చావులన్నియు బొడ్డును అపరిశుభ్రముగా నుంచుటచే కలుగుచున్నవి. ధనుర్వాయువును కలిగించు సూక్ష్మజీవులు మట్టిలోను పశువుల పెంటలోను అధికముగ నుండును. బొడ్డునుకోయు కత్తిమీద మయిలయున్నను, నెత్తురునిలుచుటకై బొడ్డుమీద అద్దుటకుపయోగించు బూడిద మొదలగు పదార్థములలో మయిలయున్నను ఆ మయిలగుండ ధనుర్వాయు సూక్ష్మజీవులు ప్రవేశింపవచ్చును. బొడ్డుపైన వేసి కట్టుటకు బోరికుపొడరును వేడినీళ్ళలోను ఉతికి ఎండ వేసినట్టియు, స్వచ్ఛమైనట్టియు మెత్తనిగుడ్డయుతప్ప వేరేమియు నక్కరలేదు. కొందరు వెలిబూడిదెను ఉపయోగింతురు. చక్కగకాల్చి అప్పుడు తయారుచేసిన వెలిబూడిదలో ఏవిధ

మైన సూక్ష్మజీవులును ఉండజాలవుకాని పెంటమీదనుండి తెచ్చిన వెలిబూడిదెతోను మురికి గుడ్డలతోను కట్టిపెట్టిన యెడల బిడ్డప్రాణములు తీయుటకు చాలును. ఒక్క ధనుర్వాయు సూక్ష్మజీవి ఈ బూడిదగుండ శరీరములో ప్రవేశించినయెడల తప్పక ప్రాణముతీయును.

లక్షణములు:—నాలుగు దినములవరకు చక్కగనున్న బిడ్డ 5 లేక 6-వ దినమున అకస్మాత్తుగ పాలుత్రాగునప్పుడు నోరు బిగబట్టును. పిమ్మట కాళ్ళుచేతులు కొయ్యబారును. రెండు మూడుసార్లు ఈడ్పులువచ్చి బిడ్డమృతినొందును. పురిటింటిలోనిట్టి ఈడ్పువచ్చిన బిడ్డలలో నూటికి 95 కంటె హెచ్చుగ మృతినొందుదురు. ఇట్టి బిడ్డలను బహుశః మనవారలు ఎన్నెమ్మకొట్టి చంపినదందురు.

చికిత్స:—ధనుర్వాయు టీకారసము వెంటనే నెత్తురులోని కెక్కించుటయు క్లోరలు హైడ్రసు పొటాసియము బ్రోమయిడు వీనిని 5 గ్రెయినులు ఆసనమార్గమున నీళ్లతో గంటకొకసారి ఇచ్చుటయు తప్ప వేరే చికిత్సలేదు.

ఈ క్రూరవ్యాధిని రాకుండ బొడ్డును మొట్టమొదటనే పరిశుభ్రముగ నుంచుకొనవలెను.

4. బొడ్డుచీముపట్టుట:— పురిటింటిలో బిడ్డలకువచ్చు వ్యాధులలో మిక్కిలి తరుచుగ వచ్చునదిదియే. అశ్రద్ధచేసినయెడల నీచీము బిడ్డనుకృశింపజేసి ఒక్కొకచో చంపివేయును.

స్వల్పముగనున్న వ్యాధియందు బొడ్డుచుట్టుకొంచెము వాపును, కొంచెము ఎరుపును, కొంచెము చీముకారు పుండును ఉండును. కాని అదృష్టహీనులకు ఈ చీముబొడ్డుగుండ నెత్తురుకాలువల లోనికి వ్యాపించి అక్కడనుండి ఆవిషము శరీరమంతయును వ్యాపకమగును. నెలలు నిండకమునుపే పుట్టినట్టియు బలహీనమైనట్టియు బిడ్డనిదితరుచుగ పీడించును. జ్వరము, కామెరలు (కండ్లు పసుపు పచ్చగనుండుట,) నెత్తురు ఆసనగుండపోవుట, నెత్తురు కక్కుకొనుట, చర్మముక్రింద నెత్తురుచిమ్ముట, అతిసార విరేచనములు మొదలగు లక్షణములుండ వచ్చును. జ్వరములేని యెడల తక్కిన లక్షణములన్నియు మనము గుర్తించక పోవచ్చును. సరిగాగుర్తించి చికిత్స చేయనియెడల బిడ్డ వారము లోపలనే మృతినొందును.

చికిత్స:—పుండును చక్కగ బయలుపరచి పరిశుభ్రముచేసి బోరికు ఆసిడు, త్రిఫలాచూర్ణము మొదలగునవి కలిసిన తైలమును దేనినైనను వేయవలెను. కాగిచల్లారిన నూనెగాని ఆముదమునుగాని వేసినచాలును.

5. కామెరలు:—సామాన్యముగా పుట్టిన తరువాత మూడవదినమున ప్రారంభించి వారము పదిదినములవరకు బిడ్డకండ్లుకొంచెము పసుపు పచ్చగ నుండవచ్చును. కొందరి కండ్లు మిక్కిలి పచ్చగ నుండవచ్చును. ఇట్టి పసుపుపచ్చనిరంగు కొద్దిగనో గొప్పగనో నూటికి 60 మంది బిడ్డలకు ఉండును.

బిడ్డపుట్టినప్పుడు బిడ్డరక్తములో ఎర్రకణములు హెచ్చుగనుండును. మొదటిరెండు వారములలో ఈ యెర్రకణములు కొన్ని నశించి పోవును. ఈమార్పు సహజముగా అందరి బిడ్డలరక్తమునందును కలుగును. ఈమార్పుచే రక్తము కొంతవరకు చిక్కబడును. యకృత్తు (Liver) నందలిసూక్ష్మ మార్గములు కొంతవరకు అడచుకొనిపోవును. అందుపిత్తరసము తమతమ కాలువల (Bile ducts) గుండ క్రమముగ పోకతిరిగి రక్తము లోనికి జేరును. అందుచేత బిడ్డల రక్తమునందును తద్వారా కండ్లయందును పసుపు పచ్చనిరంగు ఏర్పడును. సామాన్యముగా చికిత్సఅక్కరలేకయే ఇదిపోవును. కొంచెము ధారాళముగ విరేచనమగునట్లు చూచుకొనుట యుక్తము. ఇట్టి సామాన్యమైన పసిమిరిగాక బొడ్డునందు చీముపట్టుటచే గాని ఇతరకారణములచేగాని కండ్లు పచ్చపడినయెడల చక్కగశోధించి కారణమును కనిపట్టి దానికి తగిన చికిత్స చేయవలెను.

6. చన్నులు వాచుట:—ఇది మగబిడ్డలకును ఆడబిడ్డలకు కూడవచ్చును. సామాన్యముగా బిడ్డపుట్టినప్పుడు వారల చన్నులలో కొంచెము పాలవంటి ద్రవముండును. మంత్రసానులు దీనిని పిండివేయనియెడల ఏబాధయునుండదు. కాని మురికి చేతులతో చండ్లను నలిపి పుండుచేయుటచే వానియందు చీముపుట్టి బాధకలిగించును. పుట్టిన రెండుమూడు దినములలో బిడ్డచన్నులు కొంచెము వాచినట్లు కనుపించినయెడల దూది

గాని మెత్తనిగుడ్డగాని వానిపైనుంచి గట్టిగ కట్టివేయవలెను. దినమునకు మూడు లేక నాలుగు సార్లు చక్కగ వేడినీళ్ళతో ఒత్తవలెను. క్రమముగ రెండు వారములు గడచువరకు తగ్గిపోవును. చీముపట్టినయెడల శస్త్రచికిత్స చేయవలెను.

7. కండ్లకలక:—పురిటింటిలో బిడ్డలకు కండ్లకలక వచ్చినయెడల ఇది మిక్కిలి తీవ్రమైనదని ఎరుగవలెను. దీనికి సామాన్యముగా తల్లికుండు పచ్చసెగవ్యాధియే కారణము. బిడ్డయొక్క తలబయటకు వెడలకముందే మార్గమునందు పచ్చసెగచీము తల్లినుండి బిడ్డకంటిలో చేరవచ్చును. ఇట్లు చేరినప్పుడు బిడ్డకు కండ్లకలక బహుతీవ్రముగవచ్చి అనేకులకు కండ్లుపోవుట గలదు. ప్రపంచమునందలి గ్రుడ్డివారలలో నూటికి 33-గురకు ఈప్రకారమే గ్రుడ్డితనము వచ్చియున్నట్లు లెక్కలు గలవు. ఈవ్యాధి రాకుండ జేయవలెననిన మిక్కిలి సులభమైన మార్గముకలదు. బిడ్డయొక్క ముఖము తల్లికడుపులోనుండి బయిటకు వచ్చిరాకముందే చక్కగ కాచిన వెచ్చవెచ్చని నీళ్ళతోగాని బోరికుమందునీళ్ళతోగాని కండ్లను చక్కగ కడిగి మెత్తని దూదితోగాని గుడ్డతోగాని తుడవవలెను. తల్లికి పచ్చసెగఉన్నదని అనుమాన మున్నయెడల సిల్వరు నైట్రేటు (Silver nitrate) ఒక అవున్సు వాననీటికి (Distilled) 10-గ్రెయిన్నుల చొప్పున వేసిన ద్రావకమును ఒకటి రెండుచుక్కలు రెండుకండ్లలోను వేయవలెను. ఇట్లుచేసినయెడల నీతీవ్రవ్యాధి

రాదు. ఒకవేళవ్యాధి వచ్చినయెడల తగిన వైద్యుడు చికిత్స చేయవలెను. లేదా పై చెప్పినద్రావకమును అనుదినము ఉపయోగింపవలెను. ఒక్కకంటికే వ్యాధివచ్చినయెడల ఆ కంటి పుసి రెండవకంటికి అంటకుండ చేయవలెను.

8. పైనవివరించినవిగాక బిడ్డపుట్టుకలోనే యొకానొకప్పుడు అనేకవిధములగు వికారరూపములుండవచ్చును. తల మిక్కిలి పెద్దదిగనుండి అందు నీరు చేరియుండ వచ్చును. తల మిక్కిలి చిన్నదిగనుండి మెదడు మిక్కిలి చిన్నదిగ నుండవచ్చును. బిడ్డ పుట్టుటకు మిక్కిలి ఆలస్యమైనయెడల నడినెత్తిమీద నొకకంతివలె వాచి యుండవచ్చును. ఈవాపులో నొకానొకప్పుడు నెత్తురుచేరి పేరుకొనియుండవచ్చును. సామాన్యముగా దీనికేమియు చికిత్సలేకనే ఈవాపు కరిగిపోవును. దెబ్బతగులకుండను, పుండు పడకుండను మెత్తని పరిశుభ్రమైన దూదితో కప్పియుంచవలెను. లేనియెడల చీము పట్టవచ్చును. ఇదిగాక కొందరు బిడ్డలకు కాళ్లుచేతులలో వ్రేళ్ళు అధికముగనుండును. లేక తక్కువగనుండును. పెదవులలో మొర్రియుండును. వీనికి వెంటనే చికిత్స అవసరములేదు. కాని కొందరు బిడ్డలకు మూత్రము వచ్చుమార్గముగాని మలమువచ్చు మార్గముగాని మూసుకొనిపోయియుండును. వీనికి తగినవైద్యుడు వెంటనే చికిత్స చేయవలెను. మూత్రమువచ్చు మార్గమున నొకానొకప్పుడు కొద్దిపాటి మురికి ఏదైనను అడుచుకొని యుండును.

శలాకు వేసినచో మూత్రమార్గము వెంటనే బయలుపడును. ఆసనమార్గమును బయలుచేయుట కొకానొకప్పుడు కొంచెము శ్రమ కలుగవచ్చును. శస్త్రచికిత్స అవసరమగును. కొందరు బిడ్డలకు స్త్రీపురుష సంబంధమైన అవయవములు పూర్తిగ నేర్పడక స్త్రీయైనదియు, పురుషుడైనదియు తెలిసికొనుట కష్టముగ నుండవచ్చును. కొందరు బిడ్డలకు పుట్టునప్పుడు మార్గమననే కాళ్ళుచేతులు నలిగిపోయి ఎముకలు వంగిపోయి యుండవచ్చును. బిడ్డను బయిటకు తీయుటకై ఆయుధము లుపయోగించిన యెడల నొకానొకప్పుడు దెబ్బలు తగిలియుండవచ్చును. వీనికి వెంటనే తగిన చికిత్స చేసినయెడల శీఘ్రముగ గుణమగును.

పందొమ్మిదవ ప్రకరణము

స్వస్థవృత్తము

స్వస్థవృత్తమనగా శరీరమునకు వ్యాధిరాకుండ కాపాడుకొనుట. వ్యాధివచ్చిన పిమ్మట చికిత్సచేసి కుదుర్చుకొనుటకంటె వ్యాధిరాకుండ కాపాడుకొనుట యుత్తమమని అందఱకి తెలిసిన విషయమే. ప్రతి మానవునియొక్కయు ఆరోగ్యరక్షణమునకై హితాహార విహారములు ముఖ్యములు. బిడ్డలయొక్క ఆహారమువిషయమై వెనుక ప్రకరణములో వివరముగ చెప్పియుంటిమి. ఇక విహారములనగా కాలోచిత ధర్మములను సరిగా జరుపుకొనుటయే. తగిన వ్యాయామము, నిద్ర, గాలి, స్నానము, వేషము, శీతాతపములు మొదలగువాని విషయములో ఆయాఋతువుల ననుసరించి చక్కగ సంచరించుట స్వస్థవృత్తమునకు ముఖ్యము. ఇందొక్కొక్క దానివిషయమై చంటిబిడ్డలకు ఉపయుక్తములయి నంతవరకు ఈప్రకరణమున జెప్పెదము.

వ్యాయామము

"శరీరాయాస జననం కర్మవ్యాయామ ఉచ్యతే" అనగా శరీరమునకు శ్రమనుగలుగ జేయునట్టి ఏకార్యమునకైనను వ్యాయామము అని చెప్పవచ్చును. చంటిబిడ్డలకుకూడ

వ్యాయామము కావలసియున్నదని అనేకమంది తల్లులకు తెలియక పోవచ్చును. బిడ్డలు ఏడ్చుటయు, నవ్వుటయు, కాళ్ళు చేతులు ఇటునటు లాడించుటయు, ఆటయనుమిషచే అఱచుటయు, ఇదియంతయు, చంటిబిడ్డకు వ్యాయామమే. కొంతమందితల్లులు ఈవిషయమును గ్రహించలేక యేడ్చినప్పుడెల్లను బిడ్డను చంకబెట్టుకొని ఊరడించ ప్రయత్నింతురు. చంటిబిడ్డ యేడ్చుటకు కారణములన్నియు 55-వ పుటలో చెప్పియున్నాము. దానినిబట్టి బుద్ధిమంతురాలయిన తల్లి గ్రహించుకొని తగినంత వ్యాయామము అనుదినము బిడ్డకు గలుగునట్లు చూచుకొనవలెను.

వ్యాయామముచే గలుగు లాభములనుగూర్చి, అష్టాంగహృదయమున ఇప్పటికి రమారమి వేయి సంవత్సరములకు క్రిందనే వాగ్భటుడను వైద్యుడీ ప్రకారము చెప్పియున్నాడు.

“శ్లో॥ లాఘవం కర్మ సామర్థ్యం దప్తోగ్ని ర్మేదసః క్షయః । విభక్తఘనగాత్రత్వం వ్యాయామా దుపజాయతే॥” అనగా శరీరము తేలికగానుండుట, పనులు చేయుటయందు చక్కని శక్తికలిగియుండుట, చరచర ఆకలి గలిగియుండుట, శరీరమునందలి చెడ్డకొవ్వు తగ్గుట, కండలు చక్కగ నేర్పడి సుందరమైన శరీరమేర్పడుట యీ అయిదును వ్యాయామము వలనగలుగు గుణములని పైనజెప్పబడి యున్నది. కాబట్టి,

బిడ్డలను అనవసరముగా తల్లులుగాని దాదులుగాని, ఎత్తుకొనక సాధ్యమయినంతవరకు వారినిస్వేచ్ఛగ ఆడుకొనునట్లు విడువవలెను. లేనియెడల బిడ్డలుచక్కగా రుగరు.

నిద్ర:—బిడ్డలు పుట్టినదిమొదలు కొన్నాళ్ళవరకు ఆకలి అయినప్పుడు ఏడ్చి, పాలు ఇచ్చినవెంటనే నిద్రపోయి, తిరిగి ఆకలి అగువరకు లేవనే లేవరు. అనగా పాలుత్రాగుటకొరకై మేలుకొనుటతప్ప ఆరోగ్యవంతులగు బిడ్డలు రెండు నెలలువరకు కుంభకర్ణునివలె నిద్రపోవుచుందురు. మూడవనెల వచ్చినపిమ్మట ఉదయము ఒకజామును సాయంత్ర మొక జామును కాళ్లుచేతులు కొట్టుకొనుచు అఱచుచు ఆడుకొనుచుందురు. పిమ్మట క్రమముగా నిద్రతగ్గి పగటిపూట ఒకటిరెండు పెద్దనిద్రలుపోయినను చాలసేపు ఆడుకొనుచునేయుందురు. తొమ్మిదవనెల వచ్చువరకు సామాన్యముగా బిడ్డ మధ్యాహ్నపు నిద్రమఱచిపోవును. బిడ్డ చక్కగ నిద్రపోనియెడల అది యొక వ్యాధియని గ్రహించ వలెను. అజీర్ణముగల బిడ్డలకు సామాన్యముగ చక్కగ నిద్రపట్టదు. తల్లిదండ్రుల సంబంధమైన ఫిరంగిరోగము గలబిడ్డలు రాత్రులయందు బొత్తిగనిద్రపట్టక ఏడ్చుచుందురు. పల్లువచ్చు సమయములయందును, అలవాటు అయిన దాది దగ్గఱలేని సమయమునను కొందఱు బిడ్డలు అధికముగ నేడ్చెదరు. కడుపునిండ ఆహారము లేనియెడలగూడ బిడ్డలు నిద్రపోక పోవచ్చును. పైజెప్పిన కారణము లేవియు లేకపోయినను

బిడ్డచక్కగ నిద్రపోక పోయినయెడలబుద్ధిమాంద్యమని గ్రహించవచ్చును. బిడ్డలు రాత్రులయందు నిద్రపోరేమో యని భయమువొప్పున కొందఱు తల్లులు పగటిపూట నిద్రపోనీయరు. ఇది గొప్పతప్పు. వయస్సువచ్చిన బిడ్డనుగూడ పగటిపూట ఒకమంచినిద్ర పోనిచ్చుట మంచిది. రాత్రిగాని పగలుగాని పాలు త్రాగినపిమ్మట కొంతసేపటి వరకు ఆడుచు అట్లే నిద్రపోవుదురు. సహజముగ నిట్టి నిద్రను పోనీయక తల్లి బిడ్డను యెత్తుకొని తిరుగరాదు. ఆడుకొనుబిడ్డను బలవంతముగా నిద్రపుచ్చరాదు. నిద్రపోవుటకై నల్లమం దుపయోగించకూడదు.

స్నానము:—చక్కని వేడినీళ్ళతో స్నానముచేయించినబిడ్డ వెంటనే బాగుగనిద్రపోవుట సామాన్యముగ నందఱికిని అనుభవసిద్ధమే.

శ్లో॥ దీపనంవృష్య మాయుష్యం స్నానమూర్జాబలప్రదం । కండూమల శ్రమస్వేద తంద్రాతృడ్దాహ పాప్మజిత్ ॥

అనగా స్నానమువలన ఆకలి, ధాతువృద్ధి, ఆయువు, ఉత్సాహము, బలమునుగలుగును. దురద, శరీరమందలిమురికి, ఆయాసము, చెమట, సోమరితనము, దప్పి, తాపము, పాపము ఇవి నశించునని అష్టాంగ హృదయమున జెప్పియున్నది. ఆర్యులు ప్రాతస్నానమునుగూర్చి మిక్కిలి పొగడియున్నారు. ప్రాతస్నానము వలననే సకల పాపములు హరించునని వ్రాసియున్నారు. అందును ఉష్ణోదకస్నానముచే శరీరమునకు బలము

కలుగుననియు, శిరస్సునందు మాత్రము అధికమైన వేడినీళ్ళు పోయరాదనియు చెప్పియున్నారు.

కాని ఏడాది కొక్కసారియైనను స్నానముచేయని బీదపిల్లలు గుండు ముక్కలవలె దృఢముగ తిరుగుచుండుట మన మనుదినము చూచు చున్నాము. ఒక అమెరికా దేశపుగొప్పవైద్యుడు స్నానమునుగూర్చి వ్రాయుచు ఆంగ్లేయదేశమున జన్మములో నొక్కసారియైనను సంపూర్ణస్నానము నెరుగనివారలు అనేకులు గలరనియు, 80 సం॥రములపాటు తన శరీరముపై పెరిగియున్నమురికితో స్మశానమునకు పోయిన కడువృద్ధులనేకులు గలరనియు వ్రాసియున్నాడు. తూర్పుదేశములతో తమకుతగిన సంబంధమువలన శరీరముయొక్క పోషణ విషయములో అనేకములైన మంచిపాఠముల నేర్చుకొంటిమని వ్రాసియున్నాడు. సాత్మ్యము అనగా అలవాటునుబట్టి కొందఱకు స్నానములేక పోవుటచేలనారోగ్యము కలుగకపోవచ్చును. ఐరోపా, అమెరికా మొదలగు శీతలదేశ వాస్తవ్యుల మాటయేమోగాని, మన భరతదేశమున నొక్కదినము స్నానము లేనియెడల నిద్రపట్టని వారలనేకులు గలరు.

మనదేశమున అనుశ్రుతమున వచ్చుచున్న ఉద్వర్తనమనగా నలుగుపెట్టుట బిడ్డలకు మిక్కిలి ఆరోగ్యకరమైనదనియు చెప్పవచ్చును. ఈకాలమునందు నవనాగరికస్త్రీలు సబ్బునీళ్లతో బిడ్డలనుతోలచు పద్ధతి మంచిదికాదు. సబ్బువలన

శరీరమందలి మురికిచక్కగ వదలిపోయినను శరీరము గరుసెక్కును. అందుచే బిడ్డల స్నానమునకు, మెత్తని పెసరపిండి, మిక్కిలి యుపయుక్తము. సబ్బుయందే ప్రీతిగలవారు బిడ్డల ముఖమునకైనను సబ్బునువిడచి మెత్తనిపిండి నుపయోగించుట హితకరము. ఇతర నలుగు పిండులు, శీకాయి, కుంకుడుకాయి, గసగసాలపొడి, ఇప్పపిండి మొదలగునవి అభ్యాసముగ నుపయోగించువారలకు మంచివియే యని చెప్పవచ్చును.

బిడ్డలకు వట్టిస్నానముకంటె అభ్యంగస్నాన మనగా చమురుపూసి స్నానము చేయించుట మిగుల హితకరము.

శ్లో॥ అభ్యంగ మాచరేన్నిత్యంస జరాశ్రమ వాతహా
దృష్టిప్రసాద పుష్ట్యాయు స్వప్నసుత్వక్త్వదార్ఢ్యకృత్॥
(అష్టాంగ హృదయము)

అనగా, ప్రతిదినము అభ్యంగము నాచరించవలయుననియు అందువలన ముసలితనము, శ్రమ, వాతము, ఇవి హరించి నేత్రములకు నిర్మలత్వము, శరీరపుష్టి, ఆయుర్వృద్ధి, నిద్ర, చర్మమునకు కాంతి, దార్ఢ్యము కలుగునని మిక్కిలి హెచ్చుగ ఆర్యులు పొగడియున్నారు. అందును "శిరశ్రవణ పాదేషు తంవిశేషేణ శీలయేత్" శిరస్సునందును చెవులయందును అరికాళ్లయందును, విశేషముగ అభ్యంగము చేయువలెనని చెప్పియున్నారు. ఇదిగాక మనయాంధ్ర దేశమునందు చంటిబిడ్డలకు

కొన్ని దినములవరకు నూనెగాని ఆముదముగాని నఖశిఖపర్యంతము ఎల్లప్పుడును పూసియుంచు ఆచారము మిక్కిలి మంచిది యని నాకు తోచుచున్నది.

1. స్నానము చేసినప్పుడు శరీరమందలి మలినమంతయు నూనెతో పాటు ప్రతిదినము పోవుచుండుట ఒకటి.

2. చంకలు, గజ్జలు, మెడసందులు మొదలగుచోట పుండుపడక, మృదువుగను ఆరోగ్యముగను ఉండుట రెండవది.

3. శీతకాలమునందు చలియు, వేసవికాలమునందు వేడియు, శరీరమునకు తగలకుండ చేయు శక్తి చమురుయందు గలదని కొందఱి వైద్యుల యభిప్రాయము. ఇది మూడవది. ఈ మూడునుగాక బహుశః యింకొక లాభము కలదు.

4. నెయ్యి నూనె మొదలగు చమురుపదార్థములు, చర్మమునందలి రోమకూపములగుండ శరీరములోనికి ప్రవేశించి కొంతవరకు పుష్టినిచ్చును. ఆంగ్లేయ వైద్యులుగూడ చిక్కియున్న బిడ్డలకు చేపనూనె పూయించెదరు. దాని యందుండు దుర్వాసన మంచినూనెయందు లేకపోవుట ఒక సుగుణమేగాని చేపనూనెయం దున్నంత గుణము ఈచమురులలో నున్నదో లేదో నాకు తెలియదు. కొంతవరకైన నుండవచ్చును. ఇది నాల్గవది. ఇట్టి యుపయోగములు కనుబడుచున్నను, ఈ కాలమున ఆచారము తగ్గిపోవుటకు కారణ మూహింపనగును. వెల లధికమగుటచే చమురు ఖర్చులకు భయపడి

యా? ఎత్తుకొనుతల్లుల బట్టలు పాడగుననియా? ఈవిషయమున నింకను శోధనము జేసి బిడ్డలకు చమురు పూయుటవలన లాభమున్నయెడల తల్లులమల్లుబట్టలు పాడైనను ఉపయోగకరమైన ఆచారమును పునర్జీవితము చేయుట యుక్తము.

స్నానము చేయించవలసిన కాలము, స్థలము, విధము.

కాలము:—బిడ్డలకు సామాన్యముగ ఉదయమున 8 ఘంటలు మొదలు 10 ఘంటలలోగా నీళ్లుపోయుట మంచిది. అట్లు చేసినయెడల స్నానమైనపిమ్మట ఒకసారి పాలుత్రాగి చక్కగ నిద్రపోవుదురు. వేళనిర్ణయములేక ఒకనాడుదయమునను మరియొకనాడు మధ్యాహ్నమునను బిడ్డలకు స్నానము చేయించగూడదు. అట్లు చేయుటచే బిడ్డలకు అక్రమపద్ధతులు అలవాటుపడును. మనవారలు సామాన్యముగ ఆరుబయట స్నానము చేయుదురు. బిడ్డలకుగూడ అట్లే చేయించెదరు. గాలి విసురుగ లేనప్పుడు అంతగా నేమియు జబ్బుచేయక పోయినను, ఈదురుగాలిలో బిడ్డను ఆరుబయట స్నానము చేయించిన యెడల బిడ్డశరీరము అధికముగ చల్లబడి చలి, వణకురావచ్చును. కాబట్టి బిడ్డలకు ఆవరణలోపలనుండు స్నానపుగదులలో స్నానము చేయించుట యుక్తము: బీదలకట్లు చేయించుటకు తగిన స్థలము లేనియెడల గాలి హెచ్చుగ వీచుచుండు చలి దినములలో స్నానమును నిలుపుట బహుశః మంచి యుపాయము.

విధము:—ఇప్పటికాలపు చిన్నచిన్న తల్లులనేకులకు బిడ్డలకు నీళ్లు పోయువిధము తెలియదని చెప్పవచ్చును. పైపెచ్చుబిడ్డలకు నీళ్లుపోయుట యొకవిద్యయా యని చెప్పుదురు, కాని పనివచ్చినప్పుడు ముసలవ్వలను ముసలిదాదులను కాళ్ళుకడుపులు పట్టుకొని బిడ్డలకు నీళ్ళు పోయించుకొందురు. చక్కని తల్లులు కాదలచు పిల్లలు తమ ఇంట పిల్లలు లేనియెడల ప్రక్కయింటి పిల్లలకు నీళ్ళుపోసియైనను, మెళుకువగ చూచియైనను నేర్చుకొనవలెను. ఎందుచేత ననగా పుస్తకములు చదివినను, అభ్యాసముచేత నేర్చుకొనిన తప్ప బిడ్డలకు స్నానముచేయించు విద్య సులభముగ పట్టుపడునదిగాదు. సరిగా స్నానము చేయించుటకు తెలియని తల్లులు బిడ్డకు స్నానముచేయించిన మీదట జలుబుచేసినదని చెప్పుకొనుచుందురు. విధము తెలిసి, బిడ్డకు చక్కగ దినదినము స్నానముచేయించినయెడల ఉన్న జలుబు పోవుటయేగాక ఎన్నటికిని జలుబుచేయక యుండును. గోరువెచ్చని నీళ్లతో బిడ్డకు స్నానము చేయించినయెడల శరీరమున రక్తము మరింత చక్కగ ప్రవహించును. అనేకములగు చర్మవ్యాధులు నశించును. చర్మమునందలి రోమకూపముల పనికిని మూత్రతిత్తులు చేయు పనికిని సంబంధముగలదు. రోమకుహరములు పరిశుభ్రముగ నుంచుకొనునెడల మూత్రవ్యాధులు దరిచేరకుండును. ఆర్యులు వచించునట్లు అజీర్ణము మొదలగు అనేకవ్యాధులు ఉచిత

స్నానముచే నశించును. నోరెఱుగని పశుపక్ష్యాదులు కూడ తమ శరీరములను చక్కగ శుభ్రపరచుకొనుటకై స్నానము చేయుచుండుట మీరందరు చూచియుండ వచ్చును. ఇది ఇట్లుండగా, తల్లులు బిడ్డలకు స్నానముచే జలుబుచేసినది, జ్వరము వచ్చినదని చెప్పుచుందు దానికి తగినకారణము లేక పోలేదు. స్నానము చేయించువిధము తెలియక చలిగాలిలో బిడ్డలకు స్నానము చేయించుట చేతను, సకాలమున బిడ్డను చక్కగా పొడిగానుండునట్లు తుడవక పోవుటచేతను, తడిగుడ్డలలో తడితడిగా బిడ్డలను పరుండబెట్టుట చేతను, వచ్చెడు అనేకవ్యాధులు స్నానముచేతనే వచ్చినవని తలపవచ్చును. చంటిబిడ్డను స్నానముచేయించుటలో గమనింప తగిన సూక్ష్మ విషయములు.

1. ఇటునటు బిడ్డనెత్తుకుపోవునపుడు బిడ్డయొక్క అంగములకు అభిఘాతము కలుగకుండ తల క్రిందను మెడక్రిందను ఒకచేయియును, నడుముక్రింద ఒకచేయియును వేసి చక్కగ నెత్తుకొనుట. ఒకచేయియో కాలో పట్టి బలాత్కారముగ ఈడువకూడదు.

2. గజ్జలు, చంకలు, మెడ మొదలగుచోట్ల మడతలలో చక్కగ చమురు పూయుట. మోటగకాకుండ మెల్లమెల్లగ ఈభాగములందు చక్కగ తోముట. మెత్తని శుభ్రమైన గుడ్డతో తుడుచుట. పొడిగ తుడిచిన పిమ్మట కొంచెము చమురుగాని

మెత్తని వరిపిండి బోరికాసిడ్ మొదలగు పదార్థములతో చేయబడిన పిండినిగాని పూయుట.

3. నీళ్ళు పోయునపుడు ముక్కులలోను చెవులలోను నోటిలోను నీళ్ళు దూరకుండ చక్కగ బిడ్డను కాళ్ళపై బోర్లిగిల పరుండ బెట్టుకొనవలెను. బిడ్డ కూర్చునుటకు నేర్చిన యెడల కూర్చుండబెట్టి నీళ్ళు పోయవలెను.

4. బిడ్డను స్నానముచేయించక పూర్వమేతుడుచుటకు కావలసిన పరిశుభ్రమైన గుడ్డలను ముందుగనే తెచ్చి స్నానము చేయించుచోట పొడిగను అందుపాటుగను పెట్టుకొనవలెను. బిడ్డను అవసరమైనంత కాలముకంటె నాననీయక స్నానము ముగిసినవెంటనే పొడిబట్టలతో చక్కగ తలమొదలు వేఱు వేఱు భాగములను, ఒక్కొక్కటిగను శీఘ్రముగను ఎంత మాత్రము తడి లేకుండనటులను తుడవవలెను. మృదువైన భాగముల మెల్లగనొత్తి నీరు ఒత్తవలెనుగాని మోటగ తుడిచి పుండు చేయరాదు. తడిబిడ్డనెత్తుకొని దొడ్లోనుంచి ఇంట్లోనికిని, ఒక గదిలోనుంచి మరియొక గదిలోనికి గుడ్డలను వెతుకుకొనుచు పరుగులెత్తరాదు.

5. బిడ్డనుచక్కగ తుడిచినపిమ్మట సాంబ్రాణి మున్నగు సుగంధ ద్రవ్యములచే పొగవేయవలెను. బిడ్డయొక్కగుడ్డలు పడకలు మొదలగు వానికిగూడ వెచ్చవెచ్చగ ధూపమువేసి బిడ్డను పొడిగనుండు పడకలో ఉచితమగు దుస్తులను వేసి

పరుండబెట్టవలెను. అంతేగాని తిరిగి ఉచ్చగుడ్డలలో పఱుండబెట్టరాదు.

ఇంత యధిక లాభకారిగ స్నానమును గురించి పైన జెప్పబడియున్నను వ్యాధిగ్రస్తులగు బిడ్డలకు అనుచితస్నానము వలన ఒకానొకప్పుడు అపాయము గలుగ వచ్చును. కాబట్టి ఆరోగ్యముసరిగాలేనపుడు తగినవైద్యుని సలహాలేనిదే స్నానము చేయించ కూడదు.

వేషము:— స్నానముచేసిన పిమ్మట చలి గాలి తగలకుండా ఉచితమైన వేషము వేయవలెను. పరిశుభ్రమైన వస్త్రములను ధరింపజేసి ఎల్లప్పుడును, రత్న, సిద్ధమంత్ర, మహౌషధులను, శరీరమున ధరించవలయునని ప్రాచీనులు చెప్పియున్నారు. కాని అట్టి రత్నములుగాని మంత్రములుగాని మహౌషధులుగాని ఙూ కాలమున దుర్లభము. వాని గుణములును మనకిప్పుడు గోచరమగుటయు లేదు. కాని ఇప్పటితల్లులు గాలి తగిలినతోడనే బిడ్డలకు రోగమువచ్చునని భయముచే ఏమలిన వస్త్రమునైనను బిడ్డకు కాళ్ళుచేతు లాడకుండునట్లు తొడుగుచున్నారు. మన దేశమందు మిక్కిలి చలిరోజులలో తప్ప తక్కిన దినములలో బిడ్డలకు ఎంతతక్కువ దుస్తులను వేసిన అంత మంచిదియని నా అభిప్రాయము. బిడ్డకు వేషము వేయునప్పుడు గమనింపతగిన ముఖ్యవిషయములు.

1. ప్రతి యవయవమును స్వేచ్ఛగ కదులుటకు తగిన యనుకూలము లుండవలెను.

2. ఋతువునుబట్టి అనగా శీతకాలములో కొంచము ఎక్కువ దళమైనవియు, బొచ్చుతో గూడినవియు దుస్తులుండవలెను. వేసవికాలమున మిక్కిలి పలచని దుస్తులుండినను చాలును.

3. బిడ్డయొక్క దుస్తులు సాధ్యమైనంత తేలికగానుండవలెను.

4. నడుమునకు క్రింది భాగమున వేయు గుడ్డలుగాని బట్టలుగాని మలమూత్రములచే మలినమైనయెడల వెంటనే సులభముగతీసి పొడివగు క్రొత్తవాటిని వేయుటకు వీలుగ నుండవలెను. పడకలు ఉచ్చతో తడవకుండ మైనపుగుడ్డను నడుము క్రిందిభాగమున వేయుట యుక్తము.

5. బిడ్డలబట్టలకు ఏపూటకాపూట కుంకుడు కాయ పులుసు, సబ్బు మొదలగునవి పట్టించి ఉడకవేసి ఉతికి ఆరవేసుకొనవలెను. అవి ఆరినవెంటనే మడచి బిడ్డదుస్తులకని ప్రత్యేకముగ నేర్పడిన ఒక చిన్నపెట్టలో పెట్టుకొనవలెను. కాని, గుడ్డలు కావలసినప్పుడెల్ల వానికోసము దొడ్డివైపునకు పరుగెత్తరాదు. వర్షాకాలములో గుడ్డలు చక్కగ ఆరనియెడల వానినిపరిశుభ్రమైన యొకబుట్టపై పఱచి, ఆబుట్టను కణకణలాడు నిప్పులమీద బోర్లగించి, ఆవేడిచే బట్టలను ఆరబెట్టి, వెచ్చవెచ్చగ మడతబెట్టి పెట్టెలో పెట్టుకొనవలెను. బిడ్డ చెరిచిన గుడ్డలను, యెప్పటి కప్పుడు ఉతికి ఆరవేయవలెను.

లేదా ప్రత్యేకముగ వేరొక పెట్టలో మూసి పెట్టవలెను. కాని ఈగలు ముసురుకొనునట్లు ఇంటిపొడుగున పారవేయగూడదు.

పురిటింటిలోని బిడ్డల యొక్క స్నాన వేషములలో గమనింపతగిన విషయములు కొన్నిగలవు

1. పుట్టినప్పుడు కొందఱబిడ్డల శరీరముమీద ఒకవిధమైన తెల్లనిపదార్థము అంటుకొని యుండును. కొంచము చమురుగాని కోడిగుడ్డు సొనయైనను మంచినూనెయు సమభాగములుగ జేర్చి దానినిగాని ఒంటినిండా పట్టించి కొంచెమూరనిచ్చి నలుగుపిండితో రుద్ది తోమినయెడల అది చాలభాగము విడుచును. పూర్తిగ విడువనియెడల బిడ్డకు తొందరకలిగించి మోటుగ రుద్దుటకంటె అప్పటికట్లే విడచి స్నానమైన బిడ్డను పొడిగతుడచి పిమ్మట కొంచము మంచినూనెను ఒంటిమీద చరుముచువచ్చిన యెడల నానాటికి చర్మము నిర్మలమగును.

2. బొడ్డు అపరిశుభ్రముగ నుంచుటచే పురిటింటిలో వచ్చు వ్యాధులనుగూర్చియు అందుచే గలుగు మరణములను గూర్చి వెనుక ప్రకరణములో వ్రాసియున్నాము.

బిడ్డను స్నానము చేయించునపుడు బొడ్డుమీద దెబ్బ తగిలి వ్రణము ఏర్పడకుండ మిక్కిలి జాగ్రత్తగ చూచుకొనవలెను. బొడ్డు మిక్కిలి స్వల్పముగ శరీరమున కంటియుండి యెప్పటికప్పుడే ఊడిపోవునట్లు కనుపించుచున్నను, దానిని మరింత త్వరలో తీసివేయవచ్చునను ఉద్దేశముతో నెంత

మాత్రమును ఈడ్వరాదు. అట్లు ఈడ్చిన యెడల క్రొత్త పుండుపడి ఆపుండుద్వారా మలినము రక్తములోనికి ప్రవేశించి చీము జ్వరము మున్నగు దుర్గుణములు పుట్టవచ్చును. బిడ్డను స్నానము చేయించినపిమ్మట మెల్లగ తడినంతయు నొత్తివేసి, కాగి చల్లారిన పరిశుభ్రమైన నూనెనుగాని బోరికాసిడ్, త్రిఫలా చూర్ణము మొదలగు సూక్ష్మజీవి సంహారక ద్రవ్యములచే చేయబడిన లేపనములనుగాని వేయవచ్చును. పొడిపొడిగ చూర్ణమును చల్లి మెత్తనిగుడ్డతో కట్టుకట్టినను కట్టవచ్చును. ఇట్లు చేసినయెడల నాలుగైదు దినములలో బొడ్డు దానంతట అదే యూడిపోవును. బొడ్డుమీద కొన్ని దినములవరకు నూనె గుడ్డను వేయునాచారము మంచిదై యుండవచ్చును. కాగి చల్లారిన నూనె నుపయోగించిన యెడల సూక్ష్మ జీవుల భయముండదు.

గాలి, వెలుతురు:—మనదేశములో ఆడవారలనేకులు గాలియనిన ఎందుకో మిక్కిలి భయపడెదరు. పురిటింటిలోనికి సెరసందులలోనుండి గూడ గాలి వచ్చి గదిలో దూరునేమో యని భయముచేత పెట్టెలవలెనుండు చిన్నగదులను పురిటికై ప్రత్యేకముగ నేర్పాటుచేసుకొందురు.

మహాన్నత్యము నొందిన ఈభరతఖండమందు సుశ్రుతాది ప్రసూతిశాస్త్రవేత్తల అభిప్రాయములకు భిన్నమగు నిట్టియాచారము ఎప్పుడెట్లు పుట్టినదో తెలియదు. ఏదైనను

ఒక మొక్కను పరీక్షించిన యెడల వెలుతురున కది యెట్లు ఆశపడునో తెలియగలదు. దట్టమగు చెట్లనీడను గడ్డియైనను మొలవకుండుట మనము చూచుచున్నాము. ఇట్లే బిడ్డలును గాలికిని వెలుతురునకును ఆశపడుచుందురు. మంచిగాలి వీచుచోట నిద్రించునట్లు బిడ్డలు గాలిలేక ఉమ్మదమగుచోట నిద్రపోరు. అయినను, విసురు గాలి బిడ్డలకు అనారోగ్యమను మాటచెప్ప నక్కఱలేదు. బిడ్డలను గాలికి ఎదురుగా పరుండబెట్టక ఒక్క ప్రక్కగా పరుండబెట్టి అవసరమైనయెడల ముఖము తప్ప తక్కినభాగములన్నియు చక్కగ కప్పినయెడల కొంచెము గాలి హెచ్చుగ వీచినను భయపడపనిలేదు. ముఖముమాత్రము మూసిపెట్టగూడదు. మెడవద్దను చెవులవద్దను బిగువుకాకుండ మూయవచ్చును.

శీతాతపములు-శీతలము-చలి:—అతి చలికిగాని అతి యెండకుగాని బిడ్డలు బొత్తిగ తాలుకొనజాలరు. ఈదురగాలిలో స్నానము చేయించి, స్నానమా నీమహిమ చెప్పమన్న యెడల వెంటనే దానిమహిమ కనుపించును. జలుబు, జ్వరము, సిద్ధమగును. శరీరము అతిశీతలత్వము నొందుటచేసి వ్యాధులు వచ్చుచున్నవిగాని స్నానముచేగాదని యూహించవచ్చును. రాత్రులయందు బిడ్డపడక కెదురుగానుండు తలుపులను తెఱచి, తల్లులుమైమరచి నిద్రపోవుచున్న యెడల తెల్లవారుజామున చలిగాలి యెక్కువై బిడ్డపైవిసరి, తెల్లవారి బిడ్డ లేచునప్పటికి, జలుబును జ్వరమును సోకవచ్చును. కాబట్టి తల్లులు బిడ్డలకు శీతగాలి తగలకుండునటుల, కాపాడుకొను చుండవలెను.

ఆతపము:—ఎండ. నాగరికుల బిడ్డలు సామాన్యముగ నెండకు తాళుకొనజాలరు. గాని అభ్యాసముగా నెండబడిన బిడ్డలు చక్కగ పెరుగుచు చిన్నచిన్న వ్యాధులకు లోబడరు. సామాన్యముగ కొద్దిపాటి ఎండ దేహమునకు మంచిదైనను, అధికమైన గాలివలెనే అధికమైన ఎండయుగూడదు. వర్షాటంకము లేనియెడల పుట్టిన రెండువారముల నుండియు బిడ్డను, ఉదయమునను సాయంత్రమునను ఇల్లు వెడలించి బయట త్రిప్పుట మిక్కిలి మంచిదియని చెప్పవచ్చును. తగిన దుస్తులు వేసి తోపుడు బండ్లలో నెక్కించుట మంచి యాచారముగాని పరుగెత్తగలిగిన బిడ్డలను ఆయాసమువచ్చువరకు పరుగులెత్తించుటయు బండ్లులాగించుటయు బండ్ల నెక్కించి త్రిప్పుటకంటె చాల మంచిది. (వ్యాయామము చూడుము.) అకస్మాత్తుగ శీతోష్ణస్థితులు మారినప్పుడు బిడ్డలకు అతిశీతలత్వముగాని, అత్యుష్ణత్వముగాని తగలకుండ చూచుకొనవలెను.

పరిశుభ్రత:—చంటి బిడ్డల విషయమున పరిశుభ్రత మిక్కిలి అవసరమైనది. పుట్టినప్పటినుండియు మలమూత్రాదులలో పొర్లుచుండు పసిబిడ్డలు తమంతతాము పరిశుభ్రముగా నుండుట అసాధ్యము. తల్లిగాని, సమీప బంధువుగాని, దాదిగాని, బిడ్డ నెల్లప్పుడు శుచిగా నుంచుటకై సిద్ధముగ నుండ

వలెను. బిడ్డకు నడుము క్రింది భాగమున పడకపై నొక మైనపుగుడ్డను, నడుమునుండి పాదమువరకు వచ్చునట్లు వేయవలెను. నడుమువైపున కొంచమెత్తుగను పాదములవైపున కొంచము పల్లముగను పడకను అమర్చవలెను. ఈ మైనపు గుడ్డపై రెండు మడతలువేసిన పరిశుభ్రమైన గుడ్డను, నడుము నుండి మోకాళ్ల వరకును పర్చవలెను. బిడ్డమలమునుగాని మూత్రమునుగాని విడచినతోడనే పై గుడ్డనెత్తివేసి మైనపుగుడ్డను చక్కగ తుడిచి క్రొత్తగుడ్డను శుభ్రమైనదానిని తిరిగి వేయవలెను. తెలివిగల బిడ్డలు మూత్రము పోయుటచే తడసిన గుడ్డ శరీరమునకు తగిలిన వెంటనే ఏడ్చెదరు. తెలివి గల దాదులు ఈ విషయమును వెంటనే గ్రహించి బిడ్డ నెల్లప్పుడును పరిశుభ్రముగ నుంచెదరు. బిడ్డను పరిశుభ్రముగనుంచని యెడల, పిర్రమీదపుండ్లు, గజ్జలలోపుండ్లు, చిడుము, గజ్జి మొదలగు వ్యాధు లంటుకొనును. పరిశుభ్రత యనునది చిన్నప్పుడే నేర్పినయెడల బిడ్డలకది యావజ్జీవము అలవాటుపడును. చిన్ననాడలవడని పరిశుభ్రత పిమ్మట వచ్చుటకష్టము. బిడ్డ పాలుత్రాగిన వెంటనే నోటిని పరిశుభ్రమైన మెత్తనిగుడ్డతో తుడవవలయును. బొటనవ్రేలు నోటిలో పెట్టుకొని చప్పరించు అలవాటు అసహ్యము. దీనికి కొంతవరకు తల్లులే కారణము. ఈఅభ్యాసము మందబుద్ధిని సూచించునని కొందఱు వైద్యుల యభిప్రాయము. అపరిశుభ్రతచేతనే సూక్ష్మజీవుల సంబంధ

మగు వ్యాధులన్నియు సంక్రమింపవచ్చును. బిడ్డయొక్క పడక, బిడ్డయుండుగది, బిడ్డను సంరక్షించు దాదులు అన్నియు, మిక్కిలి పరిశుభ్రముగ నుండునట్లు చూచుకొనుట తల్లియొక్క విధియై యున్నది. పసిబిడ్డయొక్క బుద్ధి తనచుట్టునుండు పరిస్థితులనుబట్టి దినదినాభివృద్ధి యగుచుండును. సృష్టి వైచిత్రమును కొంచము కొంచముగ తానాడుకొనుచుండు బొమ్మల నుండియు తనచుట్టునుండు అనుచరుల ముఖములనుండియు గ్రహించును. కాబట్టి బిడ్డకు సంబంధించిన సకల పదార్థములను రమ్యముగను, ఆనంద దాయకములుగ నుండవలెను. దాదులును తల్లులును మటమటలాడుచు నుండగూడదు.

ఇ రు వ ది య వ ప్ర క ర ణ ము

అవసర చికిత్సలు

అన్యపదార్థప్రవేశము: ఏదో ఒకపదార్థము రాయియో గింజయో గుండుసూదియో ముక్కులోగాని చెవిలోగాని గొంతుకలోగాని దూరుకొని ఇటునటుపోకుండ బాధింపవచ్చును. చూడు గొంతుక, ముక్కు, చెవి.

ఉక్కిరిబిక్కిరి:—అనగా గొంతుకలో యేదైనా అడ్డముపడుటచే గాని బిడ్డ పీల్చుగాలి చెడిపోవుటచే గాని కోరింత దగ్గు మొదలగు దగ్గులలో వచ్చు ఈడ్పుచేగాని, ఎక్కెక్కి ఏడ్చుటచే వచ్చు ఈడ్పుచేగాని, ఊపిరి ఆడక బిడ్డకు ఉక్కిరి బిక్కిరై పోవచ్చును. నీళ్ళలో మునుగుటచేగాని క్లోరోఫారముగాని అధికమైన పొగనుగాని పీల్చుటచేగాని ఊపిరిఆడక పోవచ్చును. విషవాయువుచే వచ్చు ఉక్కిరిబిక్కిరికి చికిత్స.

1. తలుపులు కిటికీలు తెఱచివేయుము. బిడ్డను వెంటనే ఆస్థలమునుండి విశాల ప్రదేశమునకు మార్చివేయుము.

2. రోగియొక్క దుస్తులను ముఖ్యముగ మెడవద్దను నడుమువద్దను వదలు చేయుము.

3. పిమ్మట కొన్ని క్షణములలో బిడ్డకు శ్వాసము తనంతటనే చక్కగ ఆడనియెడల కృత్రిమశ్వాసక్రియను జరిపి ఊపిరాడునట్లు చేయవలెను. కృత్రిమశ్వాసక్రియగూర్చి క్రిందచూడు.

ఈడ్పు:—17-వ ప్రకరణము చూడుము.

ఎముక వంగిపోవుట.

లక్షణములు:—నొప్పి, వాపు, అంగశైథిల్యమనగా యెముక వంగుటచే కాళ్ళుచేతులు మున్నగునవి వంగుట.

బిడ్డల ఎముకలు పెద్దవాళ్ళ యెముకలకంటె మెత్తగనుండుటచే వంగునుగాని విరుగవు. నొప్పిని తగ్గించుటకై వేడివేడిగ ఒత్తడము వేయవలెను. ఒత్తడములు చూడు. దెబ్బతగిలినవెంటనే కనిపెట్టి తడిగుడ్డగాని మంచుగెడ్డ నీళ్లలో ముంచిన మిక్కిలి చల్లనిగుడ్డనుగాని దెబ్బతగిలినచోట చుట్టవలెను. ఇందుచే వాపుతగ్గును. వైద్యునకుచెప్పి పంపవలెను.

ఒత్తడములు: పిండికట్లు. ఒత్తడములనగా కంబళిగుడ్డ మొదలగు వానిని వేడినీళ్ళలోముంచి నీళ్ళనుపిండివేసి ఆగుడ్డతో సుఖోష్ణముగ వ్యాధిగల భాగమును ఒత్తుట. పిండికట్లు అనగా ఉడికించిన యేపిండితోనైనను సుఖోష్ణముగ వ్యాధిగల ప్రదేశమున కట్టుకట్టుట. ఈ రెంటియొక్క ఉద్దేశమును ఒక్కటియే. వెచ్చవెచ్చగ కాచుటచే ఆ ప్రదేశమునందు రక్తప్రసారము అధికమై వ్యాధిగల చోటులందు ఆరోగ్యము అధికమగును. ఇట్టి ఒత్తడము లందుగాని, పిండికట్ల యందుగాని రోగికి హితమైనంత తడితో కూడిన వేడి యుండుటవలన ఉపయోగము హెచ్చుగ గలదు. ఒకానొకప్పుడు చర్మమునందు రక్త ప్రసారము ఒత్తడములచే నధికముచేసి, చర్మముక్రింద ఆభాగ

ముననుండు అవయవయములందు రక్తప్రసారము తగ్గించి వానియందలి అధికమైన వాపు, నొప్పి మొదలగు వాసి తగ్గించుట ఒత్తడముల యుద్దేశమై యుండును.

ఒత్తడముల వివిధోపయోగములు.

1. నొప్పితగ్గించుట.

2. వేగముగ కురుపును పక్వముచేసి చీము క్రమముగ పైకివచ్చి కురుపు పగులునట్లు చేయుట. కురుపుల యొక్క ప్రథమావస్థయందైన యెడల చీము పుట్టకముందే వాపుతగ్గి కురుపు హరించిపోవును.

3. లోతుగనుండు అవయవములయందలి రక్తాధిక్యతను తగ్గించి వానియందలి వాపు, నొప్పి మొదలగువానిని తగ్గించుట.

4. నొప్పిగల భాగములయందు బిగబట్టియున్న స్నాయువులు మొదలగువాని పట్టులను విడిపించుట.

పిండికట్లు కట్టువిధము, వాని భేదములు.

మంటను పోటును ఉపశమింప జేయుటకై అన్నము, వరిపిండి,గోధుమపిండి,అతసివిత్తులపిండి మొదలగువానిని రమారమి సగభాగము నీళ్ళతో ఉడికించి, అట్లు ఉడుకునప్పుడు 10 పలముల పిండికి రమారమి ఒక పలముచొప్పున మంచి నూనెనుగాని ఆముదమునుగాని వేసి కలిపి ఆపిండిని సుఖోష్ణముగ వ్యాధిగ్రస్తమగు ప్రదేశమున వేసి కట్టవలెను. అట్లు కట్టునప్పుడు గమనింపవలసిన ముఖ్యాంశములు.

1. పిండికట్టు వేడిహెచ్చుగనున్నదా తక్కువగనున్నదా యను విషయమును నీ అరచేతియొక్క వెనుక భాగముతో పిండికట్టును కొంచెము స్పృశించి చూచి గ్రహించవలెను. అతివేడిగ వేయరాదు. చల్లబడిన పిమ్మట వేయరాదు. కాబట్టి చలిగాలిలో ఉడికినపిండిని బెట్టక నిప్పుశెగనే కట్టునకు కావలసిన సామగ్రి అంతయు తయారగు వరకును ఉంచవలెను.

2. చప్పగా చల్లారిన పిండికట్టును వ్యాధిగలప్రదేశమున నుండి ఎప్పటికప్పుడు ఎత్తివేయవలెను.

3. తిరిగి మరియొకకట్టు సిద్ధముచేసుకొనిన తరువాతగాని మొదటవేసినకట్టును ఎత్తివేయరాదు. అట్లుచేసినయెడల వ్యాధిగల ప్రదేశమునకు గాలి తగిలి మిక్కిలి చల్లబడిపోవును.

4. పిండికట్టు తగినంత దళసరిగానుండవలెను. పాతిక అంగుళము మొదలు ముప్పాతిక అంగుళమువరకు ఉండవలెను.

5. పిండికట్లలో నొప్పితీయుటకు నల్లమందుకాయ కషాయమును, ఉమ్మెత్తకషాయమును, నెత్తురుచిమ్మినచోట రక్తమును తగ్గించుటకు పటికపొడుమును, పుండ్లయందలి దుర్వాసన తగ్గించుటకు బొగ్గుపొడుమును, ప్రదేశమును కందునట్లుచేసి లోపలినొప్పిని తగ్గించుటకు ఆవపిండిని, సూక్ష్మజీవులవృద్ధిని తగ్గించుటకును పుండు ఆర్పుటకును త్రిఫలాచూర్ణము, బోరికు పొడుము మొదలగు క్రిమిహారచూర్ణములను చేర్చుకొన

వచ్చును. కొందరు నీరుల్లిపాయ, వాముకు మెత్తగ చితగకొట్టి దానిని నూనెతోగాని ఆముదముతోగాని మెత్తగ ఉడికించి వేడివేడిగ గోరుచుట్టు మొదలగు కురుపులకు కట్టుదురు. ఇది మిక్కిలి ఉపయోగకరము.

ఒత్తడములు వేయువిధము.

వేడినీళ్లతో పిండి ఒత్తుటకై పరిశుభ్రమైన రెండు కంబళి గుడ్డలు లేక మెత్తని ఇతర గుడ్డలును, ఈ గుడ్డలను వేసి పిండుకొనుటకై పరిశుభ్రమైన ముతక తుండుగుడ్డ యొకటియు, నీళ్ళు కాచుకొనుటకై కొంచెమునోరు వెడల్పు గిన్నె యొకటియు, పిండిన నీళ్ళు నేలమీద పడకుండ పట్టుటకై ఒక పళ్ళెమును, ఒకజత పట్టకారులును, మండుచుండు కుంపటి లేక పొయ్యియు ఈవస్తువులను ప్రథమమున సేకరించుకొనవలెను. పిమ్మట సలసలకాగెడు నీళ్ళలో కంబళిగుడ్డ నొకదానిని కొంచెముసేపు ఉడికించి ఆగుడ్డను ముతకతుండు గుడ్డలో వేసి నీళ్లన్నియు పోవువరకు గట్టిగా పిండి, వేడి చల్లారక మునుపే సుఖోష్ణముగ ఆకంబళిగుడ్డతో వ్యాధిగలప్రదేశముపై ఒత్తవలెను. ఇది చల్లారిపోకమునుపే రెండవ కంబళిగుడ్డను ఉడకబెట్టి తయారు చేసికొనుచుండవలెను. ఈ ప్రకారము విడువక అరగంటవరకును ఒత్తవలెను. పిమ్మట అవసరమునుబట్టి మూడు లేక నాలుగు గంటల కొకసారి ఒత్తడము వేయవలెను. పుండ్లకు ఒత్తడము వేయునప్పుడు ఈ ఒత్తడము వేయు కంబళిగుడ్డకు బదులు మందులతోకూడి

యున్న బోరికులింటు మొదలగు మందుగుడ్డలను ఉపయోగింపవచ్చును. పుండ్లమీద ఈ మందుగుడ్డను చక్కగ పిండిన దానిని వెచ్చవెచ్చగ మూడునాలుగు పొరలుగాపరచి, దానిపైని ఒక నూనెకాగితమునుగాని నూనెలోముంచి తయారు చేసిన పట్టుగుడ్డనుగాని వేడిగుడ్డకంటె కొంచెము పెద్దగనుండు దానినికప్పి దానిపైని దూదిని దట్టముగపరచి కట్టుకట్టవలెను. ఇట్లు చేయుటచేత వేడిగుడ్డలోని తడిని దూది పీల్చివేయకుండ నూనెకాకితముగాని నూనెగుడ్డగాని మధ్య నడ్డముగనుండును. ఈనూనె గుడ్డకు బదులు లేత అఱటాకునుగాని మెత్తని ఎండు తామరాకునుగాని వేయవచ్చును. దూదిచే దట్టముగ కప్పుట చేత ఒత్తడముయొక్క వేడి వెంటనే తగ్గిపోక రెండుమూడు గంటలవరకు నిలిచియుండును. వేడి చల్లారిపోయినదని తోచిన వెంటనే తిరిగి సుఖోష్ణముగ మరియొక ఒత్తడము వేయవలెను.

ఒత్తడములు వేయునప్పుడు నీళ్ళలో నొకానొకప్పుడు టర్పెంటైనుగాని, నల్లమందుకాయగాని, ఉమ్మెత్త, వేపాకు, పసుపు, కరక్కాయ మొదలగు వానినిగాని చేర్చవచ్చును. లేక ఒత్తడము వేయుప్రదేశమున మందులుగాని తైలములుగాని ఒత్తడమునకుముందు చరుమవచ్చును.

కన్ను :—కంటిలో నలుసుపడుట. కొంచెము నెయ్యిగాని పరిశుభ్రమైన ఆముదముగాని కంటిలో వేయవలెను. కన్ను నలపకూడదు. మిక్కిలి మెత్తని పరిశుభ్రమైన గుడ్డ

యొక్క కొనను దారమువలె మెలిచుట్టి తడిపి, ఆకొనచే ఒకానొకప్పుడు కంటిలోనున్న నలుసును తీసివేయుటకు వీలుకావచ్చును. నలుసు పైరెప్పలోనున్నయెడల పైరెప్పను మెల్లగ రెప్ప వెండ్రుకలతో పట్టియెత్తి క్రిందిరెప్పమీద అనునట్లు క్రింది వైపునకుయెత్తి లాగినయెడల ఒకానొకప్పుడు నలుసు బయట పడిపోవచ్చును. లేదా పైరెప్పను వెండ్రుకల సహాయముచే పట్టుకొని, చీపురుపుల్ల నొక దానిని పైరెప్ప పైభాగమున చర్మముపైని పరుపుగవేసి అదుముచు, రెండవచేతితో రెప్పను తిరగదీసి దానినంటియున్న నలుసును తీసివేయవచ్చును. పిమ్మట ఆముదముగాని నెయ్యిగాని కంటిలోవేయుట మంచిది.

కండ్లకలక—పటిక, బోరికుపౌడరు, లేక కరక్కాయ ఒకపాలు, కాగిచల్లారిననీరు నూరుపాళ్లు ఈ ప్రకారముచేసిన ద్రావకముతో దినమునకు రెండుమూడుసార్లు కండ్లను చక్కగ మెత్తనిగుడ్డతో కడిగి రాత్రి పరుండునప్పుడు పరిశుభ్రమయిన ఆముదము ఒకచుక్క కంట్లోవేయవలెను. మునగాకు రసము ఒకచుక్క తేనె 5 చుక్కలుచేర్చి దానిని కంటిలో వేయవచ్చును. తీవ్రమైన కంటివ్యాధులలో తగినవైద్యునిచే చికిత్స చేయించుట యుక్తము.

కాకచెమ్మలు—ఈడ్పు ప్రకరణము చూడుము.

కాలినపుండ్లు—నూనె లేక నెయ్యి ఒకపాలు, సున్నపునీళ్ళు అయిదు మొదలు పదిపాళ్ళుచేర్చి సీసాలోవేసి కుదిలించి దానిలో మెత్తని పరిశుభ్రమైన గుడ్డను తడిపి ఆగుడ్డను కాలిన

పుండ్లపై వేయవలెను. తిరిగి తీసివేయునప్పుడు కూడ ఈద్రావకముచే చక్కగ ఊరనిచ్చి మిక్కిలి నెమ్మదిగా ఎత్తివేయవలెనుగాని మోటుగ పీకివేయరాదు.

కురుపులు (గజ్జి):—చంటిబిడ్డకు వచ్చు వ్యాధులలోనన్నిటికంటె మిక్కిలిగ వచ్చునవి కురుపులు. కాబట్టి తల్లులెప్పుడును పదిపలములు గంధకము జాగ్రత్త పెట్టుకొనవలెను. నిరపాయకరమైనది, మంటలెత్తనిది, పురుగును చంపునది, దీనిని మెత్తగ నూరి మంచినూనెతోగాని కొబ్బరినూనెతోగాని కలిపి ధారాళముగ పూయవలెను. మందు ఖర్చునకు లోభించవద్దు. విడువక మూడురోజులు పూసిననేగాని పురుగు చావదు. కాబట్టిస్నానముచేయించక పోయినను మూడురోజులు వరుసగ దినమునకు రెండుమూడుసార్లు పూసి నాల్గవదినమున పెసర పిండితోగాని కుంకుడుకాయ రసముతోగాని రుద్ది స్నానము చేయించవలెను. పిమ్మట ఒక్క కురుపుగూడ లేకుండ పోవు వరకు అనుదినము వాసనకు జంకక గుడ్డలు పాడగునని జంకక మందుపట్టించి గంటసేపు ఊరనిచ్చినపిమ్మట స్నానము చేయించవలెను. బిడ్డగుడ్డలు ఉడకవేయించి ఎండలో వేయవలెను. ఇంట్లో గజ్జిగల వార్లందఱకు ఒకసారి చికిత్సచేయవలెను. లేనియెడల ఒకరిని విడిచి మరియొకరికి అంటుచు ఆయింటిని గజ్జి విడువదు. గంధకముగాక ఇతరమందు లనేకములు గలవుగాని అన్నిటిలో నిది చవుకైనది. తప్పక గుణమిచ్చునది. ఇది గాక,

హారతి కర్పూరము, సాంబ్రాణి, మైలతుత్థము, ఇంగిలీకము, రసకర్పూరము, గాడిది గడపాకు, మిరియములు, పసుపు, నల్ల జీలకర్ర, వేపాకు, నేలవేము, మంచిగంధము, సున్నము, వెలి బూడిద ఆముదము, మొదలగునవి అప్పుడప్పుడు కురుపులకు ఉపయోగపడును. కురుపులు పోటెత్తుచున్న యెడల వేడివేడిగ ఒత్తడములుగాని పిండి కట్లుగాని వేయవలెను.

కృత్రిమశ్వాస క్రియ:—ఇది బిడ్డకు సరిగా ఊపిరి ఆడని యెడల చేయవలశినపని. 118 - 119 పుటలు చూడు - మరియొక విధము. బిడ్డను వెల్లగిల పరుండ బెట్టి బిడ్డ చేతులను మోచేతివద్ద మడచి బిడ్డభుజములను ఎదురొమ్ము ప్రక్కలందు జేర్చి బిడ్డయొక్క ఎదురొమ్మును వెలుపలనుండి లోపలివైపునకు అదుమునట్లు నొక్కుము. ఇప్పుడు ఊపిరి తిత్తులలోనుండు గాలి బయటికి పోవును. అంతట మోచేతులవద్ద పట్టుకొని బిడ్డభుజములు చక్రార్ధాకారముగా వెలుపలి వైపునకు తిరుగునట్లుగా త్రిప్పుచు భుజములను ఎదురొమ్ము ప్రక్కల నుండి తలపక్కలకు వచ్చునట్లు త్రిప్పవలెను. ఇప్పుడు బిడ్డ ఛాతీ కొంచెము తెఱవబడి ఊపిరి తిత్తులలోనికి కొంచెముగాలి పోవును. పిమ్మట బిడ్డచేతులను క్రమముగ వెలుపలి ప్రక్క నుండి క్రిందివైపునకు త్రిప్పుచు వచ్చుచు మొట్టమొదట చేసి వల్లే బిడ్డభుజములను ఛాతీ ప్రక్కలకు చేరనిచ్చి మెల్లగా వానితో ఛాతీని అదుముము. ఇప్పుడు తిరిగి ఊపిరితిత్తులలో

నుండు గాలి వెలుపలికి పోవును. ఇట్లు ఊపిరితిత్తులలో నుండు గాలిని వెలుపలికి గెంటుచు, తిరిగి వానిని పూరించుచు, నిమిష మునకు రమారమి 18 ది సార్లు ఊపిరి ఆడునట్లు చేయవలెను. ఇట్లు చేయునప్పుడు నాలుకమణగి గొంతుక కడ్డము పడ కుండ కొంచెము ముందునకు లాగి పట్టియుంచవలెను. సహాయము చేయుటకు మరియొక రున్నయెడల వారు బిడ్డ కాళ్లవద్ద బిడ్డముఖము వైపునకు చూచుచు కూర్చుండి యెదు రొమ్మును అదుమవలసి వచ్చినప్పుడు తన రెండుచేతులను బిడ్డ ఛాతీకి రెండువైపులను వేసి మెల్లగ అదుముచు, తిరిగి విడుచుచు తిరిగి అదుముచు మొదటివానికి సహాయము చేయవచ్చును. అంతట సహజముగనే శ్వాసకోశము లాడవచ్చును. పైనిచెప్పిన ప్రకారము ఉచ్ఛ్వాస నిశ్వాసలను జరుపుటకు కృత్రిమశ్వాస క్రియ-లేక విధానము అని పేరు.

నీటిలో మునుగుటచే ఊపిరి ఆడకపోవుటకు చికిత్స:—బిడ్డను నీటిలోనుండి లేవనెత్తినవెంటనే కాళ్లవైపు కొంచము యెత్తుగను తలవైపు కొంచము పల్లముగ నుండునట్లుగను, వీపుపైకిని నోరు భూమివైపుగ నుండునట్లుగను బిడ్డనుపట్టుకొని వీపుమీాద ఒకటి రెండు దెబ్బలను వేయుము. పిమ్మట పొట్టను కొంచములోపలికి అదుముము. ఇందుచే ఊపిరితిత్తుల గొట్ట ములలోను, గొంతుకలోను అడ్డుపడియుండు తెమడ నీళ్లు మున్నగునవి వెలుపలికి వచ్చును. పిమ్మట వెంటనే బిడ్డను

వెల్లగిల పరుండబెట్టవలెను. అటుపిమ్మట పైన చెప్పిన ప్రకారము కృత్రిమశ్వాస క్రియను జరపవలెను. అప్పుడప్పుడు బిడ్డను ప్రక్కకు తిప్పి నోటిలో నీళ్లున్నయెడల ప్రక్కకు పడిపోవునట్లు చేయవలెను. ఈప్రకారము విసుపుచెందక ఒకటి రెండు గంటలసేపు చేయుటచే అరఘంటసేపు నీటిలోమునిగి యున్నవారుగూడ బ్రతికి యున్నారు. కృత్రిమశ్వాసక్రియను చేయునప్పుడు బిడ్డను వెచ్చవెచ్చగనుండు కంబళ్ళలో పరుండబెట్టి వేడినీళ్ళ సీసాలను ప్రక్కలందు పెట్టవలెను.

<u>గజ్జి</u>:—కురుపులు చూడు.

<u>గాయములు</u>:—రక్తస్రావము చూడుడు. వీని చికిత్సలో పరిశుభ్రత ముఖ్యము. సూక్ష్మజీవి సంహారకములగు ద్రవములచే కడుగుటయు, పిమ్మట వానిలో సూక్ష్మజీవులు ప్రవేశింపకుండ పరిశుభ్రమైన కట్లు కట్టుటయు ముఖ్యము. రావి, కరక్కాయ, మొదలగు వానియొక్క కషాయములు పుండ్లు కడుగుటకు మంచివి. కురుపులకు చెప్పినమందులు పుండ్లకు వేయవచ్చును. టించర్ అయోడిన్ గాయములకు మంచిది. మైలతుత్థము దుర్మాంసము కోయుటకు మంచిది. మెళుకువతో నుపయోగించ వలెను.

<u>గోరుచుట్టు</u>:—గోళ్ళవద్దపగిలి ఆపగులుగుండ సూక్ష్మజీవులు ప్రవేశించుటచే చీముపట్టి గోరునుండి ఎముకవరకు ఈచీము వ్యాపించి ఎముకకూడ చచ్చిపోవచ్చును. ఇందు

నొప్పి అధికముగ నుండును. మొట్టమొదటనే కనిపెట్టి ఒక నిమ్మకాయిలో ఒకకొనను రంధ్రముచేసి ఆరంధ్రముగుండా వ్రేలునుదూర్చి కాయచుట్టును తడిగుడ్డను చుట్టియుంచిన యెడల ఒకానొకప్పుడు వ్యాధి వెంటనే నిలిచి పోవచ్చును. అట్లు నిలువనియెడల వేడివేడి పిండికట్లను రెండు ఘంటలకొకసారి కట్టవలెను. నీరుల్లిపాయి, వాము, సమభాగములుగ తొక్కి కొంచము ఆముదము వేసి ఉడికించి వెచ్చవెచ్చగ రెండు ఘంటలకొకసారి కట్టవచ్చును.

<u>చెవి</u>:—అన్యపదార్థముల ప్రవేశము అనగా గింజలు పురుగులు మొదలగునవి చెవిలోపడుట. పైనున్నయెడల చెవి కషాయము లేకుండ మెల్లగా తీసివేయవలెను. గోరువెచ్చని నూనెను చెవిలోపోసిన ఊపిరిఆడక పురుగుచచ్చును. చెవులకు గోరువెచ్చని నీళ్లతో పిచికారి చేసినయెడల గింజలు ఇతరమైన పదార్థము బయలుపడవచ్చును. సులభసాధ్యము కానియెడల వైద్యునకుచెప్పి పంపవలెను. అధికముగ పుల్లలతో పొడచిన యెడల చెవిలోని డప్పుచిల్లిపడి చీముపట్టి మెదడువరకు పోయి బిడ్డకు మరణముకూడ సంభవించును.

<u>చెవులోకురుపు</u>:—చీము పోటు ఉన్నయెడల చెవి చుట్టును వేడివేడి ఒత్తడములను వేయవలెను. పరిశుభ్రమైన దూదిని పుల్లకుచుట్టి నెమ్మదిగ చక్కగ చీమును తుడవవలెను. ఇంగువ వెల్లుల్లిపాయి వీనితో కాచిననూనెను గోరువెచ్చగ

చెవిలో వేయవలెను. చెవిలోపుల్లలుపెట్టి పొడవ కూడదు. అధికముగ పిచికారకూడ చేయగూడదు. పిచికార చేసేయెడల చక్కగకాగి చల్లారిననీళ్ళతో గోరువెచ్చగ నుండునట్లు చేయవలెను గాని చన్నీళ్లతో చేయగూడదు.

చెవిలోపోటు:—సామాన్యముగ చంటిబిడ్డల చెవులలో సున్నిపిండి, గులివి ఏవైన గింజలు మొదలగునవి చేరునప్పుడు, ఇది హెచ్చుగవచ్చును. చెవులో అనుదినము చమురువేయు ఆచారము మంచిది. చీము వచ్చుచున్నయెడల గోరు వెచ్చని పరిశుభ్రమైన నీళ్లతో మెల్లగ పిచికారిచేయుట మంచిది. చెవిలో మైల లేకుండ పోటున్నయెడల వెచ్చ వెచ్చని ఒత్తడము మంచిది. ఒత్తడముచూడు.

బెణుకులు:—సామాన్యముగ చంటిబిడ్డలుక్రిందపడినను బెణకదు. అశ్రద్ధగ చేయిగాని కాలుగాని ఈడ్చినప్పుడు గూటి లోనుండి ఎముక బయటికిరావచ్చును. సరిచేయుటకు తగిన చికిత్సకుని వద్దకు పంపుము.

తెగుట:—రక్తస్రావము చూడు. తెగినప్పుడు రక్తస్రావము నిలిపి త్రిఫలాచూర్ణము, కాల్చిన గుడ్డమసి, చక్కెర, సున్నము, టించరు అయిడిన్ మొదలగు సూక్ష్మజీవి రహితములగు మందులనువేసి పరిశుభ్రములగు గుడ్డలచే కట్టవలెను.

తేలుకాటు:—బిడ్డకు తేలుకుట్టిన యెడల ఒకానొకప్పుడు మిక్కిలి అపాయకరము కావచ్చును. సందర్భపడిన

యెడల మంచుగడ్డ నొప్పిని వెంటనే తగ్గించును. తేలుకుట్టిన వెంటనే కుట్టినచోటునకు పైభాగమును గట్టిగ బిగించి కట్టి కొంచము రక్తము పిండివేయుట మంచిది. నీరుల్లిపాయి, వెల్లుల్లిపాయి, కుంకుడుకాయి మొధలగునవి కొన్నిమందులు కొంతమందికి గుణము చేయును. హితముగ నున్నయెడల వేడి నీళ్ళలో తేలుకుట్టిన భాగము ముంచి యుంచవచ్చును. కొకైన్ మార్ఫియా అను మందులు మిక్కిలి జాగ్రత్తగ నుపయోగించిన లాభకారులు. కుట్టిన భాగమును మొద్దు బారునట్లు చేయును. మైలుతుత్థము, సున్నము, నవాసారము, అమ్మోనియా, నైట్రికాసిడ్, సోడాపౌడర్ మొదలగు మందులను కొందఱుపయోగించెదరు.

పండ్లువచ్చుట:—పండ్లు వచ్చునప్పుడు కొందఱు బిడ్డలకు విరేచనములు కొందఱకు వాంతులు, కొందఱకు ఈడ్పు రావచ్చును, కొందఱు బిడ్డలు అనవసరముగ అధికముగ నేడ్చెదరు. పొటాసియం బ్రోమైడ్ ఒకగ్రేన్ మోతాదుచొప్పున నిచ్చుచు మలబద్ధము లేకుండ చూచుకొనవలెను. ఆహారము తగ్గించవలెను. ఈడ్పు మొదలగు లక్షణముల చికిత్సకు ఆయా ప్రకరణములను చూడుము.

పాముకాటు:—తాచుపాము కాటునకు చికిత్ససరిగా తెలియదని చెప్పవచ్చును. పాము కఱచినచోటకు కొంచెము పైని కట్టుగట్టి కఱచినచోట మఱికొంచెము చీల్చి కొంచెమురక్తము

బయటికి పోనిచ్చి ఆవ్రణములో పొటాసియమ్ పెర్మాంగనేట్ అను మందును రుద్దుట ప్రశస్తమైన చికిత్సయని నవీన శోధకుల యభిప్రాయము.

పిండికట్లు:—ఒత్తడములు చూడుడు.

రక్తస్రావము:—అనగా నెత్తురుగారుట. గాయముగుండగాని, పండ్లచిగుళ్ళగుండగాని, ముక్కులోనుండిగాని ఊపిరితిత్తులలోనుండిగాని, కడుపులోనుండి నోటిగుండగాని అధోమార్గమునగాని రక్తస్రావము కావచ్చును. రక్తస్రావము మూడువిధములు.

1. ధమనులగుండ స్రవించునది. ఈ రక్తము మిక్కిలి ఎర్రగ నుండును. ఉంకుండి దుముకుచు వచ్చును.

2. సిరలగుండ స్రవించునది. కొంచము నలుపు రంగుగ నుండును. దుముకుచురాక ఒకటే పొర్లుగవచ్చును.

3. కేశనాళములనుండి వచ్చునది. ఇది మెల్లమెల్లగ ఊరుచువచ్చును.

ధమనులనుండి వచ్చురక్తము గుండెకాయనుండి ఇతర ప్రదేశములకు పోవునది. సిరలనుండివచ్చురక్తము ఇతర ప్రదేశములనుండి గుండెకాయకు వెళ్లి చేరునది. ఈరెంటినుండి స్రవించు రక్తస్రావము నిలుపుటకై ఆ రక్తము ఏవైపునుండి ఏవైపునకు ప్రవహించుచున్నదో తెలిసికొనుట యవసరము. రోగి నెల్లప్పుడు పరుండబెట్టి యుంచుటయుక్తము.

అప్పుడు గుండెల పనితక్కువై రక్తప్రవాహముయొక్క వేగముతగ్గును. ఏభాగమునుండి రక్తము ప్రవహించుచుండునో ఆ భాగమును ఎత్తి పట్టియుంచుట మంచిది. అందుచే అక్కడికి వచ్చిచేరు రక్తముయొక్కప్రవాహము తగ్గియుండును.

1. ధమనులనుండి వచ్చు రక్తస్రావమును నిలుపుట. మిక్కిలి కొద్దిగనుండు నెడల నెత్తురు గడ్డకట్టిన వెంటనే దానంతట అదే నిలచిపోవును. అట్లు నిలవనియెడల రక్తస్రావముకలుగు స్థలమునకు పైభాగమున గుడ్డ గట్టిగ బిగించి కట్టవలెను. బిగింపు సరిగా లేనియెడల ఆగుడ్డ కట్టుగుండా, పెన్సలనుగాని గట్టి కఱ్ఱపుల్లనుగాని దూర్చి, కట్టినగుడ్డ మెలితిరిగి బిగిసికొనునట్లు పుల్లను గిరగిర త్రిప్పవలెను. ఇట్లు చేసినయెడల గుండెనుండివచ్చు రక్త నాళముపై ఒత్తుడు కలిగి దాని కాలువ మూసికొనిపోయి రక్తప్రవాహము తగ్గును. ఇదిగాక ఒక వ్రేలునుండి రక్తము స్రవించుచున్నయెడల గాయమునకుపైని వ్రేలిని ప్రక్కలయందు గట్టిగ నొక్కిన యెడల అచ్చటనుండు ధమనులు అదమబడి రక్తము నిలచిపోవును. అఱచేతినుండి రక్తము వచ్చుచున్నయెడల మణికట్టువద్ద ముందువైపున రెండుప్రక్కలనున్న రెండు ధమనులను రెండు వ్రేళ్లతో గట్టిగ అదుముచు ధమనులను ఎముకపై అదుమవలెను. అట్లు అణచినయెడల రక్తస్రావము నిలుచును. ముంజేతినుండి రక్తస్రావమగు చున్నయెడల భుజముయొక్క లోపలిభాగమున

మోచేతికి కొంచెముపైని అదురుచుండు ధమనిని భుజాస్థిమీదికి అనునట్లు బొటనవ్రేలితో నొక్కిన రక్తస్రావము నిలుచును. పాదమునుండిగాని, కాలునుండిగాని రక్తస్రావ మగుచున్న యెడల గజ్జలక్రింద తొడలో మధ్యభాగమున నుండు ధమని మీద బొటనవ్రేలువేసి ధమనిని వెనుక వైపునకు అదిమిన రక్తస్రావము నిలుచును.

2. సిరనుండి రక్తస్రావము. చిన్న సిరనుండియైన యెడల రక్తము వచ్చుస్థలముననే గట్టిగ అదిమి బిగించి కట్టుగట్టిన యెడల నిలచిపోవును. పెద్ద సిరలయిన యెడల గాయమునకు పైనను క్రిందనుగూడ గుడ్డలతో బిగించి కట్టుటయుక్తము.

3. కేశనాళములనుండి రక్తస్రావము. రక్తము స్రవించు భాగముమీద అదిమి కట్టుగట్టిన నిలచిపోవును.

మంచుగడ్డ, మిక్కిలి వేడినీళ్ళు, పటికారము, వెలిగారము, కరక్కాయ, బూరుగుబంక, రావిచెక్క మొదలగు వగరుపదార్థముల కషాయములుగాని చూర్ణములుగాని రక్తస్రావము నిలుపుటకు సహాయపడును. కడుపులోనుండి రక్తస్రావ మగుచున్న యెడల గూడ వీనిలో దేనినైన నీయవచ్చును. గాయములకు సూక్ష్మజీవి సంపర్కము గలుగకుండ మిక్కిలి పరిశుభ్రముగ నుంచుట అత్యావసరము.

<u>వస్తి</u> అనగా ఆసనమార్గమున మందులుగాని, ఆహార పదార్థములుగాని, సబ్బునీళ్ళు, తైలములు మొదలగు వానిని

గాని యెక్కించుట. బిడ్డలకు విరేచనము సరిగా కానియెడల సూచిగాచేసిన సబ్బుముక్కనుగాని, ఆముదములో ముంచిన తమలపాకు తొడిమనుగాని ఆసనములో నుంచుదురు. ఇందు వలన వారలకు వెంటనే విరేచనమగును. రెండడుగుల ఎత్తు ననున్న ఒకడబ్బాలో 10 లేక 15 పలములు సబ్బునీళ్ళు పోసి ఆడబ్బాయొక్క అడుగు భాగముననుండి వెలువడు ఒక రబ్బరు గొట్టముగుండ ఆనీటిని ఆసనములోని కెక్కించవచ్చును. ఇట్లు చేసినయెడలగూడ బిడ్డకు సుఖవిరేచన మగును. బిడ్డకు ఈడ్పు మొదలగునవివచ్చి స్మృతి తెలియ నప్పుడును, మిక్కిలి వాంతియగుచు ఆహారము ఇముడనప్పు డును ఆసనమార్గమున ఈరీతిగనే ఆహారపదార్థములు గూడ ద్రవరూపమున ఇయ్యవచ్చును. కొన్ని ఇతర మందులుకూడ ఇట్లియ్యవచ్చును.

<u>వాపు</u>:—ఒత్తడములు చూడు.

<u>విషమజ్వరములు:</u>—ఇవి సామాన్యముగా చలితో వచ్చుటచే వీనికి చలిజ్వరము లనియుపేరు. చేదుగనుండు వేము, నేలవేము, కటకరోహిణి మొదలగు మూలికలు ఈజ్వరమును మాన్పగలిగినను క్వయినా వీనియన్నిటికంటె వెంటనే పనిచేయు నని నాయభిప్రాయము. అనుదినముగాని రెండుదినముల కొకసారిగాని, మూడుదినముల కొకసారిగాని విడిచి విడిచివచ్చు జ్వరములకు జ్వరము అను 11-వ ప్రకరణములో చెప్పిన సుదర్శన

చూర్ణము మొదలగు చికిత్సలు పనిచేయనియెడల క్వయినాను పడాదిలోపుబిడ్డకు సగము లేక ఒకగురిగింజయెత్తు నాలుగుగంటల కొకసారి నిమ్మపండు రసముతోగాని చింతపండు నీళ్ళతోగాని కలిపి ఇయ్యవచ్చును. మలబద్ధము లేకుండ చూచుకొనవలెను. శరీరము మిక్కిలి చల్లబడినయెడల మందు నిలుపవలెను.

విషములు:—బిడ్డ విషము దేనినైనను త్రాగినట్లుగాని తినినట్లుగాని అనుమానము తట్టిన యెడల వెంటనే ఆ సమాచారమును స్పష్టముగ తెలియజేయుచు వైద్యునకు చెప్పి పంపవలెను. పిమ్మట ఆవిషపదార్థ మెద్దియో మొట్టమొదట తెలిసికొనవలెను. ఎందుకనగా విషపదార్థమును బట్టి చికిత్స భేదముగ నుండును. విషపదార్థములలో ముఖ్యముగ రెండు భేదములు గలవు.

1. పుండు చేయునవి. గంధక ధృతి, సురేకారధృతి, కార్బాలిక్ ఆసిడ్, పాషాణము, సౌవీరము మొదలగునవి.

2. మెదడును చెరిపి వేయునవి. నల్లమందు, ఉమ్మెత్త, సారాయి, మొదలగునవి.

వీనిలో పుండుచేయు విషములను కక్కించుటకై సామాన్యముగా వాంతిజేయు పదార్థములను ఇయ్యకూడదు. ఇచ్చినయెడల ఒకానొకప్పుడు పుండు అధికమై నెత్తురు కక్కుకొనుటచే రోగికి ఎక్కువ హానికలుగవచ్చును. పుండుచేయు విషముగాక రెండవజాతి విషములను రోగితినిన

యెడల వెంటనే కక్కించుటకు ప్రయత్నించవలెను. ఉప్పు ఒకపలము పావుశేరు నీళ్ళలో గలపి రోగిపొట్టనిండి కక్కుకొను వరకును త్రాగించుచుండవలెను. ఉప్పు దగ్గఱ లేనియెడల గోరువెచ్చని నీళ్లను, పొట్టనిండి ఎక్కసముగ నుండునట్లు త్రాగించి వ్రేళ్ళనుగాని కోడి ఈకనుగాని గొంతుకు లోనికి చొరచి వాంతియగునట్లు చేయవలెను. ఆవపిండి, పావుశేరునీళ్ళకు తులమెత్తు చేర్చిగాని, మంగకాయి 5 పలముల నీళ్ళకు 15 గురిగింజలెత్తు చేర్చిగాని, రాగిడబ్బుల కిలంనీళ్ళతో జేర్చిగాని మైలతుత్థము పలమునీళ్ళకు ఒకగురిగింజెత్తు చేర్చిగాని వాంతి వచ్చువరకు ఈయవలెను. తగిన వైద్యుడు సమీపమున నున్న యెడల ఒక రబ్బరుగొట్టము సహాయముతో కడుపుకడిగి వేయవచ్చును. పిమ్మట, ఆయా విషపదార్థమునుబట్టి తగిన విరుగుడు పదార్థము నియ్యవచ్చును. అమ్ల సంబంధమయిన విషములకు సున్నపునీళ్ళు, సోడాపౌడరు, మొదలగునవి విరుగుడు. క్షార సంబంధములగు విషములకు నిమ్మపండు మొదలగు పులుసు పదార్థములు విరుగుడు. నరములద్వారా మెదడునకు వ్యాపించు ముష్టిగింజలు, ఉమ్మెత్త నల్లమందు మొదలగు విషములు తిన్నయెడల వాటిని వెంటనే కక్కించుటకు ప్రయత్నము చేసిన పిమ్మట ఆయావిషములు చేయగలుగు దుర్గుణములకు వ్యతిరేకగుణము గలుగజేయు మందులను ఈయవలెను. రోగికి వెచ్చన గలుగునట్లు, వేడిబట్టలు వేడినీళ్ళ సీసాలు ఉప

యోగించుచు, తగిన యాహారమునిచ్చుచు గడియలు గడుపునట్లు చూడవలెను. రోగి జీవించిన కొలదిని వ్యాధి సుసాధ్యమగును. కొన్ని విషములను వాని విరుగుళ్ళకు క్రింది పట్టీలో నిచ్చియున్నాము.

విషముపేరు.	విరుగుడు పేరు.
1. నల్లమందు	1. వాంతి గలిగించు పదార్థములు. 2. రోగిని నిద్రపోనీయక గిల్లుట, నడిపించుట, కొట్టుట, అమ్మోనియాను వాసనచూపించుట. 3. కాఫీ త్రాగించుట, కాఫీ వస్తి. 4. ఉమ్మెత్త ఆకురసం ఏడాదిలోపు బిడ్డకు పావుఘంట కొకసారి మూడుచుక్కలు తేనెతో నీయవలెను. లేక ఎట్రోపీన్ సల్ఫేట్ గురిగింజలో నూరు లేక రెండువందల వంతు బోలు సూదితో ఇంజక్షన్ చేయవలెను.
2. ఉమ్మెత్త	1. వాంతిని గలుగ జేయు ప్రక్రియలు. 2. కాఫీ, బ్రాంది మొదలగునవి. 3. నల్లమందు బహు స్వల్పముగా సూచి ముఖమున నీయవలెను. 4. కృత్రిమశ్వాస క్రియ, (154-వ పుట చూడు). 5. వేన్నీళ్ల సీసాలు, వెచ్చనిపడక.
3. ముష్టిగింజలు	1. వాంతిని గలుగ జేయుమందులు. 2. ఆసన మార్గమున పొటాసియమ్ బ్రోమైడ్ లేక క్లోరల్ హైడ్రేట్.

విషము పేరు.	విరుగుడు పేరు.
	3. క్లోరోఫారము వాసనచూపించి స్మృతి తప్పించుట.
	4. కృత్రిమశ్వాస విధానము. 154-వ పుట చూడు.
4. గంధకధృతి సురేకార ధృతి మొదలగు పుండు చేయు మందులు	1. వాంతి గలిగించు మందులియ్యకూడదు. 2. వెంటనే సున్నపు నీళ్లు, సబ్బునీళ్లు, సోడాకలిపిన నీళ్లు, మొదలగున వీయవలెను. 3. పిమ్మట కోడిగుడ్డుసొన, నెయ్యి, పాలు మొదలగు చమురు పదార్థముల నీయవలెను. 4. నొప్పికి నల్లమందు స్వల్పముగ నియ్యవచ్చును. 5. శీతలత్వమునకు బ్రాంది, వెచ్చని పడక.
5. సౌవీరము	1. కోడిగుడ్డు సొన, పాలు, వరిపిండి గలిపిననీళ్లు మొదలగునవి వెంటనే ఈయవలెను. 2. పిమ్మట వాంతి చేయించవలెను. 3. సున్నపునీళ్లు, సోడాపొడరు గలిపిన నీళ్లు, పొటాసియమ్ అయొడైడ్, సబ్బునీళ్లు, రావిచెక్క, తుమ్మచెక్క మొదలగు వగరు పదార్థముల కషాయములు మంచివి.
6. ఉల్లిపాషాణము	1. వాంతిచేయు ప్రక్రియలు చేయవలెను. 2. ఆముదము నీళ్లలోగలిపి ఈయవలెను. 3. లోహభస్మము. 4. బ్రాంది, వేడిపడక, వేన్నీళ్ల సీసాలు.

విషము పేరు.	విరుగుడు పేరు.
7. నాభి	1. వాంతికలిగించు ప్రక్రియలు చేయవలెను. 2. కృత్రిమశ్వాస విధానము. 154-వ పుట చూడుము. 3. బ్రాందిగాని, ఎట్రోపీన్ గాని, డిజిటాలిస్ గాని నోటిగుండను సూచీ ముఖమునను ఈయవలెను. 4. వేడిపడక, వెన్నీళ్ల సీసాలు.

సంపూర్ణము.

PRINTED AT THE INDIA PRINTING WORKS, MADRAS.

END OF
TITLE